ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-3-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 48 పేజీలు: 10+4 వెల: 6.50

**రూపాయి ఢమాల్**
ఆల్‌టైం కనిష్టానికి మారకం విలువ

**హెచ్‌డిఎఫ్‌సి చైర్మన్ రాజీనామా**
బ్యాంకు షేర్లు భారీ పతనం

వాణిజ్యం పేజీలో

## భారత్‌పై పెనుప్రభావం

ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడి భారత్‌లో గ్యాస్ ధరలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపనుంది. అటు ఇరాన్ దాడులతో ప్రపంచంలోనే అతిపెద్ద ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జి) ఉత్పత్తి సంస్థలు ఖతార్ ఎనర్జీకి చెందిన రాస్ లఫాన్, మెసాయిడ్ ప్లాంట్లలో తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేసింది. ఇది ప్రపంచ ఎల్ఎన్‌జి సరఫరాలలో సుమారు 20 శాతాన్ని ప్రభావితం చేసింది. భారత్ తన ఎల్ఎన్‌జి అవసరాల కోసం ఖతార్‌పై ఎక్కువగా ఆధాపడింది. ఖతార్‌లో ఉత్పత్తి నిలిచిపోవడం, హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు సరఫరా గొలుసుకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఎల్‌పిజిలో 80-85శాతం గల్ఫ్ దేశాల నుంచి వస్తుంది. చమురు, గ్యాస్ కేంద్రాలపై దాడులు కొనసాగితే భారత్‌లో చమురు, గ్యాస్ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి.

### దాడులు ఆపాలి

ఇరాన్‌కు 12 దేశాల అల్టిమేటం
రియాద్‌లో అరబ్, ఇస్లామిక్ దేశాల విదేశాంగ మంత్రుల భేటీ



గురువారం ఇజ్రాయెల్ దాడితో దగ్ధమవుతున్న ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రం

# ఇంధన సంక్షోభం

### రంగంలోకి మోడీ

ప్రపంచ దేశాధినేతలకు ప్రధాని ఫోన్
మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై చర్చలు
తక్షణమే శాంతి నెలకొనేలా చూడాలని నిర్ణయం

**ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు**
ప్రతిగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణుల ప్రయోగం
ప్రపంచంలోనే అతిపెద్ద చమురుక్షేత్రం ధ్వంసం
ఇరాన్‌పై సైనికచర్యకు దిగుతాం: సౌదీ హెచ్చరిక
ఇంధన యుద్ధం దిశగా పశ్చిమాసియా
ప్రపంచ దేశాలు ఆందోళన

5

గల్ఫ్ దేశాల్లో చమురు కేంద్రాలు, గ్యాస్ క్షేత్రాలపై దాడులతో ఇంధన సంక్షోభం ముంచుకొస్తోంది. అంతర్జాతీయ విపణిలో చమురు గ్యాస్ ధరలు భగ్గుమన్నాయి. బ్యారెల్ ముడి చమురు 125 డాలర్లకు చేరింది. గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రపంచ ఎనర్జీ సరఫరాకు వెన్నెముక లాంటిదిగా భావించే చమురు క్షేత్రాల్లో మంటలు చెలరేగడం ఆందోళనలను మరింత పెంచింది. సౌత్ పార్స్- నార్త్ డోమ్ రిజర్వాయర్ ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ నిల్వగా గుర్తించబడింది. ఇందులో ఖతార్ కూడా భాగస్వామి. ఖతార్ ఈ ఫీల్డ్ నుంచే పెద్ద ఎత్తున ఎల్ఎన్‌జి ఉత్పత్తి చేసి ప్రపంచానికి ఎగుమతి చేస్తుంది. ఇక్కడ ఏ చిన్న అంతరాయం వచ్చినా గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది.

### అది తప్పే!

సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ దాడి సమంజసం కాదు
ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ క్షిపణుల దాడి తప్పే
మళ్లీ టెహ్రాన్ దాడి చేస్తే మేమే బరిలోకి దిగుతాం: ట్రంప్ హెచ్చరిక





### మార్కెట్‌కు చమురు మంటలు

సెన్సెక్స్ 2497 పాయింట్లు, నిఫ్టీ 778 పాయింట్లు పతనం
రూ.13 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరి

### సముద్ర కేబుళ్లు కత్తిరిస్తాం

ప్రపంచదేశాల ఆర్థిక మూలాలే లక్ష్యం
హౌతీలు హెచ్చరిక

# పద్దుకు వేళాయె!



రూ.3లక్షల 20 వేల కోట్ల పైనే బడ్జెట్?
క్యూర్, ప్యూర్, రేర్‌లకే అధిక ప్రాధాన్యం
మెట్రో, మూసీ, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన అజెండా

**నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సిఎం భట్టి, మండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టేందుకు ముహూర్తం నిర్ణయించుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శాసనమండలిలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అంతకు ముందు ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదం తెలుపనుంది. ఈసారి బడ్జెట్ ప్రతిపాదనలు రూ.3లక్షల 20వేలకు పైగా ఉండనున్నాయని తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధిని విస్తృతంగా చేపట్టేందుకు క్యూర్,ప్యూర్,రేర్ విధానంను ప్రభుత్వం ఎంచుకున్న నేపథ్యంలో ఈ మేరకు బడ్జెట్ కేటాయింపులు విస్తృతంగా కేటాయించనున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో మెట్రో రైల్ 1ను ప్రభుత్వం స్వయంగా నిర్వహించేందుకు ముందుకు వచ్చినందున భారీ ఎత్తున నిధులు కేటాయించనుంది. ఇదే సమయంలో మూసీ పునరుజ్జీవం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఆ మేరకు అధిక నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. పేదలకు అందించే చేయూత ఫించన్‌ను రూ.2000 నుంచి రూ.2500కు పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈసారి రెండు,మూడు కొత్త పథకాలు ప్రకటిస్తారని తెలుస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పద్దు రూ.3,04,865 కోట్లు ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నెలాఖరు వరకు పది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,93,313 కోట్ల వ్యయం చేసింది. మిగిలిన రెండు నెలల్లో చేసే వ్యయం,ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని బడ్జెట్ అంచనాలను సవరించనున్నారు. సవరించిన బడ్జెట్ ఆధారంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి పన్నులు, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయం, కేంద్ర నిధులు, అప్పులు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పద్దు ఖరారు చేస్తారు. రానున్న బడ్జెట్ పద్దు రూ.3.20 లక్షల నుంచి రూ.3.30 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఆర్థిక శాఖ కసరత్తు మొత్తం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని అంశాలను పరిశీలించి బడ్జెట్‌కు తుది రూపు ఇచ్చారు. ఈసారి ఎప్పటిలానే సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేస్తారని సమాచారం.శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఆ మరుసటి రోజు సభ్యులకు (21వ తేదీన) సెలవు ఇస్తారు. అయితే 21వ తేదీన రంజాన్ పండుగ ఉండటంతో ఆరోజుతో పాటు మరుసటి రోజు 22వ తేదీ కూడా అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఇచ్చారు. దీంతో 23వ తేదీ నుంచి రెండు రోజుల పాటు బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చించనున్నారు.శాసనమండలిలో రెండుసార్లు అసెంబ్లీ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.ఈసారి మొదటిసారిగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌ను శాసనమండలిలో ప్రవేశపెడుతున్నారు. మౌలిక సదుపాయాల రంగంలో రోడ్లు, పట్టణ అభివృద్ధి, మెట్రో విస్తరణ, ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేసే అవకాశం ఉంది. దీనివల్ల రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు, వ్యాపార మరియు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని భావిస్తున్నారు. యువతకు సంబంధించిన ఉద్యోగ పథకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది. స్టార్టప్‌లు, ఐటీ, ఫార్మా, సాంకేతిక రంగాలను ప్రోత్సహించడానికి సబ్సిడీలు, పెట్టుబడులు ప్రవేశపెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే

>>2

# రైతు నామ సంవత్సరం

22 నుంచి రైతు భరోసా వేస్తాం.. రైతును రాజు చేయడమే లక్ష్యం
రవీంద్రభారతిలో శ్రీపరాభవ నామ ఉగాది వేడుకల్లో సిఎం రేవంత్
హాజరైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు



గురువారం చిరంజీవికి అవార్డు అందజేస్తున్న సిఎం రేవంత్

సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తున్నాం
ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రం
గద్దర్ అవార్డుల కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి
మెగాస్టార్ చిరుకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం
హాజరైన సినీ ప్రముఖులు

3

### చిత్రపరిశ్రమకు హైదరాబాద్ సేఫ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** ఈ నూతన సంవత్సరం రైతు నామ సంవత్సరం., ఉగాది ప్రధానంగా రైతుల పండుగ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం భాష,సంస్కృతి,దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన శ్రీపరాభవ నామ ఉగాది వేడుకల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పంచాంగం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని చెప్పారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే రైతుల విషయంలో అతి తక్కువ రుణ భారం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ప్రకటించడం మనకు గర్వకారణం అని చెప్పారు. తెలంగాణలో 70 శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే అందుకే రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశామని తెలిపారు. ప్రతి ఎకరాకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, రూ.18 వేల కోట్లు రైతు భరోసా కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 22 న మరోసారి రైతుభరోసా నిధులను విడుదల చేయబోతున్నామని, ఆర్థిక మంత్రి మళ్లీ ప్రారంభించబోతున్నారని చెప్పారు. రైతు సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పట్టుపడుతోంది ధరణి భూతాన్ని తరిమేసి భూ భారతితో భూసమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. దేశంలోనే

>>2



## రైతు భరోసా మార్గదర్శకాలు

కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులకు దరఖాస్తుకు అవకాశం

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** భూమి కొనుగోలు చేసి కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు పంట పెట్టుబడి సాయం అందించేందుకు ఉద్దేశించిన రైతు భరోసా పథకానికి మార్గదర్శకాలు విడుదల అయ్యాయి. కొత్త రైతులు రైతు భరోసా పథకానికి అర్హత సాధించాలంటే 2026 ఫిబ్రవరి 28నాటికి భూమి పాస్ బుక్ పొంది ఉండాలి. డిజిటల్ సంతకం సైతం పూర్తి చేస్తేనే రైతు భరోసా పథకం వర్తిస్తుంది. రైతు కొనుగోలు చేసిన వ్యవసాయ భూమి ధరణి పోర్టల్‌లో ఖచ్చితంగా రిజిస్టర్ అయి ఉండడంతోపాటు అది వ్యవసాయయోగ్యమైన భూమి అయి ఉండాలి. కొత్తగా పాసుపుస్తకంగా పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తుతో పాటు కొత్త పాస్ బుక్/ డిజిటల్ సంతకం, తమ ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్సులను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)కు అందించాల్సి ఉంటుంది. ఇప్పటికే రైతు

>>2

# పంట పొలాల్లో కిష్కిందకాండ!

కోతుల బెడదతో సాగురంగం కుదేలు
రాష్ట్ర సాగు ముఖచిత్రమే మారిపోతున్న వైనం
పత్తి, మిర్చి పంటలను వదలని వానరాలు
కోతుల ముప్పు లేని వరిసాగుకే రైతుల మొగ్గు



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** కోతులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏళ్లుగా కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధి మొదలు మంత్రుల వరకు సమస్యను విన్నవించినా ఫలితం ఉండడం లేదు. ఒకప్పుడు రాష్ట్రంలో రైతులు అన్నిరకాల పంటలు పండించేవారు. నేడు కోతులు తినలేని వరి, పత్తి, మిర్చి లాంటి పంటలను మాత్రమే సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తెలంగాణలో నూనె గింజలు, పప్పు దినుసులకు అధిక ప్రాధాన్యం ఇచ్చే రైతులు కోతుల కారణంగా నేడు అలాంటి పంటలు వేసి నష్టపోలేమని తేల్చి చెబుతున్నారంటే పంట పొలాల్లో కోతులు సృష్టించే విధ్వంసకాండ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కోతుల బెడద కారణంగా రాష్ట్రంలో నూనె, పప్పు దినుసుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఊరూరా విపరీతంగా సాగు చేసే మొక్కజొన్న సాగు విస్తీర్ణం కూడా పూర్తిగా పడిపోయింది. నూనెలు, పప్పు దినుసుల దిగుబడి 50 శాతం మేరకు తగ్గిపోయింది. నాడు కాయధాన్యాల పంటలు పండించటంలో తెలంగాణ అగ్రభాగాన ఉండేది. కానీ నేడు 11వస్థానానికి పడిపోయింది. కోతులబెడద కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వరి పండించడానికి మాత్రమే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంట పొలాలపై వానరమూకలు దాడి చేసి పువ్వులు కాయలు తింటూ రైతాంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి.లక్షలాది ఎకరాల్లోకూరగాయలు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను నాశనం చేస్తున్నాయి.

కోతులతో కోట్ల రూపాయల పంట నష్టం జరుగుతోంది. ప్రతి ఏటా రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి, వరి, కూరగాయల పంటలపై కోతులు మూకుమ్మడిగా దాడి చేస్తుండడంతో పంటలు పాడైపోతున్నాయి. దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వానరాలు పత్తి పంట కాపు సమయంలో కోతుల కాయలు తింటూ తీవ్ర నష్టానికి గురిచేస్తున్నాయి. కాపు కొచ్చిన మిర్చి పంటలు పాడుచేస్తున్నాయి. కూరగాయ, పండ్ల తోటలు రైతులచేతి కందకుండాచేస్తున్నాయి. కోతుల దెబ్బకు ప్రస్తుతం ప్రతిపల్లెలో పట్టణాల నుంచిసరాఫరాయ్యే కూరగాయలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. కోతుల ఉత్పత్తి ఏటా గణనీయంగా పెరుగుతున్నది. గత ఆరేడేండ్ల కిందట వేలసంఖ్యలోఉన్న కోతులు,నేడు లక్షలసంఖ్యకు పెరిగాయని

>>2

## ఐదుగురు ప్రభుత్వ విప్‌ల నియామకం

అసెంబ్లీ చీఫ్ విప్ భర్తీ కోసం కసరత్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. శాసనసభ, శాసనమండలి రెండింటిలోనూ సమన్వయం కోసం ప్రభుత్వ విప్‌లను నియమిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీలో ప్రభుత్వం తరఫున గొంతుక వినిపించేందుకు, ఎమ్మెల్యేలను సమన్వయం చేసేందుకు ముగ్గురు సీనియర్ నాయకులను విప్‌లుగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. వీరిలో వేముల వీరేశం



(నకిరేకల్ ఎమ్మెల్యే), విజయ రమణా రావు (పెద్దపల్లి ఎమ్మెల్యే), యెన్నం శ్రీనివాస్ రెడ్డి (మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే) ఉన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ పక్షాన సభ్యులను సమన్వయం చేసేందుకు ఇద్దరు ఎమ్మెల్సీలకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. వారిలో అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ఉన్నారు. సభలో కీలక బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు సభ్యులందరూ హాజరయ్యేలా చూడటం వీరి ప్రధాన విధి. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ వెళ్లకుండా విప్ జారీ చేసే అధికారం వీరికి ఉంటుంది. ఈ నియామకాలతో ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఈ ఐదుగురు నేతలు కీలక పాత్ర పోషించనున్నారు. ఇప్పటికే శాసనసభలో ముగ్గురు విప్‌లు ఉన్నారు. శాసన మండలిలో

>>2




లక్నోలోని విధాన భవన్ వెలుపల గ్యాస్ కొరతపై గురువారం నిరసన తెలుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ నాయకులు, కార్యకర్తలు

# పద్దుకు వేళాయె!

>> మహిళలకు, విద్యార్థులకు, వృద్ధుల సంక్షేమ పథకాల కేటాయింపులు పెరుగుతాయని, ఆరోగ్య, విద్య రంగాలకు అదనపు నిధులు కేటాయించబడతాయని అంచనా. విద్యుత్, పవర్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉచిత విద్యుత్ పథకాల కోసం, అలాగే పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బలోపేతం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించవచ్చు. ఇది రైతులు, పట్టణ వినియోగదారులు, పరిశ్రమలకు ఉపశమనం కలిగిస్తుందని భావిస్తున్నారు. అలాగే మధ్యతరగతి పౌరులకు కొత్త పన్నులు పెట్టకుండా, పరోక్షంగా సబ్సిడీలు, పథకాల ద్వారా ఉపశమనం కల్పించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే రాష్ట్ర అప్పులు పెరగడం, ఆదాయ లోటు, కేంద్ర నిధులపై ఆధారపడడం వంటి సవాళ్లు ఈ బడ్జెట్‌కు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# హెచ్1బి వీసానుంచి వైద్యరంగానికి మినహాయింపు

## అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రత్యేక బిల్లు

**వాషింగ్టన్, మార్చి 19:** అమెరికాలో వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి మేలు చేకూరే బిల్లు ఒకటి ప్రతిపాదించారు. హెచ్1బీ వీసాల కోసం ప్రతిపాదించిన లక్ష డాలర్ల భారీ ఫీజు నుంచి వైద్య రంగానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కొందరు చట్టసభ సభ్యులు అమెరికన్ కాంగ్రెస్‌లో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలకు చెందిన సభ్యులు కలిసికట్టుగా ఈ బిల్లును తీసుకురావడం గమనార్హం. ఈ భారీ ఫీజు వల్ల దేశంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న వైద్యుల కొరత మరింత పెరిగిపోతుందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్1బీస్ ఫర్ ఫిజీషియన్స్ అండ్ ది హెల్త్‌కేర్ వర్క్‌ఫోర్స్ యాక్ట్ పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులు విదేశీ వైద్యులపైనే ఎక్కువగా ఆధారపడతాయని, లక్ష డాలర్ల ఫీజు వారికి పెను భారంగా మారుతుందని కాంగ్రెస్ సభ్యురాలు మరియా ఎల్విరా సలాజర్ అన్నారు. వైద్యుల కొరత పెరుగుతున్న తరుణంలో ఇలాంటి ఫీజులు ప్రతిభావంతులైన వైద్యులను నియమించుకోవడానికి ఆసుపత్రులకు అడ్డంకిగా మారకూడదని ఆమె స్పష్టం చేశారు. అధ్యక్షుడి ప్రకటన ద్వారా అమల్లోకి వచ్చిన ఈ ఫీజు ప్రతిపాదన, ఆరోగ్య సంరక్షణ సంస్థలను హెచ్1బీ కార్యక్రమానికి దూరం చేస్తుందని మరో కాంగ్రెస్ సభ్యుడు మైక్ లాలర్ హెచ్చరించారు. ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఇప్పటికే సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. కొత్తగా వచ్చే వలస ఉద్యోగిపై లక్ష డాలర్ల ఫీజు చెల్లించే స్థితిలో అవి లేవు. ఈ మినహాయింపు ఇవ్వకపోతే వైద్యులు హెచ్1బీ కార్యక్రమానికి దూరమై, ప్రజలకు వైద్య సేవలు అందడం కష్టమవుతుందన్నారు. చట్టసభ సభ్యుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం అమెరికాలో దాదాపు 8.7 కోట్ల మంది ప్రజలు సరైన వైద్య సదుపాయాలు లేని ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఈ ఫీజు మోయలేని భారంగా మారుతుందని కాంగ్రెస్ సభ్యుడు శాన్‌ఫోర్డ్ బిషప్ అన్నారు. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఏఎంఏ) అధ్యక్షుడు బాబీ ముక్కామల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోగులు వైద్యుల కొరతను ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో అంతర్జాతీయ వైద్య గ్రాడ్యుయేట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

# ఆరేళ్లలో 18వేల మంది గుండెపోటుతో మృతి

**చండీఘడ్, మార్చి 19:** రాష్ట్రంలో 2020 జనవరి నుంచి 2026 జనవరి మధ్య కాలంలో 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గలవారు వేల సంఖ్యలో గుండెపోటుతో మరణించినట్లు అసెంబ్లీలో హర్యానా ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆరేళ్ల కాలంలో 17,973 మంది గుండెపోటు కారణంగా మరణించినట్లు అసెంబ్లీలో తెలిపింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత ఆరేళ్ల కాలంలో ఏ జిల్లాలో, ఎంతమంది, ఎంత వయస్సు కలిగిన వారు, హార్ట్ ఫెయిల్ కారణంగా మరణించారో తెలియజేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగారు. ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సీన్‌తో సంబంధం ఉందా, ఆ దిశగా ఏమైనా చర్యలు చేపట్టారా అని ప్రశ్నించారు. అలాంటి సర్వేను నిర్వహించలేదని ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. జిల్లాల వారీగా, ఏ సంవత్సరంలో ఎంతమంది గుండెపోటుతో మరణించారో తెలిపింది. సంవత్సరాల వారీగా చూస్తే, 2020లో 2,394 మరణాలు సంభవించగా, 2021లో 3,188, 2022లో 2,796, 2023లో 2,886, 2024లో 3,063, 2025లో 3,255 మరణాలు జరిగినట్లు తెలిపింది. 2026 జనవరిలో 391 గుండెపోటు మరణాలు నమోదైనట్లు తెలిపింది.
కరోనా మహమ్మారి వచ్చిపోయిన తర్వాత దేశంలో గుండెపోటు మరణాలు పెరిగిపోయాయి. కరోనా వ్యాక్సిన్‌లే ఇందుకు ప్రధాన కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ కొందరు మాత్రం వ్యాక్సిన్‌లుకారణం కాదని అంటున్నారు. ఈ నేపథ్యం లో హర్యానా లో గత ఆరేళ్లలో సంభవించిన గుండెపోటు మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. 2020 జనవరి నుంచి 2026 జనవరి వరకు ఏ జిల్లా నుంచి ఎంతమంది, ఏ వయసు వారు గుండెపోటుతో మరణించారో తెలుపాలని ఎమ్మెల్యే అడిగారు. ఆ మరణాలకు కరోనా వైరస్‌తో, కొవిడ్ వ్యాక్సినేషన్‌తో ఏమైనా సంబంధం ఉందా ఆ దిశగా ఏమైనా సర్వే చేపట్టారా అని ప్రశ్నించారు. దాంతో అలాంటి సర్వే నిర్వహించలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. కాకపోతే జిల్లాల వారీగా సేకరించిన సమాచారాన్ని ఇచ్చింది. యమునానగర్ జిల్లాలో అత్యధికంగా, రోహ్‌తక్ జిల్లాలో అన్నింటికంటే తక్కువగా ఈ మరణాల సంఖ్య ఉందని ప్రభుత్వం తెలిపింది.

# రైతు భరోసా మార్గ దర్శకాలు

>> భరోసా కింద లబ్ధిదారులైతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ నెల 25వ తేదీలోగా కొత్త రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.
ఈ యాసంగి రైతు భరోసా నిధుల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇక నుంచి తొలి విడతలోనే లబ్ధిదారులందరికీ రైతు భరోసా నిధులు అందనున్నాయి. ఇప్పటివరకు ఎకరం భూమి ఉన్న రైతుల నుంచి మొదలుపెట్టి విడతల వారీగా ఎక్కువ పోలం ఉన్న రైతులందరికీ నిధులు జమ చేసేవారు. దీని వల్ల ఏడెనిమిది విడతల్లో డబ్బులు జమ చేయడం వల్ల ఎక్కువ భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అంటానికి చాలా ఆలస్యమవుతోంది. అయితే ఈ సారి ఈ విధానానికి రేవంత్ సర్కారు స్వస్తి పలికింది. ఇక నుంచి పెట్టుబడి సాయం విడుదల చేయడంలో కొత్త విధానాన్ని పాటించాలని నిర్ణయించింది. ఈ సారి తొలి విడతలోనే రైతులందరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేలా కొత్త నిర్ణయం అమలు చేయనున్నారు.

**తాజా మార్పుల మేరకు ఎకరం భూమికి డబ్బులు జమ**

తొలి విడతలో ఎకరం భూమికి రైతు భరోసా అకౌంట్లలో జమ చేయనుంది. అంటే ఎంత భూమి కలిగి ఉన్నా.. మొదటి ఎకరానికి రూ.6 వేలను తొలి విడతలోనే జమ చేస్తా రు. ఉదాహరణకు 5 ఎకరాల పోలం కలిగి ఉంటే తొలి ఎకరానికి రూ.6 వేలు జమ చేస్తారు. దీని వల్ల లబ్దిదారులందిరికీ ఒకేసారి లబ్ది చేకూరనుంది. మిగతా ఎకరాలకు తర్వాతి విడతల్లో డబ్బులు జమ చేస్తారు. ఈ నెల 22వ తేదీన నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో ఎకరం భూమికి రేవంత్ నిధులు విడుదల చేయనున్నారు. మొదటి విడతలో 70 లక్షల మంది రైతులకు నిధులు విడుదల చేయనుండగా ఇందుకు రూ.3,590 కోట్లు ఖర్చు కానుంది. ఇక తొలి విడత జమ చేసిన 20 రోజుల తర్వాత రెండో విడత సొమ్ము, ఏప్రిల్ నెలాఖరుకల్లా మూడో విడత నగదు జమ చేస్తారు. మూడు విడతల్లోనే ఈ సారి నగదు జమ చేసే ప్రక్రియ పూర్తి కానుంది.

## వారం - వర్జ్యం

20-03-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
విదియ రా.2.30
రేవతి రా.2.25
వర్జ్యం : మ.3.15-సా.4.44
దు.ఉ.8.36-ఉ.9.24, మ.12.39-మ.1.27
శుభసమయం: ఉ.9.35-10.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

**వృషభం:** నూతన పెట్టుబడులలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు.

**మిథునం:** సంగీత, సాహిత్యాలపట్ల ఆసక్తి చూపుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం, ఉద్యోగులకు బదిలీలు.

**కర్కాటకం:** బ్యాంకింగ్ వ్యవహారాలకు ఎక్కువ సమయం కేటాయించవలసివస్తుంది. వ్యాపారంలో అభివృద్ధిని సాధిస్తారు.

**సింహం:** భూమి కొనుగోలు మొదలైన విషయాలు నెమ్మదిగా సానుకూల పడతాయి. మిత్రుల కలయిక.

**కన్య :** విదేశీయాన, కంప్యూటర్, విద్య మరియు తత్సంబంధమైన వాటికి వ్యూహాలు అనుకూలంగా ఉంటాయి.

**తుల :** సున్నిత వ్యవహారాలలో ఓర్పును చూపడం వలన లాభపడుతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరిపీల్చుకుంటారు.

**వృశ్చికం:** ఉద్యోగములలో బదిలీ వేటువున్నా ఉన్నత పదవీప్రాప్తి సూచనలు ఉన్నాయి. అన్నీ సానుకూలంగా ఉంటాయి.

**ధనుస్సు:** గృహ సంబంధమైన విషయాలు అనుకూలంగా, ప్రోత్సాహకరంగా వుంటాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**మకరం:** ఇరుగుపొరుగు వారితో భేదాభిప్రాయాలు చెప్పుకోదగిన సంఘటనలు కాక పోయినా కొంత అసౌకర్యాన్ని కలుగచేస్తాయి.

**కుంభం:** సాంకేతిక వైద్య రంగములలో వినూత్నమైన మీ ఆలోచనలు ప్రజాదరణను, ప్రభుత్వ ఆమోదమును పొందుతాయి.

**మీనం:** తెలివితేటలను పదునుపెట్టి వ్యాపార లావాదేవీలలో లాభపడుతారు. బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పంట పొలాల్లో కిష్కిందకాండ!

>> రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతుల బెడద వల్ల గ్రామీణ ప్రాంతంలో కూరగాయలకూ తీవ్ర కొరత ఏర్పడుతున్నది. టమాట, సొర, బీర, వంకాయ, బెండకాయ, చిక్కుడు తదితర కూరగాయల పంటలు వేసినా కోతులు మూకుమ్మడి దాడులు చేస్తున్నాయి. ఫలితంగా రైతులు కూరగాయలు కూడా పండించుకోలేని దుస్థితి నెలకొన్నది.
ఒకవేళ పంటలు వేసినా రోజంతా తోట వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి. తెలంగాణలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చే రైతులు.. కోతుల కారణంగా నేడు వెనకంజ వేస్తున్నారు. మామిడి, జామ, బత్తాయి, నేరేడు, దానిమ్మ, బొప్పాయి, సీతాఫల్ తదితర తోటలను సాగుచేస్తూ మంచి దిగుబడిని సాధించే రైతులకు కోతుల బెడద వల్ల నేడు ఆర్థికంగా ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి.
ఆధునిక వ్యవసాయరంగంలో (హార్టికల్చర్) భాగంగా పండ్లు, పూలతోటల వల్ల అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు ముందుకు వచ్చి, పలురకాల పండ్ల తోటలు వేశారు. కశ్మీర్‌లో పండే ఆపిల్, విదేశాల్లో పండే డ్రాగన్‌ఫ్రూట్స్ వంటి పంటలను కూడా తెలంగాణలో పండించేందుకు రైతులు ముందుకు వచ్చారు. వీరికి సైతం కోతుల బెడద తప్పలేదు. దీంతో వారుకూడా ఆ పంటలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. పండ్ల తోటలకు ప్రాధాన్యం ఇవ్వాలని హార్టికల్చర్ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నా రైతులు ససేమిరా అంటున్నారు. కోతుల బెడదను తట్టుకొని తాము పండ్ల తోటలు పెంచలేమని కరాఖండిగా చెప్తున్నారు.
రాష్ట్రంలో సుమారుగా 3 కోట్ల కోతులు ఉన్నాయని అంచనా. అదే సమయంలో గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు పిల్లలు, మహిళలు కోతుల కారణంగా బయటకు వెళ్లటానికి భయపడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా ఇళ్లలోకి చొరబడి మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి.
కోతి కరవడంతో ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ చికిత్స చేయించుకుంటున్న వారి సంఖ్య రాష్ట్రంలో రోజు రోజుకు పెరిగిపోతోంది.
కోతుల దాడుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గ్రామాల్లో కొందరు సర్పంచులు కోతులను పట్టి అడవుల్లో విడిచి పెడదామంటే వన్య ప్రాణ సంరక్షణ సమితి వారు కోర్టుకెళ్లడంతో వాటిని నిర్బంధించడం ఆపేస్తున్నారు. వన్యప్రాణులను బంధించడం, హింసించడం నేరమంటూ కోర్టుకెక్కడంతో ఎవరూ ఏమీ చేయలేక పోతున్నారు.
అయితే... అడవులు తరిగిపోవడం, ఆహార కొరత కారణంగానే కోతులు పంట పొలాలపై దాడులు చేస్తున్నాయన్నది సుస్పష్టం.
గతంలో పుష్కలంగా కనిపించిన అడవులు నేడు కానరావడం లేదు. రోజురోజుకు జనాభా పెరుగుతుండటం, దానికనుగుణంగా సేద్యం అధికం కావడం వల్ల క్రమంగా అడవులు హరించుకుపోతున్నాయి. ఉన్న అడవుల్లో సైతం కోతుల సంఖ్యకు సరిపోను ఆహారం, నీరు లభించడం లేదు. ఈ కారణంగానే కోతులు ఊళ్లపై దాడులు చేస్తున్నాయని వన్యప్రాణి సంరక్షకులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యవసాయరంగం పెను సవాళ్లను ఎదుర్కోక తప్పదని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



హైదరాబాద్‌లో గురువారం భద్రాచలం శ్రీరాముని కల్యాణోత్సవ ఆహ్వానాన్ని అందజేస్తున్న డి.సిఎం భట్టి. మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

# 27న భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

## సిఎంకు ఆహ్వానం అందించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి19:** శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు దేవాలయశాఖ భద్రాచల సీతారామచంద్రస్వామి ఆలయం తరఫున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఈవో దామోదర్‌రావు, ఆలయ అర్చకులు సీఎంను ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఎంపీ వేం నరేందర్‌రెడ్డి,ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఈనెల 19(గురువారం) నుంచి ఏప్రిల్ 2 వరకు శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరగుతున్నాయి. ఈనెల 27న భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం ఉంటుంది.



ప్రయాగ్‌రాజ్‌లో గురువారం నవరాత్రి పండుగ మొదటి రోజున గంగా నది తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

# రైతు నామ సంవత్సరం

>> తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల పట్ల ప్రభుత్వం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో తెలంగాణ ప్రతిష్ఠను పెంచుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతుల సమస్యలను పరిష్కారించామని వెల్లడించారు. ఫలితంగా ఈనాడు రైతులు సంతోషంగా తమ యాజమాన్య హక్కులను పొందుతున్నారని తెలిపారు. సాదాబైనామాలకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తామన్నారు. ఉగాది అనేది రైతుల పండుగని అభివర్ణించారు. కర్షకుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషిచేస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు,అధికారులు హాజరయ్యారు. కాగా నూతన సంవత్సరంలో వాణిజ్యం పంటలు సమృద్ధిగా పండుతాయని రవీంధ్ర భారతిలో నిర్వహించిన ఉగాది పంచాగ శ్రవణంలో బాచంపల్లి సంతోష్‌కుమార్ వెల్లడించారు. రైతులు ఆనందంగా ఉంటారని తెలిపారు. ఒడిదుడుకులు ఉన్నప్పటికీ సిఎం రేవంత్‌రెడ్డికి పాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నూతన పదవులు చేపడతారని పేర్కొన్నారు.

# విశ్వఖగోళంలో భారీ జలమేఘం!

## శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

**న్యూఢిల్లీ, మార్చి 19:** శాస్త్రవేత్తలు 12 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఒక విశ్వ మేఘాన్ని గుర్తించారు. ఈ మేఘంలో భూమిపై ఉన్న సముద్రాలన్నింటికన్నా 140 ట్రిలియన్ల రెట్లు ఎక్కువ నీరు ఉంది. ఇది మన విశ్వం ఎంత విశాలమైనదో, మరియు ప్రాథమిక కాలంలోనే జీవం ఏర్పడే అవకాశం ఉన్నదని సూచిస్తుంది. ఈ మేఘం విశ్వ ఆరంభంలోనే ఏర్పడిందని ఆ సమయంలో గెలాక్సీలు, కృష్ణబిలాలు నిర్మాణమవుతున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మేఘం ఒక క్వాజార్ చుట్టూ ఉంది, దాని కేంద్రంలో ఒక అతి భారీ కృష్ణబిలం ఉంది, బరువు సూర్యుని కంటే 20 బిలియన్ల రెట్లు ఎక్కువ. ఈ కృష్ణబిలం చుట్టూ వేడి వాయువు ఉంది, ఇందులో అధిక మోతాదులో నీటి ఆవిరి ఉంది. ఇంత పెద్ద పరిమాణంలో నీరు ఉండటం శాస్త్రవేత్తలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎందుకంటే జీవానికి నీరు అత్యవసరం, మరియు విశ్వ ప్రారంభ దశలోనే ఇంత నీరు ఉండటం జీవం ఏర్పడే పరిస్థితులు ముందే ఏర్పడాయని సూచిస్తోందని దీని ఆధారంగా, జీవానికి అవసరమైన మూలకాలు మన సౌర వ్యవస్థకే పరిమితం కాకుండా, విశ్వమంతటా విస్తరించాయని అర్థమవుతున్నట్లు పరిశోధకులు చెపుతున్నారు. విశ్వం కేవలం నక్షత్రాల, గ్రహాల సముదాయం మాత్రమే కాకుండా, సంక్లిష్టమైన రసాయన ప్రక్రియలతో నిండి ఉందని, నీటిలాంటి మూలకాలు చాలా కాలం క్రితం నుండే అందులో ఉన్నాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# ఐదుగురు ప్రభుత్వ విప్‌ల నియామకం

>> ప్రభుత్వ విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ విప్‌లు వచ్చారు. దీంతో మండలిలో విప్‌ల సంఖ్య ముగ్గురికి చేరింది. 2023 డిసెంబర్‌లో ఎమ్మెల్యేల నుంచి నలుగురు ప్రభుత్వ విప్‌ల నియామకం చేశారు. ధర్మపురి(ఎస్సీ) ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ప్రభుత్వ విప్‌గా నియామకం అయినప్పటికీ 8 నెలల క్రితం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం పాతవారు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, డోర్నకల్(ఎస్టీ) ప్రభుత్వ విప్‌లుగా కొనసాగుతున్నారు. కొత్తగా వచ్చిన ముగ్గురు విప్‌లతో కలిపి ఆరుగురు ప్రభుత్వ విప్‌లు అసెంబ్లీలో ఉంటారు. అయితే అసెంబ్లీలో చీఫ్ విప్‌ను ఇంతవరకు నియామకం చేయలేదు. ప్రభుత్వ చీఫ్ విప్ పోస్ట్ కోసం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రతిపాదించగా ఆయన ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఆయన ఒప్పుకోని పక్షంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే పేరును పరిశీలించే అవకాశం ఉందని సమాచారం. వారిద్దరిలో ఒకరికి ఆర్టీసి చైర్మన్ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. లేదా ఉత్తమ్ పద్మావతి రెడ్డికి ఆర్టీసి చైర్మన్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**14జిల్లాలకు డిసిసి కమిటీలను నియమించిన పిసిసి**

కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత విస్తరణ కోసం ఉగాది పండుగ రోజున 14 జిల్లా కాంగ్రెస్‌లకు పూర్తిస్థాయిలో కార్యవర్గం ఏర్పాటు చేసింది. టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆయా జిల్లాల భౌగోళిక పరిస్థితులు,నియోజకవర్గాల ప్రాతిపదికన కార్యవర్గంలో వైస్‌ప్రసిడెంట్లు, ప్రధాన కార్యదర్శులు,కోశాధికారి, వాచకప్రతినిధులు,కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల సంఖ్యను నిర్ధారించి ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా కార్యవర్గం 89 మందితో ఏర్పాటు చేశారు. ఇందులో 12 మంది ఉపాధ్యక్షులు 24మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, నలుగురు వాచకప్రతినిధులు, 48 కార్యదర్శులు నియమించారు. ఖైరతరాబాద్ జిల్లా కార్యవర్గం 90 మందితో ఏర్పాటు చేశారు. ఇందులో 10మంది ఉపాధ్యక్షులు 26మంది ప్రధానకార్యదర్శులు, 41 కార్యదర్శులు, 13మంది కార్యవర్గసభ్యులను నియమిం చారు. ఈ జిల్లాలో వాచకప్రతినిధులను కోశాధికారిని నియమించలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గం 32 మందితో ఏర్పాటు చేశారు. ఆరుగురు ఉపాధ్యక్షులు ప్రధానకార్యదర్శులుపన్నెండు మంది, ట్రెజర్, నలుగురు వాచకప్రతినిధులు, తొమ్మిది మంది కార్యదర్శులతో జిల్లా కాంగ్రెస్ కమిటీకి రూపం ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా కార్యవర్గం 58 మందితో ఏర్పాటు చేశారు. ఆరుగురు ఉపాధ్యక్షులు పన్నెండు మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, నలుగురు వాచకప్రతినిధులు, 16కార్యదర్శులు, 19 కార్యవర్గ సభ్యులు నియమించారు. మెదక్ జిల్లా కార్యవర్గం 61 మందితో ఏర్పాటు చేశారు. 14మంది ఉపాధ్యక్షులు 20మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, ఆరుగురు వాచకప్రతినిధులు, 20 కార్యదర్శులనునియమించారు. నిర్మల్ జిల్లా కార్యవర్గం 65 మందితో ఏర్పాటు చేయగా అందులో ఆరుగురు ఉపాధ్యక్షులు,ఎనిమిది మంది ప్రధానకార్యదర్శులు, నలుగురు వాచకప్రతినిధులు, 28 కార్యదర్శులు, 19 కార్యవర్గ సభ్యులతో జిల్లా కాంగ్రెస్ కమిటీకి సంస్థాగత పునాది ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో 11 మంది ఉపాధ్యక్షులు 22 మంది ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి,ఐదుగురు వాచకప్రతినిధులు, 26మంది కార్యదర్శులు,15మంది కార్యవర్గసభ్యులను నియమిస్తూ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు.కామారెడ్డి జిల్లా కార్యవర్గం 84 మందితో ఏర్పాటు చేశారు. ఇందులో 17 మంది ఉపాధ్యక్షులు 32మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, నలుగురు వాచకప్రతినిధులు, 30 కార్యదర్శులు నియమించారు. మంచిర్యాల జిల్లా కార్యవర్గంలో మొత్తం 50మంది ఉండగా ఏడుగురు ఉపాధ్యక్షులు 14మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, ముగ్గురు వాచకప్రతినిధులు, 25 కార్యదర్శులు నియమించారు. ఆదిలాబాద్ 61 మందితో జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేయగా ఆరుగురుని ఉపాధ్యక్షులుగా, 20మంది ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, ముగ్గురు వాచకప్రతినిధులు, 31 కార్యదర్శులు నియమించారు. వనపర్తి జిల్లా కార్యవర్గం 32మందితో ఏర్పాటు చేయగా ఇద్దరు ఉపాధ్యక్షులు ఆరుగురు ప్రధానకార్యదర్శులు, నలుగురు వాచకప్రతినిధులు, 16 కార్యదర్శులు నలుగురు కార్యవర్గసభ్యులను నియమించారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గం 54 మందితో ఏర్పాటు చేయగా అందులో ఆరుగురు ఉపాధ్యక్షులు, పది మంది ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, ఇద్దరు వాచక ప్రతినిధులు,16 కార్యదర్శులు,19 మంది కార్యవర్గ సభ్యులతో జిల్లా కాంగ్రెస్‌కమిటీనీ రూపొందించారు. నిజామాబాద్ నగర పార్టీ కార్యవర్గం 33 మందితో ఏర్పాటు చేయగా ఇందులో ముగ్గురుఉపాధ్యక్షులు ఏడుగురు ప్రధానకార్యదర్శులు, ట్రెజర్, ఇద్దరు వాచకప్రతినిధులు, పదహారుమంది కార్యదర్శులు, ఆరుగురు కార్యవర్గసభ్యులను నియమించారు. యాదాద్రి జిల్లా కార్యవర్గం 66 మందితో ఏర్పాటు చేశారు. ఇందులో ఏడుగురు ఉపాధ్యక్షులు 12మంది ప్రధానకార్యదర్శులు, వాచకప్రతినిధి ఒకరు, 29 కార్యదర్శులు, 17 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.ప్రజాస్వామ్య పునాదులపై పటిష్టమైన నిర్మాణంతో గత 140 ఏళ్లుగా దేశానికి సేవ చేస్తున్న అఖిల భారత కాంగ్రెస్ పార్టీ లో సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగం గా అత్యంత కీలకమైన డిసిసి కార్యవర్గంలో మీకు భాగస్వామ్యం లభించినందుకు మీకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాననీ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ సేఫ్

●సినీ పరిశ్రమను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం ●ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రం

●గద్దర్ అవార్డుల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి






గురువారం సాయంత్రం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్‌లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న అశ్వినీదత్, అక్కినేని నాగచైతన్య, జయసుధ, కమల్‌హాసన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 19:** సినీ పరిశ్రమను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని తమ ప్రభుత్వం నిర్ణయించుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో ప్రవేశించేందుకు సింగిల్ విండో ద్వారా అనుమతి ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఐటీ,ఫార్మా ఇండస్ట్రీతో సమానంగా సినిమా ఇండస్ట్రీని కూడా ప్రోత్సహిస్తున్నామని, టాలీవుడ్ ఎంతో ఎదగాలని, పాటు బాలీవుడ్, హాలీవుడ్ కూడా హైదరాబాద్‌కు తరలి రావాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్‌లో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై సినీ ప్రముఖులకు అవార్డులన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎంతో సురక్షితమైన ప్రాంతమని, గద్దర్ స్ఫూర్తితోనే సామాజిక రుగ్మతలను పోగొట్టేందుకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్యవంతమైన సినిమాలు తీయాలని కోరారు. ఇప్పుడు దుబాయిలో బాంబులు పడుతున్నాయని, కానీ ఇదే సమయంలో హైదరాబాద్‌లో సినిమా అవార్డుల కార్యక్రమం జరుపుకుంటున్నా మన్నారు. సరిహద్దులో పాకిస్థాన్ దాడులను తిప్పికొడుతూ ఆపరేషన్ సిందూర్ మన జవాన్లు నిర్వహిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించుకున్నామన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్ కు కేరాఫ్ హైదరాబాద్ కు చార్ మినార్ లోని చార్ మినార్స్ లాగా ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ నలుగురు సినీ పరిశ్రమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని చెప్పారు. రామోజీ రావు ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్ ను సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చి ఆదుకున్నారని, ఆనాడు సినీ రంగంలో ఏ సమస్య వచ్చినా ముందుండే దాసరి నారాయణ రావును స్మరించుకోవాల్సి నా అవసరం ఉందన్నారు. హైదరాబాద్ ను గ్లోబల్ సినీ హబ్ గా తీర్చి దిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

ఇటీవల నెట్ ఫ్లిక్స్ తమ సంస్థను హైదరాబాద్ లో ఏర్పాటు చేసింది నెట్ ఫ్లిక్స్ వచ్చిందంటే హైదరాబాద్ కు హాలీవుడ్ వచ్చినట్టేనని చెప్పారు. గద్దర్ ఒక చైతన్యం.. ఒక స్ఫూర్తి తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకువచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం సంతోషకరన్నారు. సినిమా అనేది మోస్ట్ పవర్ ఫుల్ వెపన్ సినిమా సమాజాన్ని చైతన్యపరిచేందుకు సినిమాను సాధనంగా ఉపయోగించుకోవాలని చెప్పారు. సామాజిక బాధ్యతను గుర్తెరిగి గద్దర్ స్ఫూర్తితో సామాజిక సమస్యలను పరిష్కరానికి సినిమా ద్వారా సందేశం అందించాలని చెప్పారు.

తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహానీయుడు గద్దర్. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమేనని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.గురువారం సాయంత్రం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హాల్‌లో గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డిప్యూటీ సిఎం మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదిగింది అనేక సందేశాత్మక సినిమాలు వస్తున్నాయని, ప్రజల్లో మార్పునకు నాంది పలికాయని చెప్పారు.

తెలుగు సినిమా తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలని సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట సినిమా అవార్డులను తిరిగి ప్రారంభించారని తెలిపారు. గత పాలకులు 10సంవత్సరాల పాటు సినిమా అవార్డులు ఇవ్వలేదని మండిపడ్డారు. గద్దర్ ఫిలిం అవార్డుల ఫంక్షన్ కోసం ఎంతో బిజీగా ఉండే ప్రముఖ నటులు హైద్రాబాద్ కు వచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సందేశాత్మక సినిమాలను పారదర్శకంగా ఎంపిక చేసిన ఫిలిం డెవలప్మెంట్ కౌన్సిల్, జ్యూరీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కాగా, మార్చి 7న తెలంగాణ గద్దర్ ఫిల్మ్-2025 అవార్డుల విజేతలను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ప్రకటించారు. తమ్మారెడ్డి భరద్వాజ స్పెషల్ జ్యూరీ అవార్డులను ప్రకటించారు.

చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ అవార్డు వరించింది. కమల్‌హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు, సంగీతం శ్రీనివాసరావుకు బి.ఎన్.రెడ్డి అవార్డు, అశ్వినీదత్‌కు నాగిరెడ్డి చక్రపాణి అవార్డు, జయసుధకు ఏఎన్నార్ అవార్డు, ఆర్ నారాయణ మూర్తి కాంతారావు అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు యూనిటీ. రాజు వెడ్స్ రాంబాయి ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ రెండో చిత్రంగా దండోరా, ఉత్తమ దర్శకుడిగా సాయిలు కంపాటి, ఉత్తమ నేపథ్య గాయకుడిగా అనురాగ్ కులకర్ణి, ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ గా సాయి మార్తాండ్ నిలిచారు. ఉత్తమ నటుడు నాగ చైతన్య(తండేల్), ఉత్తమ నటి రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్) వరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అక్కినేని నాగార్జున, చిరంజీవి, కమలాహాసన్, మాధురి దీక్షిత్ కూడా పాల్గొన్నారు

# మరో రెండు రోజులు భారీ వర్ష సూచన

## శనివారం పొడి వాతావరణం

## మళ్లీ పెరగనున్న ఉష్ణోగ్రతలు

## రైతులకు వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నాలుగు రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో అతాలకుతలమైన రైతులకు వాతావరణశాఖ మరో పిడుగులాంటి వార్త చెప్పింది. తెలంగాణలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు, కొన్నిచోట్ల వడగండ్ల వానలు కురిసే ప్రమాదం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దాదాపు అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపు లతో కూడిన వర్షాలు కురుస్తాయని అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అకాలవర్షాలు పంటలకు నష్టం కలిగించే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చ రిస్తున్నారు. అయితే శనివారం రాష్ట్రంలో పొడి వాతా వరణం ఏర్పడి, ఆ తర్వాతి రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కాగా అకాలవర్షాలతో రైతులు అతలా కుతలమవు తున్నారు. పలుచోట్ల వివిధ రకాల పంటలకు తీరని నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 8.7, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.1, మంచి ర్యాల జిల్లాలో 9.6, నిర్మల్ జిల్లాలో 0.2 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైంది. ఆయా జిల్లాల్లో అకాల వర్షాలు పత్తి, పుచ్చ, మామిడి, జొన్న, బొప్పాయి, వరి పంటలను దెబ్బతీసింది. రైతులు కల్లాలు, ఇండ్లలో ఆరబోసుకున్న పెసర, పసుపు పంటలు తడిసి పోయాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రెండురోజుల పాటు కురిసిన అకాల వాన అపార నష్టాన్ని తెచ్చి పెట్టింది. వీణవంక మండలంలో 50 మంది రైతులకు చెందిన 260 ఎకరాల్లో మక్క నేలకొరిగింది.

శంకరపట్నం మండలం రాజాపూర్‌లో చింతిరెడ్డి ఆదిరెడ్డి ఇంటి సమీపంలో కొబ్బరి చెట్టుపై భారీ పిడుగుపడి, మంటలు చెలరేగి దగ్ధమైంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం, వెన్నంపల్లి, గంగారం, మంగపేట గ్రామాల్లో సుమారు 500 ఎకరాల మక్క పంట నేలకొరిగింది. ఉమ్మడి నిజామా బాద్ జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి రంగా రెడ్డి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వివిధ పంటలు దెబ్బ తిన్నాయి. కొందుర్గు మండల కేంద్రంలో మక్కజొన్న పంట దెబ్బతిన్నది. ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు, చింతకాని మండలాల్లో చేతికొచ్చిన మక్కజొన్న నేలవాలింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మక్కజొన్న, మిర్చి తడిసిపోయింది.


Central University of Tamil Nadu

Thiruvarur, Tamil Nadu

Tender Notice

1. Supply and Installation of Laboratory Instrument High Speed Scanning Disk Confocal Super Resolution Microscope for Department of Biotechnology at CUTN, Thiruvarur.
2. Supply and Installation of UAV-Based LiDAR and Multispectral Scanning System for Department of Geography at CUTN, Thiruvarur.
3. Supply and Installation of Laboratory Instrument, Field Emission Scanning Electron Microscope with EDX System for Department of Materials Science at CUTN, Thiruvarur.
4. Supply and Installation of Laboratory Instrument, High Resolution Mass Spectrometer with NANO UHPLC for Proteomics Metabolomics and Lipidomic Applications 01 No and Triple Quad GC*GC/MSMS for Volatile Pesticides, Metabolomics Application and Other Academic Chemistry Applications 01 No. for Department of Horticulture at CUTN, Thiruvarur.

| Tender Ref. No. | Last date & Time |
|---|---|
| 1. CUTN/PUR/2025-26/28 dt.13.03.2026 | Please see the CUTN website |
| 2. CUTN/PUR/2025-26/29 dt.13.03.2026 | |
| 3. CUTN/PUR/2025-26/30 dt.13.03.2026 | |
| 4. CUTN/PUR/2025-26/32 dt.13.03.2026 | |

Note:

For more details, please see the CUTN website and CPP portal.

CBC 21299/12/0024/2526 REGISTRAR


# మల్లన్నసాగర్ ప్రధాన కాలువకు గండి

భారీఎత్తున వృథాగా పోతున్న నీరు

త్వరగా మరమ్మతులు చేయాలని రైతుల వేడికోలు

సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన మల్లన్న సాగర్ ప్రధాన కాలు వకు గండిపడింది. ప్రాజెక్టు నుంచి దుబ్బాక ప్రాంతానికి వచ్చే కాలువకు దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో గండి పడింది. దీంతో నీరంతా వృథాగా చెల్లాపూర్ కందూరు చెరులోకి వెళు తోంది. గండి కారణంగా కెనాల్ పక్కనే ఉన్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న వేళ పంట పొలాలకు నీరు అందక వరి పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో చెల్లాపూర్ సమీపంలోని కెనాల్ కాల్వకు గండి పడటంతో పక్కనే ఉన్నటువంటి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ వైపు వెళ్లే కెనాల్ కాలువ కింద అక్కడే ఉన్న చెరువులోకి నీళ్లు మళ్లడంతో అప్పు చేసి వేసిన పంటలు ఎండిపోతయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కెనాల్ కాల్వకు గండి పడడం కారణంగా రైతులు అధికారులపై మండిపడుతున్నారు. కెనాల్ కాలు వపై నీటిపారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిరక్ష్యంతోపాటు మల్లన్న సాగర్ నుంచి వచ్చే కెనాల్ కాలువ లైనింగ్ పనుల్లో నాణ్యత లేకపోవడం కారణంగానే కాలువకు గండి పడిందని ఆరోపిస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి కెనాల్ కాలువను మరమ్మతు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో అప్పులు చేసి పం టలు వేసుకున్న పంటలకు నీరు అందక ఎండిపోయి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కాగా.. గండిపడిన ప్రాంతాన్ని నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. కాలువకు మరమ్మ తులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

# నర్మెట ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ దేశానికే తలమానికం కావాలి

## పార్టీ పదవులు, వ్యక్తులు శాశ్వతం కాదు

## రైతన్న సంతోషమే మాకు శాశ్వతం

## తర్వలోనే మరో 5 ఫ్యాక్టరీల ప్రారంభం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి/ నంగునూర్, మార్చి 19, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్మించిన ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ ఆదర్శంగా నిలిచి దేశానికే తలమానికం కావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెటలోని ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించతలపెట్టిన రైతు మేలా మహోత్సవాన్ని ఉగాది పర్వదినం సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, వాకటి శ్రీహరి, గడ్డం వివేక్‌వెంకట స్వామి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపి రఘు నందన్‌రావు లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇయిల్ ఫాం సాగు రైతు గుండె చప్పుడు అన్నారు. పార్టీ పదవులు, వ్యక్తలు శాశ్వతం కాదని రైతుల నవ్వు, బాగు, సంతోషమే మాకు శాశ్వతం అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలోనే అత్యధికంగా వరి తెలంగాణలోనే సాగు అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరి ధాన్యం కొనుగోలు చేయమని తెగేసి చెప్పిందని రైతులు ఇతర పంటలవైపు మొగ్గు చూపాలన్నారు. నర్మెట అయిల్‌ఫాం ఫ్యాక్టరీని 16 నెలల్లో లేటెస్టు టెక్నాలజీతో ఏర్పాటు చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ రిఫైనరీ లేదని సిద్దిపేటలో రిఫైనరీని ఈ నెల 22న సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ యేడాదిలో మరో 5 అయిల్ ఫాం ఫ్యాక్టరీలను ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. హరీశ్‌రావుతో త్వరలోనే అయిల్ ఫాం సాగు చేయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు.



రైతు మేలా మహోత్సవాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులతో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృశ్యం

### రైతులకు ఆందోళన అవసరం లేదు: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఆయిల్ ఫాం సాగుకు కేంద్రం ఇచ్చే సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇవ్వడానికి కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం యేడాదికి లక్ష కోట్ల ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటుందని తెలి పారు. రైతులు ఆయిల్‌ఫాం పంటను సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌ఫాం సాగు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సి న అవసరం లేదన్నారు. వికారాబాద్‌లో 2 నుంచి 3 వేల ఎకరాల్లో అయిల్‌ఫాం సాగు చేసేలా రైతులను ప్రోత్స హించడం జరుగుతుందన్నారు.

ప్రతి రైతు ఆయిల్‌ఫాం సాగు చేయడానికి ముందుకు రావాలని, రాష్ట్ర అవ సరాలకు వరి ధాన్యం పోను మిగిలిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో భవిష్యత్‌లో ఇబ్బందులు వచ్చే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఇతర పంటలపై మొగ్గు చూపాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆయిల్‌ఫాం సాగులో ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు .సిద్దిపేట ప్రాంతంలో క్రషింగ్, రిఫైనరీ యూనిట్‌తో పాటు అయిల్ ఫాం ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, వాకిటి శ్రీహరి, మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.


దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

ఇ-వేలం ప్రకటన నం. Y/C.e-Auction/HYB/2025-26, తేది : 18.03.2026

PUB/2155

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే వారు IREPS వెబ్‌సైట్ www.ireps.gov.in యొక్క ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా హైదరాబాద్ డివిజన్‌లో మొబైల్ అసెట్స్ మరియు పలు స్టాటిక్ సర్వీస్ కాంట్రాక్టులు, క్లోక్ రూమ్, పార్కింగ్, పే అండ్ యూజ్ టాయిలెట్స్, పార్సెల్స్ అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరీ యొక్క వ్యాపార ప్రచార కాంట్రాక్టుల ప్రదానానికి ఇ-వేలం ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూల్ ఇక్కడ క్రింద వివరించబడింది.

క్ర.సం. 1. కేటగిరీ : పార్కింగ్. పట్టిక సం. : HYB - Prkg-054 ప్రత్యేక వివరణలు : దబీర్‌పుర రైల్వే స్టేషన్ లొకేషన్ వద్ద ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు మరియు టాక్సీల కొరకు పార్కింగ్ లాట్. వేలం తేది : 25.03.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.00.

క్ర.సం. 2. కేటగిరీ : పార్కింగ్. పట్టిక సం. : HYB - Prkg-055 ప్రత్యేక వివరణలు : ధర్మాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ద్విచక్ర మరియు 4 చక్రాల వాహనాలకు పార్కింగ్ లాట్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ. వేలం తేది : 31.03.2026, వేలం ప్రారంభ సమయం : 11.00, వేలం ముగింపు సమయం : 11.30.

క్ర.సం. 3. కేటగిరీ : పే & యూజ్ టాయిలెట్స్. పట్టిక సం. : HYB - PnU - DAB ప్రత్యేక వివరణలు : ధర్మాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పే & యూజ్ టాయిలెట్స్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ. వేలం తేది : 31.03.2026, వేలం ప్రారంభ సమయం : 11.00, వేలం ముగింపు సమయం : 11.30.

క్ర.సం. 4. కేటగిరీ : పార్సెల్. పట్టిక సం. : HYB - Parcels - SLR ప్రత్యేక వివరణలు : రైలు నం. No.1) 17023-SLR-F1-KCG-KRNT-25-1 2) 17653-SLR-F1-KCG-PDY-26-1 3) 12794-SLR-F1-NZB-TPTY-25-1 4) 17606-SLR-F1-KCG-BGLT-26-1 5) 17652-SLR-F1-KCG-CGL-26-1. వేలం తేది : 31.03.2026, వేలం ప్రారంభ సమయం : 15.00, వేలం ముగింపు సమయం : 16.10.

క్ర.సం. 5. కేటగిరీ : ADVT-Int-202088-2-25-1. (ప్రకటన రైలు లోపల, ఫుల్ ఫేస్) పట్టిక సం. : HYB - Mixed - NFR ప్రత్యేక వివరణలు : రైలు నం. 12789/12790 కాచిగూడ- మర్డేశ్వర్-కాచిగూడ యొక్క మరియు 22715/22716 కాచిగూడ-మదురై-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ యొక్క బయట. వేలం తేది : 01.04.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.00.

క్ర.సం. 6. కేటగిరీ : ADVT-HYB-SFX-OH-124-25-1 (అవుట్ ఆఫ్ హోమ్ ప్రకటనలు) పట్టిక సం. : HYB - Mixed - NFR ప్రత్యేక వివరణలు : సఫిల్‌గూడ, దయానంద నగర్, రామకిష్టాపురం రైల్వే స్టేషన్ వద్ద అవుట్ ఆఫ్ హోమ్ కేటగిరీ క్రింద ప్రకటన హక్కులు. వేలం తేది : 01.04.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.10.

క్ర.సం. 7. కేటగిరీ : PnU - HYB - KCG - WRL - 22-25-1 (పే & యూజ్-లాంజెస్/వెయిటింగ్/రిటైరింగ్/క్లోక్ రూమ్‌లు) పట్టిక సం. : HYB - Cloak Room - KCG ప్రత్యేక వివరణలు : KCG రైల్వే స్టేషన్ వద్ద PF నం.1 పై క్లోక్ రూమ్ సౌకర్యం యొక్క ఏర్పాటు మరియు ఆపరేషన్. వేలం తేది : 01.04.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.20.

క్ర.సం. 8. కేటగిరీ : MSS - HYB - DYE - BS - 95-25-1 (పలురకాల-స్టాటిక్-సర్వీస్‌లు-బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్‌లు) పట్టిక సం. : HYB - Mixed - NFR ప్రత్యేక వివరణలు : దయానంద నగర్ రైల్వే స్టేషన్‌లో బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్. వేలం తేది : 01.04.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.30.

క్ర.సం. 9. కేటగిరీ : MSS - HYB -MXT - PS - 120-26-1 (పలురకాల-స్టాటిక్-సర్వీస్‌లు-ప్రీమియం స్టోర్స్) పట్టిక సం. : HYB - Mixed - NFR ప్రత్యేక వివరణలు : మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ప్రీమియం అవుట్‌లెట్. వేలం తేది : 01.04.2026, వేలం ప్రారంభ సమయం : 11.30, వేలం ముగింపు సమయం : 12.40.

A2728 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్


# ఖమ్మంలో రహదారులకు మహర్దశ!

## డిప్యూటీ సిఎం భట్టి చొరవతో రూ.594 కోట్లు మంజూరు

## జిల్లాలో ఐదు కీలక మార్గాల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## నాలుగు వరుసల రోడ్లుగా ఆధునీకరణ

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఉగాది పండుగ పూట ఖమ్మం జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేర బోయే తీపి కబురు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకొచ్చారు. ఖమ్మం జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు మహర్దశ కల్పిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసాధారణ చొరవ చూపారు. ఆయన పట్టుదలతో జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణకు ఏకంగా రూ.594 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీని కోసం జీవో ఎంఎస్ 15 /16032026 కూడా విడుదల చేశారు.ఈ నిధులతో కీలక మార్గాలను నాలుగు వరుసల రహదారులుగా అభివృద్ధి చేయను న్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో ఐదు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఆయన పాత్ర కీలకం. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయడం లక్ష్యంగా రహదారుల విస్తరణను ప్రభుత్వం చేపడుతోంది. ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గంలో కనెక్టివిటీ పెరగడంతో పాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుంది. వైరా నుండి జగ్గయ్యపేట వరకు 25 కిమి నిడివితో రహదారి విస్తరణచేయబోతున్నారు. దీనికోసం రూ. 151.20 కోట్లు నిధులుమంజూరు చేశారు. కొత్తగా విస్తరించేవైరా రోడ్డు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు వరుసల రహదారిగా విస్తరణ జగ్గయ్యపేట, బోనకల్ , రావినూతల, ముజఫర్ నగర్, జానకీపురం, పెద్దబీరవల్లి, పాలడుగు, సీతానగరం, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి, జింకల తాండా, సోమవరం మీదుగా వైరా వరకు పోతుంది. మధిర నుంచి తూటికుంట్ల వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణ. మధిర, జిలుగుమాడు, ఆత్కూరు, కిష్టాపురం, సిరిపురం, కలకోట, బ్రాహ్మణపల్లి మీదుగా తూటికుంట్ల వరకు విస్తరణ చేస్తున్నారు. మధిరనుంచితూటికుంట్ల వరకు 13.50 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారి విస్తరణకు రూ. 81 కోట్ల నిధుల మంజూరు. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. మధిర, ఎల్లెందులపాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు 18.40 కిమి నిడివి కలిగిన రోడ్డును నాలుగు వరుసల రహదారి విస్తరణ చేయడానికి రూ.110.40 కోట్ల నిధులు మంజూరు. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు 28.03 కిమి రహదారి విస్తరణకు రూ.157.23 కోట్ల నిధుల మంజూరు చేస్తూ ఉత్తర్వులో పేరొక్కన్నారు. బోనకల్‌ఆళ్లపాడు, రాయన్నపేట వంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. బోనకల్, ఆళ్లపాడు, రాయన్న పేట మీదుగా వంగవీడు వరకు 15.72 కి.మి రహదారి విస్తరణ చేస్తారు. 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ.94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.

వార్త, శుక్రవారం 20, మార్చి 2026


మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

-పాస్కల్

# భూగర్భ జల సంక్షోభం?


నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగాచెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలిబంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావాల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టం ఏమిటంటే ప్రధానంగా దేశంలో మంచినీరు గగనమైపోతున్నది. గత దశాబ్దకాలంగా వానలు సమృద్ధిగా కురుస్తున్నా కొన్ని చోట్ల కుంభ వృష్టి వానలకు, వరదలకు పొంగిపొరులుతున్నా వేసవి వచ్చేసరికి నీటి కష్టాలు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. మార్చి మొదట్లోనే తెలుగు రాష్ట్రాల్లో నీటి కష్టాలు ఆరంభమయ్యాయి. భూగర్భజల మట్టాలు దిగజారిపోతున్నాయి. యేటేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో కొత్తగా తవ్వుతున్న బోరుబావులను ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం ఎనభైశాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేనుశాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం నానాటికీ పెరిగిపోతున్నా ఆ మేరకు భూగర్భజలాల పెంపునకు గట్టి ప్రయత్నాలు జరగడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశ వ్యాప్తంగా భూగర్భజలాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా,కావేరి యమునా లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే నీరు నిరుపయోగంగా సముద్రంపాలవుతున్నది. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా యేటా దాదాపు మూడు వందల ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు దేశంలో వినియోగించుకుంటున్నట్లు అంచనా. భారతదేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాక్లు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలు దోడేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగిలిన బ్లాకుల పరిధిలోకి చేరుకొని భూగర్భ జలాలు మరింతగా అడుగంటిపోతాయి. దేశంలో బోరు బావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూటయాభై రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉన్నది. యేటా వేలాది బోరుబావులు కొత్తగా తవ్వుతున్నారు. ఇందువల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవమే. కానీ నీటిసంరక్షణ పద్ధతులు పాటించకుండానానాటికీ బోరుబావులు అధికంగా ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తున్నదని భూగర్భనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలను వృధా చేయడం కూడా పెద్దఎత్తునే జరుగుతున్నది. ఇదే పరిస్థితికొనసాగితే మరో రెండు దశాబ్దాల్లో దేశవనరుల్లో అరవైశాతానికిపైగా హరించుకుపోతాయని ప్రపంచబ్యాంకే గతంలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో యేటా నలభైలక్షల కోట్ల లీటర్ల మేర భూగర్భజలాలు తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో దాదాపు ఐదు శాతం పెరుగుదల నమోదైందని గతంలో జరిపిన ఒక అధ్యయనంలో వెలుగుచూసింది. ఇంకొకపక్క దేశంలో అధికశాతం జిల్లాల్లో భూగర్భ జలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రమే గతంలో అంగీకరించింది. పార్లమెంట్‌లోనే గతంలో ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ అందించిన వివరాల ప్రకారం రెండువందల యాభైనాలుగు జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, 224 జిల్లాల్లో ఫ్లోరైడ్, 162 జిల్లాల్లో క్షరాత 34 జిల్లాల్లో పాషాణం స్థాయి అధికంగా ఉన్నదని వెలుగు చూసింది. రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో మరింత తీవ్రంగా ఉంది. ప్రధానంగా పాషాణం లాంటి లోహాలను తొలగించడం కష్టంగా మారుతుందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరా కూడా బోరు బావుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. కొన్ని పరిశ్రమలు ప్రధానంగా శీతలపానియాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇంకొకపక్క దేశవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో వాడకం పెరుగుతున్నది. అదే స్థాయిలో వృధాకూడా అదుపు లేకుండా పోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహన లోపం కారణంగా భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టివేయలేం. మంచి నీటి కొరతను ముందుగానే గ్రహించి దాన్నిసొమ్ము చేసుకునేందుకు మొదలు పెట్టిన నీటి వ్యాపారం ఇప్పుడు నగరాలు, పట్టణాలు దాటి శివారు పల్లెలకు కూడా చేరుకున్నది. దేశంలో కోట్లాది రూపాయల నీటి వ్యాపారం జరుగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్ కాకతీయ కార్యక్రమంద్వారా చెరువుల, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మత్తులు చేయించడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు కొంతమేరకు పెరిగాయని చెప్పొచ్చు. కానీ వాడుతున్న భూగర్భజలాల మట్టాలను భర్తీ చేయలేకపోతున్నాం. అందుకే వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో కూడా భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. తాగునీటి సంగతి దేవుడెరుగు. గుక్కెడు మంచి నీళ్ల కోసం వేసవిలో కోట్లాదిమంది ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీరు తాగి రోగాలబారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు చేపట్టాలి. అన్నింటికంటే ముఖ్యంగా చట్టాలు చేసి అవి అమలైపోతాయనుకుంటే సరిపోదు. ఆ చట్టాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అవసర మైన సిబ్బందిని నియమించి పటిష్టమైన ప్రణాళికలతో పర్యవేక్షణ చేయాలి.

మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కానీ మనం ఎవరో పరిష్కరించాలని అనుకుంటామంతే.



షేక్‌స్పియర్

ప్రతి వాడు ఓర్పుతో ఉండలేడు. అలా ఉన్నవాడే తనను తాను జయించగలడు.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



## విద్యార్థులకు విద్యుత్ స్కూటర్లు

తెలంగాణలో కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు విద్యుత్ స్కూటర్లు అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం మహిళా సాధికారత దిశగా తీసుకున్న సానుకూల సంకల్పంగాభావించవచ్చు. తెలంగాణలో ఉన్నతవిద్యా వ్యవస్థ విస్తృతంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ వేలాది విద్యార్థినులు పట్టణాలు, గ్రామాలనుంచి విద్యాసంస్థలకు ప్రయాణిస్తుంటారు. దేశంలో నిరక్షరాస్యులు, దినసరి కూలీలు అధిక సంఖ్యలో ఉన్న సామాజిక వాస్తవాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. అలాంటి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు విద్యుత్ స్కూటర్ అందించడం మాత్రమే సరిపోదు. వాహనం నడపడం నేర్చుకోవడం, లైసెన్స్ పొందడం, నిర్వహణ ఖర్చులు భరించడం వంటి అంశాలు వారికి భారంగా మారే అవకాశం ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆన్‌లైన్ సర్వీసెస్‌లో సాంకేతిక లోపం

తెలంగాణ మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ట్యాబ్‌ఓపెన్ కావడంలేదు. ఈట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించి నపూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈ లోపం కారణంగా అనేక మంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. కావున, సంబంధిత అధికారులువెంటనే స్పందించి ఈ సాంకేతిక సమస్యను తక్షణమే పరిష్కరించి, మీసేవ యాప్ అన్ని విధాలుగా సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

- సి.వి.ఆర్ కృష్ణ, హైదరాబాద్

## నసమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏపిలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ప్రజల ఫిర్యాదులు వివిధ శాఖలకు సంబంధించి ప్రత్యక్షంగా జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ వారు స్వీకరణ చేస్తూ వారికి రసీదు ఇవ్వడం ఎంతో తృప్తికరం. వారు సమస్య స్థితిని వ్యక్తంచేయడం కూడాకొంతఉపశమనంఉంటుంది. ఐతే ఫిర్యాదుల సంఖ్య శాఖలవారీ ప్రకటనతోపాటు, దీర్ఘకాల సమస్యలకు పరిష్కారానికి హెచ్చుప్రాధాన్యత ఉంటుంది. పరిష్కారం జరిగిన కేసుల సంఖ్య పెరిగిన కొద్దీ ప్రజలు సంతోషం, పాలనపై విశ్వాసం ధృఢమవుతుంది.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

## గ్యాస్ రేట్ల పెరుగుదల

ప్రస్తుత సమాజం ఎలా ఉందంటే అపోహలు సృష్టించడంలో మనస్సు కన్నా వేగంగా వ్యాప్తిచేస్తారు. సిలిండర్ గ్యాస్ కొరత పేరుతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు రేట్లు పెంచి సాధారణ మానవుడి నడ్డి విరుస్తున్నారు. గ్యాస్ సరఫరా ఎలా ఉన్న రెట్లు మాత్రం పెంచారు. ఎప్పుడైనా పరిస్థితుల దృశ్య రెట్లు పెంచడమే కానీ తగ్గించడం మాత్రం అస్సలు ఉండదు కదా. ఇలాంటిది అమాంతం రెట్లు పెంచడం అనేది ప్రభుత్వాల చేతుల్లో లేదా అధికారుల చేతిలో ఉండాలి గాని యాజమానుల ఇష్టారీత్య ఉండకూడదు. అధికారుల నిర్ణయ ప్రకారమే నడుచుకోవాలి. రేట్లు వినియోగదారుడు అదుపులో ఉండాలి. సామాన్యుడి నడ్డి విరిచేలా ఉండకూడదు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## పూర్వ వైభవం రావాలి

ఒకనాడు తెలుగునాట పాడి పంటలు వెల్లివిరిసేయి. గ్రామాలలో నిత్యం పాలు,నెయ్యి, తేనెలు పుష్కలంగా లభించేవి. నదులలో నీరు నిండుగా ప్రవహించేవి. ఎప్పుడూ సరిసంపదలతో విలసిల్లుతూ లలితకళలు నాట్యమాడేవి. శాతవాహన, ఇక్ష్వాక, కాకతీయ, విజయనగర సామ్రాజాల కాలంలో తెలుగుతేజం వెలుగొంది అనంత కీర్తిని ఆర్జించింది. ఆనాటి సిరిసంపదలను తిరిగి తెలుగు రాష్ట్రాలు సాధించాలి. ప్రజా జీవితాన్ని సౌభాగ్యవంతం చేయాలి. అప్పటి తెలుగుభాషను, కళాప్రాభవాన్ని పున: ప్రతిష్టించాలి. ఆ లక్ష్యసాధన కోసం రెండు తెలుగు రాష్ట్రాలు సహకరించుకుంటూ ముందుకు సాగితే పూర్వ వైభవం తథ్యం.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## దివ్యాంగుల రైతుల సదస్సు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వ్యవసాయ భూమి యజమానులుగా ఉన్న రైతు దివ్యాంగుల సదస్సును రాష్ట్రస్థాయిలో నిర్వహించాలి. వైకల్యం అనేది శరీరాలకి కానీ ప్రతిభకుకాదు అని రైతు దివ్యాంగులు నిరూపిస్తున్నారు. రైతు దివ్యాంగులలో ఉన్నత విద్యా చదివిన రైతు దివ్యాంగులు ఉన్నారు. జనరల్ రైతులకు, మహిళా రైతులకు వేరువేరుగా రైతు సదస్సులు నిర్వహించినట్లుగానే ఈ సంవత్సరం నూతనంగా రాష్ట్రస్థాయిలో రైతు దివ్యాంగుల సదస్సును ఏర్పాటు చేయాలి. వీరికి ఉచితంగా వ్యవసాయ పరికరాలను, ఎరువులను, క్రిమిసంహారక మందులను సరఫరా చేయాలి. వీరికి ప్రత్యేకంగా రైతు గుర్తింపు కార్డులను ఇవ్వాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యాహక్కులో జాతీయ విధాన వ్యూహాలు!

**ప్రతి విద్యార్థి తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని సామర్థ్యాలలో వెనుకబడి ఉన్న కనీసం 40శాతం మంది విద్యార్థులు కోసం ప్రత్యేక వ్యూహాలతో సిలబస్‌పూర్తి చేయడమనే లక్ష్యంకన్నా తరగతి గదిలో అభ్యసనలో వెనుకబడ్డ విద్యార్థులను తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకోవాలి. అప్పుడే నూతన విద్యా విధాన ప్రధాన భూమికగా వర్ణించే సమ్మిళిత విద్యా సాధనా లక్ష్యం నెరవేరుతుంది. విద్యా హక్కు చట్టం 2009లో పొందుపరచిన బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి.**

మల్లాడి శ్రీనగేష్

దేశంలో 6-14 వయసు కలిగిన విద్యార్థుల పాఠశాల నమోదు గత రెండు దశాబ్దాల నుండి 95 శాతంకాగా ప్రస్తుతం 98.1 శాతంగా నమోదు కావడం చాలా శుభ పరిణామం అంటే 2018 తో పోల్చుకుంటే 2024 నాటికి నమోదు శాతం 66.8శాతం పెరిగినట్టు చెప్పవచ్చు. ఒకప్పుడు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు లేక సతమత మోతూ ఉంటే ప్రభుత్వ ప్రయత్నాలు తలిదండ్రుల ఉత్సుకత, ఎలిమెంటరీ స్థాయివరకు ఉచిత నిర్బంధ విద్యకు కంకణం కట్టుకున్న విద్యా హక్కు చట్టం 2009 వెరసి బడిబయట వున్న బడిఈడు పిల్లలను కూడా పరిగణనలోనికి తీసుకొని లెక్కిస్తే పిల్లల నమోదు సుమారు 98.1 శాతం వరకు చేరినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లల చేరిక సరేవారి రేటెన్షన్ (తరగతిగదిలో నిలుపుదల), నాణ్యమైన విద్య అభ్యసనా సామర్థ్యాల సాధన సమ్మిళిత విద్యలో ప్రధాన భూమికగా చెప్పవచ్చు. సమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలంటే, పాఠశాల యాజమాన్యాలు తమతమ పాఠశాల బోధనా వ్యూహాలను ప్రత్యేకించి రచించుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు తమ పాఠశాలలకు విద్యార్థుల నేపథ్యాలను పరిగణనలోనికి తీసుకొని పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఉపాధ్యాయులు తరగతి నిర్వహణలో తాను అవలంభించాల్సిన వ్యూహాలను స్థానికతను, విద్యార్థుల మాతృభాష, సంస్కృతి, కుటుంబ నేపథ్యం, ఆర్థిక సామాజిక విషయాలను పరిగణనలోనికి తీసుకొని అభ్యసనలో విద్యార్థులకు ఎదురౌతున్న సమస్యలను పరిశీలించి విద్యార్థి ఆధారిత బాటలో తరగతి నిర్వహణజరగాలి. సమ్మిళిత విద్య అనగానే ఒక దివ్యంగులైన విద్యార్థులే కాకుండా పాఠశాలకు వచ్చే వివిధ ఆర్థిక, సాంఘిక, సామాజిక నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చేవిద్యార్థుల అభ్యసనా ప్రక్రియలో ఎదురౌతున్న సమస్యలను తద్వారా పాఠశాల లేదా ఉపాధ్యాయుడు అనుసరించాల్సిన వ్యూహాలనుతప్పక పరిగణనలోనికి గణనలోనికి తీసుకోవాలి. తద్వారాసమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలి. నాణ్యమైన సమాన విద్యను అందించడం, పాఠశాలలో చేరిన విద్యార్థులందరికి సమాన స్థాయిలో అనగా కుల, వర్గ, మత,లింగ, భాష,ప్రాంతీయ, ధనిక, పేద, గ్రామ,పట్టణ, సామాజిక వ్యత్యాసం, దివ్యాంగులు లేదా ఎటువంటి సామాజిక పరమైన వివక్ష లేకుండా అందరికి కావలసిన వసతులు, బోధనావ్యూహాలను రచించి సమాన విద్యనందించడమేనని అందరూ గ్రహించాలి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నూతన విద్యా విధానం నిజమైన స్ఫూర్తితో రూపుదాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమే కాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి తద్వారా దేశం సమ్మిళిత విద్యా చట్రంలో పొందుపరచిన వివిధ నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అందరికీ నాణ్యమైన సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. అంతేకాక ప్రభుత్వం విద్యార్థి తన మాతృ భాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం అంటే విద్యార్థి ప్రాథమిక ఉన్నత విద్యవరకు తాను మాతృభాషలోచదుకొనే అవకాశం ఏర్పరచింది. ఆంగ్లం లేదా స్థానిక భాషలోనే చదవాలనే నిబంధన లేకుండా ఆయా రాష్ట్రాలు భాషా బోధనలో తన నిర్ణయం తీసుకొనే వెసులుబాటు కూడా కల్పించింది. దీనికితోడు విద్యార్థికి పటిష్టమైన పునాది ఏర్పరచడానికి ప్రాథమిక స్థాయిలో ఫౌండషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో 2026-27వ సంవత్సరానికి విద్యార్థి మూడువతరగతికి చేరే నాటికీ అవగాహనతో చదవడం,రాయడం గణిత సామర్థ్యాలు సాధించడం తద్వారా ఎలిమెంటరీ స్థాయికి విద్యార్థి చేరేనాటికి ప్రతి విద్యార్థి తమ తరగతి స్థాయి



విద్యా సామర్థ్యాలు సాధించడం, ఉపాధ్యాయులను తదనుగుణంగా అన్ని స్థాయిల్లోనూ తగిన నైపుణ్యాలతో సంసిద్ధం చేయడం సమ్మిళిత విద్యా లక్ష్యసాధనలో నూతన విద్యా విధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు. ఈ ప్రక్రియలో పాఠశాలలు తమపాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి నేపథ్యాన్ని, పరిగణలోకి తీసుకోవడం,తదనుగుణమైన బోధనా వ్యూహాలను రచించుకోవడం, తరగతిని బైల్స్ ఫ్రెండ్లీ తరహాగా తీర్చిదిద్దడం, భారంలేని విద్యను అందించడం ద్వారా జాతీయ విద్యాచట్రం (నేషనల్ కరికులం ఫ్రేంవర్క్) ప్రధాన లక్ష్యం నెరవేరుతుంది. దీనికి ప్రధానంగా విద్యావ్యవస్థలో వున్న వివిధ విభాగాలు ఉమ్మడిగా అకడమిక్ అభ్యున్నతికి కృషి చెయ్యాలని నూతన విద్యా విధానం సమ్మిళిత విద్యా సాధనకు ప్రధాన భూమికగా నిర్వచించింది. ఇక సమ్మిళిత విద్యాలక్ష్యాలను పరిశీలిస్తే పిల్లల సామర్థ్యాలు, వారు నేర్చుకొనే నేపథ్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి పాఠశాల యాజమాన్యం తప్పక పరిగణనలోనికి తీసుకోవాలి. అనగా సమ్మిళిత విద్య అనగానే ఒక దివ్యంగులైన విద్యార్థులే కాకుండా పాఠశాలకు వచ్చే వివిధ ఆర్థిక, సాంఘిక, సామాజిక నేపథ్యాలనుండి పాఠశాలకు వచ్చే విద్యార్థుల అభ్యసనా ప్రక్రియలో ఎదురౌతున్న సమస్యలను తద్వారా పాఠశాల లేదా ఉపాధ్యాయుడు అనుసరించాల్సిన వ్యూహాలను తప్పక పరిగణనలోనికి తీసుకోవాలి. తద్వారా సమ్మిళిత విద్యా లక్ష్యాలను సాధించాలి. 'సమ్మిళిత విద్య' అంటే సమాజంలో వుండే పిల్లలందరినీ ఒకే గొడుగు క్రింద ఉన్న పాఠశాలలో చేర్చి నాణ్యమైన,సమాన విద్యను అందించడం అనివార్యం. ఈ దిశగా అన్ని పాఠశాలలు తగిన వ్యూహాలను రచించడం అందుకు ఉపాధ్యాయులను సుశిక్షితులుగా తీర్చిదిద్దడం పాఠశాల యాజమాన్య ప్రధాన పాత్రగా గ్రహించాలి. వాస్తవాలు పరిశీలిస్తే సుమారు 40 శాతం మంది విద్యార్థులు ఇప్పటికీ అభ్యసనా లేమితో సతమవుతున్నట్టు అనేక నివేదికలు చెబుతున్నాయి. ప్రాథమిక స్థాయి నుండి పునాది లేకుంటే భవిష్యత్తరాలు ఉన్నత విద్యాభ్యాసంలో కూడా సరైనప్రగతి గడించలేని పరిస్థితి పునరావృతమౌతుందని నిపుణులు వక్కాణిస్తూనే వున్నారు. ఇప్పటికే 8వ తరగతిలో ప్రవేశించినప్పటికీ విద్యార్థులు ఒక పేరా కూడా తడబడకుండా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు అంటే ఆ కోవకు చెందిన విద్యార్థులు చదువు కాలమంతా ఒక విష వలయంలోనే చిక్కుకుపోతున్నారు. ఈ పరిస్థితిలో పదవతరగతిలో ప్రవేశించే నాటికి పాఠశాలలు 80శాతం ఉతీర్ణత సాధిస్తున్నారు. ఈ మధ్యనే ఎన్.సి.ఆర్.టి నిర్వహించిన ఫరక్ రాష్ట్రీయ సేవాక్షన్ సర్వే ప్రకారం సుమారు ప్రకారం సుమారు 75శాతం మంది 9 వ తరగతి విద్యార్థులు తరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్ట్లను కూడా అర్థం చేసుకోని దుస్థితిలో ఉన్నారు. అంతేకాక చిన్నచిన్న గణిత సంబంధిత సమస్యలను కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఫరక్ రాష్ట్రీయ సేవాక్షన్ సర్వేలో ముందంజలో వున్న పంజాబ్, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలను ప్రగతి సాధనలో వారు రచించిన వ్యూహాలను అధ్యయనం చేయలేమా? దేశంలో సుమారు 47శాతం 3వ తరగతి విద్యార్థులు చిన్నకథను కూడా చదివి అర్థం చేసుకోలేని స్థితిలో వున్నారు. 36శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోయారు. 6 వ తరగతిలో సుమారు 34శాతం మంది స్థానిక సంస్థలు, మార్కెట్ ఇతర సంస్థల పని గురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వ తరగతి విద్యార్థులు సుమారు 55శాతం మంది సోషల్ స్టడీస్ సబ్జెక్టులో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు జాతీయ ఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి, ప్రతి విద్యార్థి తరగతి వారీ అభ్యసనా సామర్థ్యాలు సాధించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని సామర్థ్యాలలో వెనుకబడి ఉన్న కనీసం 40శాతం మంది విద్యార్థులు కోసం ప్రత్యేక వ్యూహాలతో సిలబస్‌పూర్తి చేయడమనే లక్ష్యంకన్నా తరగతి గదిలో అభ్యసనలో వెనుకబడ్డ విద్యార్థులను తీర్చి దిద్దడానికి కంకణం కట్టుకోవాలి. అప్పుడే నూతన విద్యా విధాన ప్రధాన భూమికగా వర్ణించే సమ్మిళిత విద్యా సాధనా లక్ష్యం నెరవేరుతుంది. విద్యా హక్కు చట్టం 2009లో పొందుపరచిన బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి. 21వ శతాబ్దపు నైపుణ్యాలను పుణికి పుచ్చు కొనేలా విద్యా వ్యవస్థను బలపరచాలనేదే మూల సూత్రంగా, ఉండాలి. ఈ విద్యా విధాన అమలులో ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు తలిదండ్రులు పాఠశాల యాజమాన్యాలు కలసికట్టుగా కృషి చేయడమే మనందరి ముందున్న ప్రధాన కర్తవ్యం. ●

# యుద్ధాలతో తల్లడిల్లుతున్న ప్రపంచం

కనుమ ఎల్లారెడ్డి

నేడు విశ్వం యుద్ధాలతో చాలా భయానక వాతావరణం తలపిస్తోంది. రష్యా, ఉక్రెన్ యుద్ధం ఒక ప్రక్క సాగుతుండగా, మరోప్రక్క ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులతో భయకంపితుల్ని చేస్తోంది. ఇరాన్‌లో అంతా మరు భూమిని తలపిస్తోంది. అమెరికాకు తోడుగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తోడుగా నిలిచాయి. ఇరాన్ ప్రక్క హెజ్‌బొల్లా, ఇరాకీ మిలిషియా అండగా నిలిచాయి. ఇవి లెబనాన్‌లోని తీవ్రవాద సంస్థలు. ఇందులో హెజ్బొల్లా భయంకరమైన సంస్థ. ఆకస్మాతుగా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఈదాడులు ఇజ్రాయెల్ తిప్పి కొట్టినా నష్టం జరిగిపోయింది. ఇలా దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతల మవుతోంది. ఆయా దేశాలలోని పౌరులు ఏ క్షణనా ఏమి జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పుడు రష్యా, ఉక్రెన్ యుద్ధం కంటే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఎక్కువగా చర్చించుకుంటున్నారు. అటు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. ఈ పరస్పర దాడులతో మధ్యలో కువైట్, సౌది, ఖతార్ తీవ్రంగా నష్టపోతున్నాయి. ఫలితంగానే సౌదిలోని ఆరామ్‌కొ చమురు కేంద్రంపై ఇరాన్ దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. ఇలా పరస్పర దాడులతో ఏం సాధిస్తాయో అర్థం కావడం లేదు. అసలు తప్పంతా అమెరికా, ఇజ్రాయెల్ దాడులతోనే వచ్చింది. ముందు నుంచి ఇరాన్‌ను మెత్తగా మచ్చిక చేసుకుని మీ అణు స్థావరాలు వాటిలోని నిల్వలను ధ్వంసం చేసివుంటే ఏ తగాదా ఉండేది కాదు. దీనికి తోడు ఇరాన్ భద్రత మండలి సెక్రటరీ మేము చర్చలకోసం ప్రయత్నం చేయడం లేదు అనడం గమనార్హం. ఒక విధంగా చుస్తే ఖుమేని లక్ష్యంగా ఇది కొనసాగింది. ఇజ్రాయెల్ అత్యంత సాంకేతికతతో 'మొసద్' అనే క్షిపణితో ఇరాన్ అధినేతను మట్టు పెట్టింది. రంగంలోకి హెజ్బొల్లా రాకపోయి ఉంటే బాగుండేది. ఎందుకంటే ఏడాది క్రితమే ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య కాల్పుల ఒప్పందం జరిగింది. ఇదే విషయం లెబనాన్ చెప్పినా కూడా హెజ్బొల్లా వెన్నక్కి తగ్గలేదు. కాని ఖుమేని మృతితో ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇప్పుడు యుద్ధం భీకర రూపం దాల్చుతోంది. ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్, అమెరికాకు కూడా నష్టం వాటిల్లుతోంది. అయితే ఇవి ఆ దేశాలు లెక్కచేయవు. మొత్తం ఇరాన్ పూర్తిగా మరు భూమిగా మారాలనిఅమెరికా, ఇరాన్‌పై అత్యాధునిక ఆయుధాలు వినియోగిస్తోంది. ఇది ఇలాఉండగా ఇజ్రాయెల్ ప్రకటన మా దాడిలో ఇరాన్ పగ్గాలు చేపట్టిన ఆయాతుల్లా ఆలీ రెజా కూడా మరణించారని వార్త హాల్‌చల్ చేసింది. అయితే ఇరాన్ దీన్ని ధ్రువీకరించలేదు. ఇలా దేశ నాయకులు చంపుకుంటూపోతే ప్రగతి ఏ దేశామైన ఏమి సాధించలేదు. ఈ యుద్ధాలతోనే వేగలేకపోతుంటే పాక్,ఆఫ్ఘానిస్థాన్ యుద్ధంమరో కోణంలో జరుగుతోంది. పాక్‌లోనిబెలూ చిస్థాన్ కూడా పాక్‌పై గుర్రుగా ఉంది. ఇప్పుడు దేశాల మధ్యశాంతి కావాలి, అంతర్జాతీయ చట్టాలు అన్నిదేశాలు పాటించాలి. శాంతిసంస్థ ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో దేశాలు యుద్ధంముగించి శాంతి పరిమళాలుకురిపించాలి. ఇది ఏస్థాయికి పోతుందో చెప్పలేం. యుద్ధం ఆపడమా, చర్చలు చేయడమా అనేది నాయకులే తేల్చుకోవాలి. ●

# సమాజం బాగుపడాలంటే ఓటరు ఆలోచన మారాలి!

డాక్టర్ టి.సేవకుమార్

మనదేశంలో ఓటరు ద్వారా ఎన్నుకోబడిన రాజకీయ పార్టీల పరిపాలన వ్యవస్థలు ఏ విధంగా ఉన్నాయో ప్రతి ఒక్క ఓటరు విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యయుత పార్లమెంటరీ పరిపాలన విధానంలో ఓటు విలువ నేడు చాలా మందికి తెలిసిందే. అయినా ఓటర్లు అనేక ప్రలోభాలకు లొంగిపోయి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారనడంలో ఎంత మాత్రం సందేహం అక్కర్లేదు. నేడు ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులుగాని, చిన్న పార్టీల అభ్యర్థులు గాని ఎక్కడా మూడు అంకెల ఓట్లైనా పొందిన దాఖలాలు కనబడవు. వీరిలో ఎంతమంచివారున్న, నిత్యసంఘ సేవకులు, నిజాయితీపరులు, నిస్వార్థపరులున్న, దేశం, రాష్ట్రం పాడైపోతున్నదన్న ఆవేదనతో, ఆందోళనతో సొంత డబ్బునే ఖర్చు పెట్టుకుని, ఎంత ప్రచారం చేసినా ఫలితాలు ఎంత అన్యాయంగా ఉంటున్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. గతంలో దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కొంతమంది అయినా స్వతంత్ర అభ్యర్థులు, స్థానిక పార్టీల అభ్యర్థులు గెలిచేవారు. చట్టసభలలో వారి గళం గట్టిగా వినిపించేవారు. ఈవేళ ఆ పరిస్థితులు లేవు. అందుకు గల కారణాలను నేడు ప్రతి ఒక్క ఓటరు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత అధికార, ప్రతిపక్షపార్టీల పరిపాలన నేడు ఏ విధంగా ఉందో తెలిసికూడా వారు ఎలాంటి అభ్యర్థులను నిలబెట్టినా ఆ పార్టీలకే ఓటు వేయాలనుకోవడం ఎంతవరకు సమంజసమో ప్రతి ఓటరు ఆలోచించాలి. నేటి ఓటర్లు పార్టీలుగా, మతాలుగా, కులాలుగా విడిపోయి తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవడం దేశానికి, రాష్ట్రాలకు ఎంత మాత్రం మంచిది కాదు. చదువుకున్న, విజ్ఞానవంతులైన వారు అనుకున్నవారు , ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పరిపాలన విధానాలపైస్పష్టమైన అవగాహన ఉన్నవారు కూడా ఆయా పార్టీల ప్రలోభాలకులోనై ఓటు వేయడం వల్ల ఇప్పుడు ఏమి జరుగుతుందో తెలుస్తోంది గదా! మధ్యతరగతి, పేదవారు ప్రత్యక్షంగా డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల రూపంలో వారి బ్యాంకు ఎకౌంట్లో వేస్తున్న డబ్బులకు దాసోహమై ఓటు వేస్తుంటే వీరిని ఎవరు మార్చాలి? అభ్యర్థులు ఎన్నికలలో ఖర్చు పెడుతున్న కోట్ల రూపాయల ధనం, వారికి, బ్యాంకు ఖాతాలలో అధికారికంగా సంక్షేమ పథకాల పేరుతో వేస్తున్న ప్రజాధనం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వస్తుందో ఓటర్లకు తెలియదా? తెలుసుకోవలసిన అవసరం లేదా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా రాష్ట్ర, దేశ భవిష్యత్తు గురించి ఆలోచించకుండా తమ బాగోగుల విషయంలో అపరితమైన, అసాధ్యమైన హామీలు గుప్పించిన వారికే ఓట్లు వేస్తున్నారు. తర్వాత వాటిని అమలు చేయకపోతే ఉద్యమాలకు దిగుతున్నారు. ఓడిస్తామని బెదిరిస్తున్నారు. కానీ ప్రజాధనం నెల నెలా జీతంగా తీసుకుంటూ వారి ఉద్యోగ ధర్మంపై ఆధారపడ్డ ప్రజల పనుల విషయంలో ఏం చేస్తున్నారో తెలియనిది ఎవరికి? ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైలు కదలాలంటే ఎన్ని పాట్లు పడాలో అనుభవం లేనిదిఎవరికి? ఇందుకుప్రభుత్వం



లో అత్యున్నత స్థాయిలో ఉండే బ్యూరోక్రాట్లు కూడా ఎంత మాత్రం అతీతులు కారు. అత్యధికులు రాజకీయ పార్టీలకు వత్తాసులుగా మారి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అంతేకాక ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నవారు కూడా కొందరు ఉంటున్నారు. అంతేకాక ప్రస్తుత పరిస్థితులలోచాలా మంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడంపై రకరకాల వ్యాఖ్యానాలు చేస్తుంటారు. కథనాలు చెప్తుంటారు. కొందరు వివాదాలకూ దిగుతుంటారు. అభ్యర్థి ఎవరైనా సరే గెలిచే వారికే మేము ఓటు వేస్తాం. మా ఓటును ఆ విధంగానే సద్వినియోగం చేసుకుంటామని కొందరుఅంటే, మరికొందరు గెలవని వారికి ఓటువేస్తే మా ఓటు వృధా అవుతుంది అంటున్నారు. ఇంకొందరు ఎవరికి ఓటు వేసిన మనకు ఒరిగేది ఏమిలేదు. ఎవరో ఒకరికి వేస్తాం. లేకపోతే ఓటే వేయం అంటున్నారు. కొందరు ఆ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని, తమ పార్టీ వారినే గెలిపించుకోవాలని ఓట్లు వేసుకుంటామంటున్నారు. అంతేగాని మంచి పరిపాలన అందించే అభ్యర్థులకే ఓట్లు వేస్తామని చెప్పేవారు లేకపోవటం చాలా దురదృష్టకరం. ఇదే ఇప్పుడు ఈ దేశానికి పెట్టిన అతిపెద్ద దౌర్భాగ్యం. ప్రతి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గంలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలతో పాటు ఆయా రాష్ట్రాలలో రిజిస్టరైన, ఈసీఐ గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం మీద 30 నుంచి 40 మంది అభ్యర్థుల పేర్లు బ్యాలెట్ పేపర్లో ఉంటున్నాయి. అయితే అందులో ఒక పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు, ప్రత్యర్థి పార్టీ ఓట్లు చీల్చేందుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు లేకపోలేదు. నిజానికి ఈ దశాబ్దాపు ఎన్నికలలో వీరి బెడద ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులకుపరోక్షంగాచేదోడు వాదోడుగా ఉండేందుకు కొందరు అభ్యర్థులను వివిధ చిన్న పార్టీల తరఫునగాని, స్వతంత్రంగా గాని పోటీకి దించుతున్నాయి. ఈ విధంగా మన ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగబద్ధ ఈసీఐ నిబంధనకు లోబడే ఎవరు ఏమి చేయలేని విధంగా 'వెర్రి తలలు' వేస్తోంది. ఎన్నికలపై విరక్తి చెందినవారు కొందరైతే, తమ వారినే గెలిపించుకోవాలని పట్టుదల గలవారు కొందరు. గతంలో ఓటర్లలో అత్యధిక శాతం మందిలో మంచిచెడుల విచక్షణ, సమాజ సమగ్ర అభివృద్ధి వంటి విశాల దృక్పథం ఉండేది. అందువలనే స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు ఎన్నికలలో విజయం సాధించేవారు. ఆరోజుల్లో అభ్యర్థిని చూసి ఓటు వేసేవారు. కనుకనే వారు గెలిచేవారు. నేడు ఎన్నికలలో అభ్యర్థిని చూడడమే మర్చిపోయారు. ఒకవర్గం ఓటర్లు కేవలం కులం, మతం, పార్టీకే ప్రాధాన్యత ఇచ్చి ఆయా అభ్యర్థుల ఎలాంటి వారైనా మాకేమి సంబంధం లేదని ఓట్లు వేస్తుంటే మరో వర్గం సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వ ధనాన్ని వారి బ్యాంకుఖాతాలలో నెలనెలా వేసేవారికి అందులోనూ ఎక్కువ మొత్తంలో వేసేవారికే ఓటు వేస్తున్నారు .ఇక మూడవ వర్గం డబ్బు,మద్యం వంటి ఆరోజు తాత్కాలిక తాయిలాలకు లొంగిపోయి ఓటేస్తున్నారు. దేశ, రాష్ట్రాల భవిష్యత్తు ఐదేళ్లకు ఒకసారి ఓటరు చేతిలోకి వస్తుంది. అప్పుడు ఆలోచించి, నిస్వార్థంగా ,కుల, మత ,పార్టీలకతీతంగా మంచి అభ్యర్థిని ఎంచుకొని ఓటుహక్కు వినియోగించుకుంటే దేశ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. ఓటు మన ప్రజాస్వామ్యయుత పరిపాలన వ్యవస్థకు మూలాధారం. పునాది. కేవలం ఓటర్ల విచక్షణాయుత ఓటు హక్కు వినియోగంపైనే మన దేశ, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు పూర్తిగా ఆధారపడి ఉంటుంది. అంటే మన దేశ భవిష్యత్తు మన దేశ పౌరుడైన ఓటర్ చేతుల్లో, చేతల్లోనే ఉంది. ●

# ఇంధన సంక్షోభం



- సౌదీ, ఖతార్ అతిపెద్ద రిఫైనరీలపై ఇరాన్ క్షిపణి దాడులు
- అమెరికా ప్రముఖుల ఇళ్లపై డ్రోన్ల కదలికలతో నిఘా అప్రమత్తం
- ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ దాడి: ట్రంప్ సీరియస్
- ఇలాగే కొనసాగితే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతాం: సౌదీ అల్టిమేటమ్
- యుద్ధాన్ని మేమే ముగిస్తాం: రక్షణమంత్రి పీట్ హెగ్సెత్

**టెహ్రాన్, టెల్‌అవీవ్, వాషింగ్టన్, మార్చి 19:** మధ్యప్రాచ్యంలో యుద్ధం మరింత ఉధృతం అవుతోంది. ఇపుడు ఇరాన్ తన యుద్ధ వ్యూహాన్ని మార్చి గల్ఫ్‌దేశాల్లోని చమురు క్షేత్రాలపైనే దాడులుచేసింది. ఖతార్ జీవనాడి అయిన చమురుకేంద్రం, సౌదీలోని ఆరామ్‌కో కంపెనీపైనా మళ్లీ దాడులు చేసింది. ఇదిలా ఉంటే హార్ముజ్ సమీపం లోని క్షిపణి కేంద్రాలను ధ్వంసంచేసేందుకు అమెరికా శక్తిమంతమైన తనవద్దనున్న బాంబులు కురిపిస్తోంది. అంతేకాదు భూతల దాడులకోసం వేలాదిగా సైనికులను పంపి స్తోంది. ఇరాన్ తీరప్రాంతమే లక్ష్యంగా యుఎస్ తన సైనికబలగాలను తరలిస్తోంది. 120 నౌకలు ధ్వంసంచేసామని, 7800 లక్ష్యాలపై దాడులుచేసినట్లుగా అమెరికా సెంట్‌కామ్ చెపుతోంది. ఖతార్‌లోని అతిపెద్ద గ్యాస్‌క్షేత్రం రాస్ లఫాన్‌పై దాడిచేయడంతో ఇపుడు ప్రపంచదేశాలకు గ్యాస్ సరఫరాపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే కొనసాగితే ఇక ఇరాన్‌పై సైనికచర్యలు చేపడతామని సౌదీ అరేబియా ఇప్పటికే హెచ్చరికలు పంపించింది. అమెరికాకు సహకరించే ఎలాంటి దేశం అయినా తమకు శత్రువేనని ఇరాన్ చెపుతోంది. అందుకోసమే గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తామని కూడా వెల్లడించింది. దాడులు మరింతగా ఉధృతం అవుతాయని కూడా సుప్రీంకమాండర్ మొజ్తబా ఖమైనీ పేరిట హెచ్చరికలు వెలువడ్డాయి. అంతేకాకుండా ఇరాన్ ఇపుడు తన వ్యూహాన్ని కూడా మారు స్తోంది. సముద్రగర్భంలోని ఇంటర్నెట్ కేబు ళ్లపై దృష్టిసారించింది. అదే జరిగితే పశ్చిమ సియాతోపాటుయూరోప్‌లోని సగం దేశాలకు ఇంటర్నెట్ బంద్ అవుతుందన్న ఆందోళన పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఇరాన్‌కోసమే ప్రత్యేకంగా తరలించిన యుద్ధనౌక గెరాల్డ్ ఫోర్డ్ యుద్ధంనుంచి వైదొలిగింది. గ్రీస్‌లోని నావికాస్థావరం క్రెటెకు మరమ్మతులకోసం బయలుదేరింది. నౌక తీవ్రస్థాయి అగ్ని ప్రమాదానికి లోనుకావడంవల్లనే యుద్ధం నుంచి వైదొలిగిందని అమెరికా చెప్పు కుంటున్నది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అమెరికా లోని ప్రముఖ నేతల ఇళ్లపై డ్రోన్ల కదలికలు కనిపించడంతో యూ ఎస్ నిఘా వ్యవస్థ అప్రమత్తం అయింది. ఈ డ్రోన్లు ఎలా వచ్చా యి. ఎక్కడినుంచి వచ్చా యన్న అంశంపై ఆదుర్దాపెరిగింది. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగమంత్రి మార్కోరుబియోల ఇళ్లపై నే ఈ డ్రోన్లకద లికలు పదేపదే కనిపించడంతో అమెరికా రక్షణ యంత్రాంగం అప్రమత్తం అయింది. అయితే యుద్ధక్షేత్రంలో నిర్వహణ కదు భా రం అవుతోందని, 18 లక్షలకోట్లు ఇవ్వాలని అమెరికా రక్షణ వ్యవస్థ పెంటగాన్ ట్రంప్ సర్కారుకు నివేదిక ఇచ్చింది. ఖరీదైన ఆయుధ సామగ్రి వినియోగంతోభారీగా వ్యయభారం పెరుగుతోందని పెంటగాన్ చెపుతోంది. ఇదిలా ఉంటే ఖతార్ జీవనాడి అయిన గ్యాస్ క్షేత్రం రాస్ లఫాన్‌పై ఇరాన్ దాడిచేయడంపట్ల అమెరికా అధ్యక్షుడుట్రంప్ సీరియస్ అయ్యారు. ఇరాన్ సౌత్‌పార్స్ గ్యాస్ కేంద్రంపై ఇజ్రాయెల్‌దాడి చేసిందని, అమెరికాకుగానీ, ఖతార్‌కు గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇరాన్ గ్యాస్‌దాడిపై అమెరికాకు ఎలాంటి సమాచా రంలేదని, ఖతార్‌కు అసలు సంబంధమే లేదని ట్రూత్‌సోషల్‌మీడియాలో వెల్లడించా రు. మరోసారి ఖతార్‌ను లక్ష్యంగాచేసుకుని దాడిచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ హద్దులుమీరితే ఇజ్రాయెల్ ప్రమేయం లేకుండానే సౌత్‌పార్స్ మైదానంపై అత్యంత శక్తివంతమైన బలప్రయోగంచేస్తుందని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే సౌదీలోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీ ఆరామ్‌కోపై ఇరాన్‌మరోసారి క్షిపణి దాడులుచేయడంతో సౌదీ ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. అలాగే ఖతార్ అతిపెద్ద సహజవాయుకేంద్రం రాస్ లఫాన్‌పై ఇరాన్‌దాడిచేయడాన్ని కూడా గల్ఫ్ కూటమి తీవ్రంగాపరిగణిస్తోంది దీనితో ఇపుడు అమెరికామద్దతు ఉన్నా లేకున్నా ఇరాన్‌పై సైనిక చర్యకు దిగాల్సి ఉంటుందని సౌదీ అరేబియా హెచ్చరించింది. సౌదీతో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సైతం ఇదే ధోరణిలో హెచ్చరికలుచేయడం ఇరాన్‌పై ముప్పేట దాడి వెనుక అమెరికా వ్యూహం ఉందని స్పష్టం అవుతోంది. ఇరాన్‌పై యుద్ధంలో తాము అనుకున్న లక్ష్యాలన్నీ సాధించామని, యుద్ధం మేమేముగిస్తామని అమెరికా రక్షణమంత్రి పీట్‌హెగ్సెత్ అన్నా రు. ఖతార్, సౌదీలపై దాడికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని, ఇప్పటికే ఇరాన్‌లోని ఆయుధ వ్యవస్థలు, నౌకాదళ వ్యవస్థలన్నింటినీ నాశనంచేసామని, 11 జలాంతర్గాములను ధ్వంసంచేసామని ఆయన అన్నారు. ఏ లక్ష్యంతో యుద్ధం ప్రారంభించామో అన్నీ సాధించి అనుకున్న మిషన్ పూర్తిచేస్తామని అమెరికా రక్షణ మంత్రి స్పష్టంచేయడాన్ని చూస్తే యుద్ధం మరికొంతకాలం అనివార్యం అని తెలుస్తోంది.



## యుద్ధం కోసం రూ. 18 లక్షల కోట్లివ్వండి! : పెంటగాన్

**వాషింగ్టన్, మార్చి 19:** ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర యుద్ధం చేస్తోన్న అమెరికా.. ఇందుకోసం భారీగా ఖర్చుపెడుతోంది. ఇప్పటికే రూ. వేలాది కోట్ల విలువైన ఆయుధాలను వినియోగించగా.. రానున్న రోజుల్లో దీనిని కొనసాగించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో 200 బిలియన్ డాలర్లకుపైగా నిధులు కోరినట్లు అమెరికా పార్లమెంట్‌కు చేసిన ప్రతిపాదనను ఆమోదించాలని పెంటగాన్ కోరినట్లు తెలిసింది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్టు కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ అజెండాను అమలు చేసేందుకు సొంత పౌరులపైనే అమెరికా భారం మోపుతోందని విమర్శలు గుప్పించింది. 'ఇరాన్, అమెరికాలపై రుద్దిన ఈ యుద్ధం మొదలై మూడు వారాలు మాత్రమే అయ్యింది. 200 బిలియన్ డాలర్లు అనేది చిన్న మొత్తమే. ఇజ్రాయెల్ అజెండా కోసం రూ. లక్షలాది కోట్లు ఖర్చు పెడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఈ చర్యల పట్ల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు అమెరికన్ ప్రజలు కృతజ్ఞత చెప్పాలి' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్జీ వ్యంగ్యంగా స్పందించారు. ఈ యుద్ధంలో పాల్గొనడం అమెరికాకు ఇష్టం లేదని అరాగ్చీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాను నెతన్యాహు ఇందులోకి లాగారని అన్నారు. అమెరికాలోని కొందరు అధికారుల కారణంగా అక్కడి పౌరులు ఈ యుద్ధ భారాన్ని మోస్తున్నారని అన్నారు. మరోవైపు, ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై దాడి గురించి ఇజ్రాయెల్ తమకు చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.



## ప్రముఖుల నివాసాలపై డ్రోన్‌ల కదలికలు
### ఆందోళనలో అమెరికా నిఘా వేగులు

**వాషింగ్టన్, మార్చి 19:** అమెరికా ప్రభుత్వంలో ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల నివాసాలపై డ్రోన్లు సంచరించడం తీవ్ర కలకలం రేపుతోంది. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ల నివాసాల పరిసరాల్లో ఈ డ్రోన్లు కనిపించడంతో నిఘా వర్గాలు ఉలిక్కిపడ్డాయి. కొన్ని రోజులుగా వర్జీనియాలోని లాంగ్లీ ఎయిర్ ఫోర్స్ బేస్ వంటి అత్యంత కీలకమైన సైనిక స్థావరాల వద్ద కూడా రాత్రి సమయాల్లో ఈ డ్రోన్లు చక్కర్లు కొడుతున్నాయి. సుమారు 20 డ్రోన్లు గుంపులుగా ఏర్పడి, తక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ డ్రోన్లను ఎవరు, ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారనేది అధికారులకు అంతుచిక్కడం లేదు. ఇవి సాధారణ వాణిజ్య డ్రోన్ల కంటే చాలా వేగంగా ప్రయాణిస్తుండటంతో, వాటిని అడ్డుకోవడం సవాలుగా మారింది. ఈ ఘటనలపై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్ బీఐ), పెంటగాన్ ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించాయి. కీలక నేతల కదలికలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ లేదా ఇతర విదేశీ శక్తులు ఈ డ్రోన్లను ప్రయోగిస్తున్నాయా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు.

## రిపబ్లిక్‌డే వేడుకలు జెండా వందనాలకే పరిమితం చేసిన పాకిస్తాన్



**ఇస్లామాబాద్, మార్చి 19:** ఆర్థిక సంక్షోభం కోరల్లో చిక్కుకున్న పాకిస్థాన్, తన రిపబ్లిక్ డే (మార్చి 23) వేడుకలు కేవలం జెండా ఆవిష్కరణలకే పరిమితమని పాక్ షరీఫ్ సర్కారు ప్రకటించింది. దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది అధికారిక వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం ప్రకటించింది. ఆడంబరాలకు పోకుండా కేవలం జెండా ఆవిష్కరణకే ఈ వేడుకలను పరిమితం చేయాలని నిర్ణయించారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుతున్న చమురు ధరల నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా అట్టహాసంగా జరిగే సైనిక కవాతు, 31గన్ సెల్యూట్, భారీ సాంస్కృతిక ప్రదర్శనలను ఈసారి పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ శాఖలన్నీ నిరాడంబరంగా వ్యవహరించాలని, అనవసర ఖర్చులకు తావు లేకుండా గౌరవప్రదంగా ఈ సందర్భాన్ని పాటించాలని ప్రధాని ఆదేశించారు.

## రంగంలోకి నరేంద్ర మోడి
### ప్రపంచ దేశాధినేతలతో ప్రధాని ఫోన్‌ఛాట్!



**న్యూఢిల్లీ, మార్చి 19:** పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ నేతలతో మాట్లాడారు. సౌదీ అరేబియాలోని గ్యాస్ కేంద్రాలపై దాడులతో ప్రపంచ దేశాలకు గ్యాస్ కొరత ఏర్పడనున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తం కావాలని మోడీ కోరారు. పశ్చిమాసియాలో తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపాలని ఆయన గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మన్యుయేల్ మక్రాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఒమన్ సుల్తాన్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిచర్యగా సౌదీ అరేబియాలోని గ్యాస్ రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ విరుచుకుప డుతోంది. ఫలితంగా ముడి చమురు ధర.. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. యుద్ధం ఇలానే కొనసాగితే గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ముప్పు తప్పేలా లేదు. దాంతో తక్షణమే పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత స్థాపనకు కృషి చేయాలని భారత ప్రధాని ప్రపంచ నేతలను కోరారు. ఇదే అంశంపై గురువారం ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు, మలేషియా ప్రధాని, ఒమన్ సుల్తాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. నా ప్రియమైన స్నేహితుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో పశ్చిమాసియా యుద్ధం గురించి మాట్లాడాను. తక్షణమే యుద్ధ తీవ్రతను తగ్గించాల్సిన అవసరముందని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలనే విషయంమై ఆయనతో చెప్పాను. ఆ ప్రాంతంలో శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొనేందుకు అవసమరమైన సాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వివరించానని మోడీ తన సోషల్‌మీడి ఆ పోస్ట్‌లో వెల్లడించారు. నా స్నేహితుడు, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో మాట్లాడాను. హరి రయా ఐదిల్‌ఫిత్రి పండుగను పునస్కరించుకొని ఆయనకు, మలేషియా ప్రజలకు శుభాకాంక్షలు తెలియ జేశాను. ప్రపంచాన్ని కలవరపరుస్తున్న పశ్చి మాసియాలో యుద్ధం గురించి ద్దరం చర్చిం చాం. చర్చల ద్వారా, రాయబారం ద్వారా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, వీలైనంత తొందరగా శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొల్పడానికి కృషి చేయాల్సిన అవసరముందని ఇరువురం భావించాం అని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నా సోదరుడు సుల్తాన్ హైథమ్ బిన్ తారీఖ్‌తో సంభాషణ అర్థవంతంగా సాగింది. ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశాను. పశ్చిమాసియాలో శాంతి స్థాపన అత్యవసరమని, అక్కడ సుస్థిరత ఏర్పాటు గురించీ మాట్లాడుకున్నాం. ఒమన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా దాడులు చేయడాన్ని భారత్ ఖండిస్తుందనే విషయాన్ని మరోమారు తెలియజేశాను. భారతీయులతో పాటు వేలాది మందిని సురక్షితంగా తరలించినందుకు ఒమన్ ప్రభుత్వం కృషిని అభినందించాను. హార్మూజ్ జలసంధి గుండా సురక్షితంగా, స్వేచ్ఛగా రాకపోకలు జరగాలనే మాటకు భారత్, ఒమన్ కట్టుబడి ఉన్నాయి అని మోడీ వెల్లడించారు.

## ఖతార్ రాస్ లఫాన్‌పై ఇరాన్ భారీ దాడులు

**దోహా, మార్చి 19:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఖతార్‌లోని అతిపెద్ద లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ప్లాంట్ అయిన రాస్ లఫాన్‌పై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో అంతర్జాతీయ చమురు, గ్యాస్ మార్కెట్లు అల్లకల్లోలంగా మారాయి. ఈ దాడితో ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపో యింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. అమెరికాఇజ్రాయెల్ దాడులకు ప్రతీకా రంగా ఇరాన్ ఈ చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే పశ్చిమాసియాలో అమెరికా ఆస్తులతో పాటు, ఇంధన ఉత్పత్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ నెల ప్రారంభంలో కూడా ఖతార్ గ్యాస్ క్షేత్రాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడంతో ప్రపంచం లోనే అతిపెద్ద గ్యాస్ ఎగుమతిదారు అయిన ఖతార్ ఎనర్జీ ఉత్పత్తిని నిలి పివేసింది. తాజా పరిణా మాలతో హార్ముజ్ జలసంధి యుద్ధ క్షేత్రంగా మారింది. ప్రపంచం లోని ఐదో వంతు చమురు రవాణా జరిగే ఈ మార్గంలో దాడుల భయంతో రాకపోకలు దాదాపుగా స్తంభించిపోయాయి. దీంతో 700కు పైగా కార్గో నౌకలు సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో నిలిచిపోయాయి. పశ్చిమాసి యాలో నెలకొన్న ఈ సంక్షోభం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

భారత్ తన సహజ వాయువు అవసరాల్లో దాదాపు 50 శాతం అంతర్జాతీయ మార్కెట్ల నుంచే సమకూర్చుకుంటోంది. ఇందులో ముఖ్యంగా ఖతార్ నుంచి 40 శాతం ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకుంటోంది. మన దేశ మొత్తం గ్యాస్ అవసరాల్లో దాదాపు 20 శాతం ఖతార్ నుంచే వస్తోంది. ఇంధన రంగ నిపుణుడు కిరీట్ పారిఖ్ అంచనాలుచూస్తే ఖతార్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో భారత్ తన గ్యాస్ వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తుంది. ముఖ్యంగా పారిశ్రామిక, విద్యుత్ రంగాల్లో గ్యాస్ వాడకంపై కోతలు విధించాల్సిన అవసరం ఏర్పడుతుందని వివరించారు. ప్రస్తుతం భారత్‌లో రోజువారీ గ్యాస్ వినియోగం 189 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లుగా (ఎంఎంఎస్‌సీఎండీ) ఉంది. ఇందులో దేశీయంగా 97.5 ఎంఎంఎస్‌సీఎండీ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. మిగిలినది దిగుమతులపైనే ఆధారపడి ఉంది. గత వారం నాటికి, ఫోర్స్ మేజర్ పరిస్థితుల కారణంగా 47.4 ఎంఎంఎస్‌సీఎండీ సరఫరాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ప్రభుత్వ రంగ గ్యాస్ కంపెనీలు ప్రత్యామ్నాయ వనరుల నుంచి ఎల్ఎన్‌జీ కార్గోల కోసం కొత్తగా ఆర్డర్లు ఇచ్చాయి. పెరుగుతున్న ధరలు, సరఫరాలో అంతరాయాల కారణంగా భారత్‌కు ఇంధన కష్టాలు తప్పేలా లేవు.

## ఇజ్రాయెల్ చేసింది తప్పే



**వాషింగ్టన్, మార్చి 19:** ఇరాన్‌లోని కీలకమైన సౌత్ ఫార్స్ చమురు క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడులకు దిగింది. ఈ దాడులకు ప్రతీకారంగా అంతకంటే విలువైన ఖతార్‌లోని రాస్ లఫాన్ ఆయిల్ హబ్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి చేసింది. దీంతో అంతర్జాతీయంగా తీవ్ర నిరసన వ్యక్తమవు తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇజ్రాయెల్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇజ్రాయెల్ చేసింది తప్పే. ఇది తమకు తెలియకుండా జరిగిన దాడి" అని ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్ అంగీకరించారు. ఖతార్‌పై ఇరాన్ చేసిన దాడి కూడా తప్పేనని ట్రంప్ అన్నారు. మరోసారి ఖతార్ చమురు హబ్‌పై ఇరాన్ దాడి చేస్తే తామే ఆ దేశంలోని సౌత్ ఫార్స్ చమురు క్షేత్రంపై భారీ దాడి చేసి నాశనం చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మధ్యప్రాచ్యంలో జరిగిన పరిణామాలపై ఆగ్రహంతో ఇజ్రాయెల్, ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్ అనే ఒక ప్రధాన కేంద్రంపై హింసాత్మకంగా దాడి చేసిందని, మొత్తం కేంద్రంలో ఒక్క చిన్న భాగం దెబ్బతిందని ట్రంప్ తెలిపారు. ఈ ప్రత్యేక దాడి గురించి అమెరికాకు ఏమీ తెలియదు. అలాగే ఖతార్ కూడా దీనితో ఏ విధంగాను సంబంధం లేదన్నారు. అలాగే ఇది జరగబోతోందని వారికి ఏమాత్రం ఊహ కూడా లేదని ట్రంప్ చెప్పుకొచ్చారు.

## గ్లోబల్ ఇంటర్నెట్‌కు ఇరాన్ వార్ ముప్పు

**వాషింగ్టన్, మార్చి 19:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న యుద్ధం ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు కొత్త ముప్పును తెచ్చింది. హార్మూజ్ జలసంధిలో సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చన్న ఆందోళనలు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఇదే నిజమైతే గ్లోబల్ ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి, ప్రపంచ దేశాలపై దాని ప్రభావం భారీగా ఉంటుంది. యుద్ధం కారణంగా హార్మూజ్ జలసంధితో పాటు ఎర్ర సము ద్రం కూడా వాణిజ్య నౌకల రాకపోకలకు మూసుకుపోయింది. మార్చి 3న ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ), హార్మూ జ్‌ను దాటే ప్రయత్నం చేసే ఏ నౌకనైనా కాల్చివేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌కు మద్దతుగా హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలో దాడులను పునః ప్రారంభించడంతో రెండు ప్రధాన సముద్ర మార్గాలు యుద్ధ క్షేత్రాలుగా మారాయి. ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 95 శాతం సముద్రగర్భ కేబుళ్ల ద్వారానే నడుస్తుంది. ఆసియా, ఐరోపా, ఆఫ్రికాలను కలిపే 17 కీలక కేబుళ్లు ఒక్క ఎర్ర సముద్రం గుండానే వెళుతున్నాయి. హార్మూజ్ జలసంధి గుండా వెళ్లే కేబుళ్లు ఇరాన్, ఇరాక్, కువైట్, బహ్రైన్, ఖతార్ వంటి దేశాలను గ్లోబల్ నెట్‌వర్క్‌తో అనుసంధానిస్తున్నాయి. భారతదేశ విదేశీ డేటా కనెక్టివిటీకి సైతం ఈ మార్గాలే కీలకం. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు గల్ఫ్ దేశాల్లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టాయి. యూఏఈ, సౌదీ అరేబియాలను ఏఐ హబ్‌లుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పుడు కేబుళ్లకు నష్టం వాటిల్లితే ఆ ప్రణాళికలు తలకిందులవుతాయి. ఈ కేబుళ్లు దెబ్బ తింటే, వాటిని బాగు చేయడానికి ప్రత్యేక నౌకలు యుద్ధ ప్రాంతాలకు వెళ్లడం అసాధ్యం. వారాలు, నెలల పాటు ఇంటర్నెట్ సేవలకు అంతరా యం తప్పదు. 2024లో హమాస్‌ఇజ్రాయెల్ ఘర్షణల సమయంలో హూతీలు ఎర్ర సముద్రంలో కేబుళ్లపై దాడి చేసినప్పుడు ఇదే పరిస్థితి ఎదురైంది. ఇరాన్ ఇప్పటికే హార్మూజ్ జలసంధిలో సీమైన్లు అమర్చినట్టు సమాచారం. పపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో దాదాపు 17 శాతం ఈ మార్గాల గుండానే వెళుతుంది.

## మంటల్లో పశ్చిమాసియా

### సౌదీ ఆరామ్‌కోపై ఇరాన్ మళ్లీ దాడి!

**దుబాయి, మార్చి 19:** సౌదీ అరేబియాలోని కీలక చమురు శుద్ధి కర్మాగారం లక్ష్యంగా ఇరాన్ దాడికి పాల్పడింది. గురువారం తెల్లవారుజామున సౌదీలోని ఆరామ్‌కో చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి జరిగినట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది. ఎర్ర సముద్రంలోని యాన్బు పోర్టు సమీపంలో ఈ రిఫైనరీ ఉంది. డ్రోన్ దాడి కారణంగా పెద్ద ఎత్తున మంటలు వెలరేగి, రిఫైనరీ స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఎవరైనా గాయపడ్డారా అనేది తెలియాల్సి ఉంది. ఇరాన్ అంతకుముందు ఖతార్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేసింది. ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై దాడికి పాల్పడింది.

### పశ్చిమాసియాకు వేలాదిగా అమెరికా బలగాలు!

**వాషింగ్టన్, మార్చి 19:** అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఇప్పుడే సద్దుమణిగే అవకాశాలు కన్పించడం లేదు. ఇరాన్‌తో జరుగుతోన్న పోరును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వేలాది యుఎస్ బలగాలను పశ్చిమాసియాకు తరలించాలని యోచిస్తున్నట్లు సమాచారం అమెరికా అధికారులు ఈ విషయం తెలిపినట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. దాని ప్రకారం.. 'పశ్చిమాసియాలో తమ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు వేలాది మంది సైనికులను అక్కడ మోహరించాలని ప్రభుత్వం యోచిస్తోంది' అని ఆ అమెరికా అధికారి పేర్కొన్నారు. వైమానిక, నావికాదళాల ద్వారా హార్మూజ్ జలసంధి మీదుగా చమురు ట్యాంకర్ల రవాణాకు రక్షణ కల్పించే విషయంపైనా ప్రభుత్వం చర్చ లు జరిపినట్లు వెల్లడించారు. అయితే, ఇందుకోసం ఇరాన్ తీర ప్రాంతంలో యుఎస్ సైన్యాన్ని మోహరించాల్సి రావచ్చన్నారు. వీటితో పాటు ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖర్గ్ ద్వీపానికి యుఎస్ బలగాలను పం పే విషయంపైనా మాట్లాడుకున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఆపరేషన్ అత్యంత ప్రమాదకరమైనదని యుఎస్ అధికారి ఒకరు హెచ్చరించారు.

### హోర్ముజ్‌లో చిక్కుకున్న భారత్ 3.2 లక్షల టన్నుల గ్యాస్
#### దేశీయ నిల్వల నివేదికలివ్వాలని ఆయిల్ కంపెనీలకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ, మార్చి 19:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్ గ్యాస్ నిల్వలపై మరింత ప్రభావం చూపించేప్రమాదం పొంచి ఉంది. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఆటంకాలు ఏర్పడి భారత్‌కు రావాల్సిన సుమారు 3.2 లక్షల టన్నుల వంట గ్యాస్ (ఎల్పీజీ) సరుకు సముద్ర మార్గంలోనే నిలిచిపోయింది. కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, ప్రస్తుతం హార్ముజ్ జలసంధి సమీపంలో 22 నౌకలు చిక్కుకుపోయాయి. వీటిలో భారత్ కు ఎల్పీజీని తీసుకొస్తున్న భారీ నౌకలు కూడా ఉన్నాయి. యుద్ధ వాతావరణం నేపథ్యంలో భద్రతాపరమైన అనుమతులు లభించకపోవడంతో ఈ నౌకలు కదలలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌అమెరికా కూటమి మధ్య ఘర్షణలు 20వ రోజుకు చేరుకున్నా ఉద్రిక్తతలు తగ్గలేదు. యుద్ధం మరికొంత కాలం కొనసాగవచ్చన్న సంకేతాలతో అంతర్జాతీయ సరఫరా మార్గాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. భారత్ తన ఎల్పీజీ అవసరాలో సింహభాగాన్ని గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. హార్ముజ్ మార్గంలో అంతరాయం ఇలాగే కొనసాగితే దేశీయంగా గ్యాస్ సరఫరా గొలుసు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇందుకోసం ముందుగా దేశీయంగా ఉన్న ఆయిల్‌కంపెనీలవద్ద ఉన్న నిల్వల వివరాలను నివేదికలు ఇవ్వాలని కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీచేసింది. .

### భవిష్యత్తు యుద్ధాలన్నీ సైబర్ వార్‌లే!
#### ఎఐ, సైబర్ దాడులు, డ్రోన్లదే భూమిక

**వాషింగ్టన్, మార్చి 19:** యుద్ధాల స్వరూపం భవిష్యత్తులో పూర్తిగా మారిపో తోంది. భారీ సైన్యాల స్థానంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్లు, డ్రోన్లు వంటి స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు రానున్నాయి. అమెరికా కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక ఆపరేషన్ బలగాలపై నిర్వహించిన విచారణలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు తన సైన్యాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్న భారత్, ఈ పరిణామాలను అత్యంత నిశితంగా గమనిస్తోంది. యుద్ధ క్షేత్రం వేగంగా రూపాంతరం చెందుతోందని, టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం తో దేశాలతో పాటు, దేశాలతో సంబంధం లేని చిన్న గ్రూపులు కూడా డ్రోన్లు, సైబర్ టూల్స్, ఏఐ ఆధారిత వ్యవస్థలను సులభంగా వినియోగించ గలుగుతున్నాయని అమెరికా చట్టసభ సభ్యులు, సైనిక ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ సభ్యుడు జాసన్ క్రో మాట్లాడుతూ ఏఐ, డ్రోన్లు, సంక్లిష్టమైన సైబర్ టూల్స్ వంటి అధునాతన సాంకేతికతను పొందేందుకు అడ్డంకులు మునుపెన్నడూ లేనంతగా తగ్గాయి. దీనివల్ల చిన్న సమూహాలు కూడా తమ శక్తికి మించి దెబ్బతీయగలవని హెచ్చరించారు. ప్రస్తుత భద్రతా వాతావరణం ఏకకాలంలో వేగంగా మారుతోందని, శత్రువులు సాంకేతికత సాయంతో ఏకమవుతున్నారని రక్షణ శాఖ సహాయ మంత్రి డెరిక్ అండర్సన్ తెలిపారు. అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ ఫ్రాంక్ బ్రాడ్లీ మాట్లాడుతూ శత్రువుల కంటే వేగంగా మనం మారాలని కొత్త సామర్థ్యాలను వేగంగా అభివృద్ధి చేసుకుని, సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. భవిష్యత్ ఘర్షణల్లో సైబర్, డిజిటల్ రంగాలే కేంద్రంగా ఉంటాయని బ్రాడ్లీ పేర్కొన్నారు. ప్రాణాంతక స్వయంప్రతిపత్తి కలిగిన ఆయుధాల పెరుగుదల ఆధునిక యుద్ధానికి నిదర్శనమని చెబుతూనే, ప్రాణాంతక ఆయుధాలను ప్రయోగించే విషయంలో అంతిమ నిర్ణయం మానవ నియంత్రణలోనే ఉండాలని, యుద్ధ చట్టాలు కూడా ఇదే చెబుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. సంప్రదాయ సైనిక బలగాల సంఖ్య కంటే వేగం, సాంకేతికత, సమాచార ఆధిపత్యమే భవిష్యత్ యుద్ధాల్లో విజయాన్ని నిర్దేశిస్తాయనే ఏకాభిప్రాయం బలపడు తోంది. ఈక్రమంలోనే భారత్ కూడా భారీ బలగాల మోహరింపునకు బదులుగా, వివిధ రంగాల్లో పనిచేయగల సాంకేతికత ఆధారిత, ప్రత్యేక బలగాలను సిద్ధం చేయడంపై దృష్టి సారించింది.

### తొలిసారిగా ఉత్తర కొరియాలో వ్యతిరేక ఓట్ల వివరాలు

**ప్యాంగ్యాంగ్, మార్చి 19:** ఉత్తర కొరియాలో జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఊహించినట్లే అధికార వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ఘన విజయం సాధించింది. ఈ నెల 15న జరిగిన ఈ ఎన్నికల్లో కిమ్ జోంగ్ ఉన్ నాయకత్వంలోని పార్టీ, దాని మిత్రపక్షాలు ఏకంగా 99.93 శాతం ఓట్లను కైవసం చేసుకున్నాయి. ఈసారి ఫలితాల్లో ఒక అనూహ్యమైన, ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు పోలైన విషయాన్ని ఆ దేశ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. ఉత్తర కొరియా 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ కోసం జరిగిన ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని స్థానాల నూ అధికార కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. దేశంలో నమోదైన ఓటర్లలో ఏకంగా 99.99 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారని, ఇది ఒక రికార్డు అని ప్రభుత్వ మీడియా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. విదేశాల్లో లేదా సముద్రంలో విధుల్లో ఉన్న కొద్దిమంది మాత్రమే ఓటు వేయలేదని తెలిపింది. ఫలితాల ప్రకారం అధికార పార్టీకి అనుకూలంగా 99.93 శాతం ఓట్లు పోలయ్యాయి. మిగిలిన 0.07 శాతం ఓట్లు అధికార అభ్యర్థులను తిరస్కరిస్తూ పోలైన వ్యతిరేక ఓట్లు అని ప్రభుత్వం అంగీకరించింది. ఉత్తర కొరియా ఎన్నికల విధానంలో ప్రతిపక్షాలు పోటీ చేసే అవకాశం ఉండదు. ప్రతి నియోజక వర్గంలో ప్రభుత్వం ముందుగానే ఆమోదించిన ఒకే ఒక్క అభ్యర్థి బరిలో ఉంటారు. ఓటర్లు ఆ అభ్యర్థికి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటు వేయాల్సి ఉంటుంది. 1957 తర్వాత ఇలా వ్యతిరేక ఓట్ల గురించి ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ఎన్నికల ద్వారా మొత్తం 687 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు. 2011లో తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన కిమ్ జోంగ్ ఉన్, 2019లో రాజ్యాంగ సవరణల ద్వారా తన అధికారాన్ని మరింత పటిష్ఠం చేసుకుని దేశాధినేతగా పూర్తి నియంత్రణ సాధించారు.

# అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్

## దుష్టశక్తులకు పరాభవం కలిగి పాడిపంటలతో రాష్ట్రం పరిఢవిల్లాలి

## గాంధీభవన్ జరిగిన ఉగాది వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాబోయే బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా, రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అత్యంత వైభవంగా నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చిలుకూరు శ్రీనివాస్ మూర్తి పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ పరాభవ నామ సంవ త్సరంలో దుష్టశక్తులకు పరాభవం కలగాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా విలసిల్లాలని కోరుకున్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని పునరు ద్ఘాటించారు. రాష్ట్రం లోని అన్ని రంగాలు దిగ్విజయంగా వృద్ధి చెందాలని, ముఖ్యంగా తెలంగాణ యువతకు అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభించాలని ఆశించారు. ప్రతి కుటుంబం ఈ పండుగను ఆనందోత్సా హాల మధ్య జరుపుకో వాలని కోరు తూ, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను అభినందించారు.

పంచాంగ శ్రవణం వీక్షి ంచి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సరంలో ఎవరు ఎవర్ని పరాభవం చేయకుండా అంత కలిసి కట్టుగా సుఖ శాంతులతో ఉండాలని హితవు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందే విదంగా అర్హులైన వారి లబ్ది పొందే విదంగా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలనీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో మేలు జరగాలనీ ఆకాంక్షను వ్యక్తంచేశారు. ప్రజలు సుఖ శాంతులతో ఉండేలా భగవంతులు ఆశీస్సులు ఉండాలనీ వేడుకొన్నారు.

రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ప్రజల మద్దతు తో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనీ గుర్తుచేశారు. ఎఐసిసి నాయకులు ఖర్గే ,సోనియాగాంధీ రాహుల్ గాంధీ కృషితో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు అంత ఎంతో శ్రమించి ఒక అద్భుతమైన పాలన అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందనీ తెలిపారు. తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పరభావ ఉగాది నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి హాజయ్యారు.

# పరాభవం మన దేశానికి కాదు.. దేశద్రోహులకే

## కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** శ్రీ పరాభవ నామ సంవత్సరంలో పరాభవం అనే పదం మన దేశానికి కానీ, మన ప్రజలకు కానీ వర్తించదని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలకు, తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పరాభవం కేవలం మన దేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమేనని మనం గుర్తించాలన్నారు. భారతదేశం పుణ్యభూమి, పవిత్రమైన దేశం కాబట్టి ఈ నూతన సంవత్సరం మనందరికీ శుభ ఫలితాలనే అందించబోతుందన్నారు. "పండితులు వివరించిన పంచాంగం ప్రకారం.. ఈ ఏడాది దేశానికి ఎంతో మంచి భవిష్యత్తు ఉందని, వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. ప్రజలందరూ ఎటువంటి సమస్యలు లేకుండా సుఖశాంతులతో జీవించబోతున్నారు.

ఒకవేళ ఏవైనా సవాళ్లు ఎదురైనా, వాటిని సమర్థవంతంగా అధిగమించే శక్తి మనకు ఉంది. ప్రపంచంలోని అనేక దేశాలు నేడు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, శాంతిభద్రతల సమస్యలతో సతమతమవుతు న్నాయి. కానీ, భారతదేశం మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శక్తివంతమైన నాయకత్వంలో అభివృద్ధి పథంలో నిరంతరం దూసుకుపోతుందని, దేశ ప్రజలు ఐక్యంగా నిలబడి, ఏ సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇది మనందరికీ గర్వకారణం అన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక. సుఖదుఃఖాలు, కష్టనష్టాలు అన్నీ కలగలిసి ఉండటమే జీవితం అన్నారు. వాటన్నింటినీ ఐక్యతతో, సహనంతో ఎదుర్కోవడమే ఉగాది మనకు ఇచ్చే గొప్ప సందేశం. ఈ కొత్త సంవత్సరంలో భారతదేశానికి మరింత అభివృద్ధి, శాంతి, సుభిక్షం కలగాలని నేను ఆ భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని అన్నారు.

**మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర్ఠ ఉగాది పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.




రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మాట్లడుతూ తెలంగాణ ప్రజలందరికీ ఈ నూతన సంవత్సరం సుఖ శాంతులను, అభివృద్ధిని చేకూర్చాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షి స్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచం సాంకేతిక రంగంలో వేగంగా దూసుకుపోతుందని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో బి20 దేశాల్లో గ్యాస్ ధరలు 20 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. కానీ, భారతదేశంలో మాత్రం ప్రధాని నరేంద్ర మోడీ అత్యున్నత దౌత్య నీతి వల్ల ఇంధన ధరలు స్థిరంగా ఉన్నాయని అన్నారు. దేశంలో డొమెస్టిక్ గ్యాస్ కొరత ఎక్కడా లేదు. కమర్షియల్ గ్యాస్ విషయంలో ఉన్న స్వల్ప షార్టేజ్ కూడా దిగుమతి చేసుకున్న నౌకలు రాకతో త్వరలోనే పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. దేశంలో గ్యాస్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని, ఇప్పటికే 92,700 మెట్రిక్ టన్నుల ఎల్‌పిజితో కూడిన భారీ నౌకలు సురక్షి తంగా భారత్‌కు చేరుకున్నాయి.

వివిధ పోర్టుల ద్వారా ఈ గ్యాస్ ఇప్పటికే సరఫరా వ్యవస్థలోకి చేరింది. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను ముందే ఊహించిన మోడీ ప్రభుత్వం, అత్యవసర పరిస్థితుల కోసం వ్యూహాత్మక నిల్వ కేంద్రాల్లో దాదాపు 5.33 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును సిద్ధంగా ఉంచింది.

ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా దేశ అవసరాలకు ఎక్కడా డోకా లేదన్నారు. ప్రపంచవ్యాప్త యుద్ధ పరిస్థితులను దీటుగా ఎదుర్కొని, దేశాన్ని సశ్యశ్యామలంగా తీర్చిదిద్దుకునే దిశగా మోడీ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు.

# పాలనా వైఫల్యాలు కొనసాగితే పెరగనున్న అసంతృప్తి..

# విపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం

## తెలంగాణ భవన్‌లో ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 19:** తెలంగాణ భవన్‌లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.టి. రామారావు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం పంచాంగ శ్రవణం ప్రారంభమైంది. ప్రముఖ పండితులు మృత్యుంజయ శర్మ, ఫణీంద్ర శర్మ పంచాంగ శ్రవణం చేసి, ఈ ఏడాది పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పండితుల ప్రకారం, ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లు, పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రత్యామ్నాయ శక్తిగా ప్రతిపక్షం ఎదిగే పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టం చేశారు. విద్యా విధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని, యువత పక్కదారి పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.




ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అంతర్జాతీయంగా విదేశీ శక్తుల కుట్రలను మన దేశ సైనికులు సమర్థవంతంగా ఎదుర్కొంటారని, అయితే ఇరుగుపొరుగు దేశాలతో కొన్ని ఉద్రిక్తతలు లేదా ఘర్షణలు చోటు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఈ సంవత్సరం మంచి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, చెరువులు, జలాశయాలు నిండిపోతాయని తెలిపారు. ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలు బాగా పండే అవకాశం ఉందని, రైతుల ఆత్మహత్యలు తగ్గే సూచనలు ఉన్నాయని చెప్పారు. అయితే బంగారం, వెండి, ఆహార ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉందని, కూరగాయల ధరలు కొంతవరకు తగ్గవచ్చని తెలిపారు. అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు, దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశముందని కూడా హెచ్చరించారు. పశుసంపద అభివృద్ధి గణనీయంగా ఉంటుందని పేర్కొన్నారు.

భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మరింత గౌరవాన్ని పొందుతుందని, వాణిజ్య రంగంలో దేశం రాణిస్తుందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, మానవతా విలువలు పెరుగుతాయని, విడాకుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఉన్నత పదవుల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తుపానులు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉన్నప్పటికీ, పాలకులు వాటిని సమర్థంగా ఎదుర్కొనే అవకాశముందని చెప్పారు. పంజాబ్ రాష్ట్రంలో ప్రకృతి ప్రకోపాలు ఉండే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. రైలు, విమాన, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, సినీ మరియు రాజకీయ రంగాలకు చెందిన కొంతమంది ప్రముఖులు కనుమరుగయ్యే అవకాశముందని కూడా తెలిపారు. ప్రజలు మానసికంగా కొంత ఒత్తిడిని ఎదుర్కొనే పరిస్థితులు ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ప్రభావం భారతదేశంపై పెద్దగా ఉండదని పండితులు వెల్లడించారు.

## విద్యుత్ పంపిణీకై లైసెన్స్‌కు రైతు విద్యుత్ పంపిణీ సంస్థ దరఖాస్తు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** తెలంగాణలో త్వరలో కార్యకలాపాలను నిర్వహించేందుకు మూడో డిస్కం రైతు విద్యుత్ పంపిణీ సంస్థ యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ కార్యకలాపాలను చేపట్టేందుకు కావాల్సిన లైసెన్స్ నిమిత్తం తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఇఆర్‌సి)కి గురువారం రైతు డిస్కం దరఖాస్తు చేసింది. కాగా ఈ నెల 18న కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యేకంగా, నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిం చాలనే లక్ష్యంతో ఈ డిస్కంను ఏర్పాటు చేస్తున్నదని ఈ సందర్భంగా సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి. రైతులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతో ఉగాది పర్వదినాన లైసెన్స్‌కు దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నాయి. సంస్థ కార్యకలాపాల ప్రారం భానికి ముందస్తుగా దక్షి ణ, ఉత్తర డిస్కంల నుంచి 51 మంది ఇంజినీర్లు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై

# తెలంగాణ ప్రజాజాగృతి పేరుతో త్వరలో కొత్త పార్టీ: ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 19:** తెలంగాణ ప్రజా జాగృతి పేరుతో కల్వకుంట్ల కవిత త్వరలో పార్టీ ప్రారంభించనున్నారు. ఇప్పటికే పార్టీ పేరు నమోదు కోసం జనవరి 23న కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అయితే ఇసి దీనిపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యం చేస్తోందని ఆరోపిస్తూ కవిత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఈ విషయం వెలుగుచూసింది.



ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 29ఎ కింద రాజకీయ పార్టీ నమోదు కోసం చేసిన తన దరఖాస్తును కేంద్ర ఎన్నికల సంఘం వేగంగా పరిశీలించి నిర్ణయం వెలువరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే పార్టీ రిజిస్ట్రేషన్ చేయడానికి అప్లికేషన్‌లో చాలా లోపాలున్నాయంటూ కవితకు ఫిబ్రవరి 23నే సమాచారం పంపామని ఇసి తరఫు న్యాయవాది ఫిబ్రవరి 27న విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. ఆ సమయంలో కవిత తరఫు న్యాయవాది ఆసుపత్రిలో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరడంతో కేసు మార్చి 19కి వాయిదా పడింది. అదే పిటిషన్ గురువారం మరోసారి విచారణ చేపట్టింది. కవిత కొత్త పార్టీ అంశంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఇసికి ఢిల్లీ హైకోర్టు సూచించింది. కవిత దరఖాస్తులో లోపాలున్నాయని గతంలో ఇసి కోర్టుకు చెప్పగా, లోపాలన్నీ సరిచేసినట్లు కవిత తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. సాంకేతిక తప్పులు సరిచేసి ఇసికి మళ్లీ దరఖాస్తు చేశామన్నారు. దీంతో ఇసి కవిత కొత్త పార్టీ దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటా మనడంతో ఢిల్లీ హైకోర్టు విచారణ ముగించింది.



జ్యోతి ప్రజ్వలనతో ఉగాది ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

## ప్రపంచంలోనే అగ్రగామిగా తెలుగు, ఇది ఉగాది సంకల్పం: ఎపి సిఎం చంద్రబాబు

### తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఉగాది వేడుకలకు హాజరు

**విజయవాడ, మార్చి 19, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే తెలుగు జాతి అగ్రగామిగా ఉండేలా 2047కి ఈ ఉగాదికి సంకల్పం తీసుకుందామని సీఎం చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. సంకల్పాన్ని నెరవేర్చేందుకు అంకిత భావంతో పనిచేద్దామన్నారు. కచ్చితంగా అది జరిగితీరుతుందన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొన్నారు.

అవధాని మాడుగుల నాగఫణిశర్మ ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమన్న చంద్రబాబు విలువలకు కట్టుబడి పనిచేద్దామన్నారు. గోదావరి పుష్కరాల కన్నా పోలవరాన్ని పూర్తి చేస్తామని తర్వాత నదుల అనుసంధానాన్ని చేపడతామన్నారు. అమరావతిని అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఉగాది పురస్కారాలకు ఎంపికైన వారికి అవార్డులను అందజేశారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య భద్రత అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కొందరు స్వార్థంతో తల్లికి, చెల్లెలికి ఆస్తులు ఇవ్వని వ్యక్తులు కూడా ఉంటారని ఎద్దేవా చేశారు. అందుకే మళ్లీ ఉమ్మడి కుటుంబాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. సమాజంలో సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 చేపట్టామని తెలిపారు. తాను పనిచేసేది 5 కోట్ల మంది రాష్ట్రప్రజల కోసమని.. అందరి జీవన ప్రమాణాలు మెరుగుపర్చటం కోసమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**విదేశాల్లో మన సంస్కృతికి తెలుగువారే బ్రాండ్ అంబాసిడర్లు**

మన సంస్కృతీ సంప్రదాయాలు నేర్పే విలువలను గౌరవించాలని.. ఇక్కడ ఉండే మనకంటే విదేశాల్లోని ప్రవాస తెలుగు వారు వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టటమే తన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అసత్యాలతో ప్రజలను మోసగిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు : మాజీ సిఎం జగన్

### వైఎస్సార్‌సిపి కార్యాలయంలో ఘనంగా శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు.. రాష్ట్ర ప్రజలకు వైఎస్ జగన్ ఉగాది శుభాకాంక్షలు.. ఈ యేడాది విపక్షానికి మంచి భవిష్యత్తు ఉంది : పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి పంచాంగం శ్రవణం

**విజయవాడ, మార్చి 19, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఉగాది వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, వైయస్ భారతి దంపతులు హాజరయ్యారు. సాంప్రదాయ పంచెకట్టు, భుజాన కండువాలో ఉగాది వేడుకలకు వైయస్ జగన్ హాజరయ్యారు. ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమానికి వచ్చిన వైయస్ జగన్ దంపతులకు పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. ఉగాది వేడుకల కోసం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు. పూజా మందిరంలా వేదికను రూపొందించారు. శాస్త్రోక్తంగా పూజ తర్వాత .జగన్ దంపతులకు పండితులు వేదాశ్శీస్సులు అందించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి వినిపించారు. నూతన సంవత్సరంలో విపక్ష బల గణీయంగా మారుతుందని తెలిపారు. రాజకీయ పరిణామాల్లో నూతన మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. మాజీ సీఎం జగన్ రాజకీయంగా ఉజ్వల భవిష్యత్తు ఉందదని వెల్లడించారు. పంచాంగ శ్రవణం అనంతరం జగన్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంకా రెండు తెలుగు రాష్ట్రాలలో సంవత్సరాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటున్న అందరికీ వైయస్ జగన్, హృదయపూర్వకంగా పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం తప్పుద్రోవ పట్టిస్తుందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇప్పటి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తుందన్నారు. దేవుడిని కుడా రాజకీయాలకు



ఇప్పటి ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మత్తులో ఆ పార్టీ నేతలు జోగుతున్నారు. అసత్యాలతో సీఎం చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అంతకు ముందు ఉగాది వేడుకలకు పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

# ఖాళీ పోస్టులపై ఆర్థిక శాఖ నజర్

## వివరాలు సమర్పించాలని ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమర్పించాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని శాఖలకు తాజాగా ఒక నోట్‌ను పంపించింది. ఇందుకు ప్రత్యేక ఫార్మేట్‌ను రూపొందించి దాన్ని పంపించింది. ఉద్యోగ కేటగిరి, పేరు, జిల్లా, జోన్, మల్టీ జోన్ కేటగిరి తదితర వివరాలు ఈ ఫార్మాట్‌లో ఉన్నాయి.

కాగా ఇటీవల సర్కార్ పలు పోస్టుల భర్తీ కి నోటిఫికేషన్లు జారీ చేసింది. అర్హత పరీక్షలు నిర్వహించి నియామక సంస్థలు అర్హుల జాబితాలను ప్రభుత్వానికి సమర్పించడంతో వారికి నియామక పత్రాలను ప్రభుత్వం జారీ చేసింది. అయితే ఎంపికైన కొందరు అభ్యర్థులు ఆయా ఖాళీల్లో చేరకుండా ఉండి పోయినట్లు సమాచారం. నియామక పత్రాలు అందిన వాటిలో అన్ని కేటగిరీల్లో రిపోర్టింగ్ గడువు కూడా ముగిసింది. అటువంటి అభ్యర్థులు గడువులోగా రిపోర్టు చేయకుంటే వారి ఉద్యోగవకాశాన్ని రద్దు చేయాలని ఇప్పటికే స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో ప్రత్యేక ఫార్మాట్ రూపొంది ఉద్యోగాల్లో చేరిన, చేరని వారి వివరాలతో పాటు, ప్రభుత్వ శాఖల్లో మొత్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశించింది.

# వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్ పెంపు

### రాష్ట్ర సర్కార్‌కు భారీ ఊరట

### రూ.2,407 కోట్లకు పెంచిన రిజర్వ్ బ్యాంక్

### ఎక్కువ అడ్వాన్స్‌లపైనే ఖజానా ఆధారం

### ఆదాయ, వ్యయాల మధ్య తగ్గనున్న అంతరం

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్‌ను పెంచుతూ రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అదనంగా రూ. 2,407 కోట్లకు పెంచుతూ రాష్ట్ర సర్కార్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు స్వల్పకాలిక నగదు నిర్వహణలో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద ఉపశమనం కల్పిస్తూ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ (డబ్ల్యూఎంఎ), తాత్కాలిక రుణం పరిమితిని రూ. 2,407 కోట్లకు పెంచింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మొత్తం డబ్ల్యూఎంఎ పరిమితిని ఇప్పటికే ఉన్న రూ. 60,118 కోట్ల నుండి రూ. 61,008 కోట్లకు సవరించాలన్న ఆర్‌బిఐ నిర్ణయానికి అనుగుణంగా తెలంగాణ సర్కార్‌కు కూడా ఈ పెంపు జరిగింది. ఫలితంగా, తెలంగాణ యొక్క వ్యక్తిగత పరిమితిని ఇప్పటి వరకూ రూ. 2,300 కోట్లు ఉండగా, దాన్ని తాజాగా రూ. 2,407 కోట్లకు పెంచింది. దీనివల్ల ఆదాయాలు మరియు చెల్లింపుల మధ్య తాత్కాలిక వ్యత్యాసం ఉన్న సమయాల్లో తెలంగాణ ఖజానా నుండి తక్షణ ఖర్చుల అవసరాలను తీర్చగల సామర్థ్యం బలపడుతుంది. ఈ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ అనేది రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాం తాలు స్వల్పకాలిక నగదు కొరతను అధిగ మించడానికి ఆర్‌బిఐ తాత్కాలిక రుణాలుగా అందించే ఆర్థిక సాయం. ఈ అడ్వాన్స్‌లు నగదు రాబడి, ఖర్చుల మధ్య సమయ వ్యత్యాసాలను పూడ్చడానికి ఉద్దేశించబడ్డాయి. కానీ ఇవి దీర్ఘకాలిక ఆర్థిక సహాయ యంత్రాంగంగా ఉపయోగ పడటానికి ఉద్దేశించినవి కావు. డబ్ల్యూఎంఎ కింద తీసుకున్న మొత్తాన్ని 90 రోజులలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. వసూలు చేసే వడ్డీ ప్రస్తుత రెపో రేటుకు అనుగుణంగా ఉంటుంది. ఈ సౌకర్యం ప్రభుత్వాలు నగదు కొరత కారణంగా నిత్య వ్యయాలలో అంత రాయాలను నివారించి, అవసరమైన సేవల సజావుగా నిర్వహణను కొనసాగించడానికి వీలు కల్పించనుంది. కాగా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌లపై ఆధారపడటాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవల ఆందో ళన వ్యక్తం చేసింది. ఆదాయం, వ్యయం మధ్య స్వల్ప కాలిక అంతరాలను పూడ్చడానికి రాష్ట్రం రిజర్వ్ బ్యాంక్ నుండి తీసుకునే అడ్వాన్స్‌లపై ఎక్కు వగా ఆధారపడు తోందని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ రుణాలకు సంబంధించినలో పరిమితి గణనీయ మైన వృద్ధిని సాధించింది. 2014లో ఈ పరిమితి రూ. 550 కోట్లుగా ఉండగా, రాష్ట్ర ఆదాయ ప్రొఫైల్, మూలధన వ్యయం ఆధారంగా 2016లో దీనిని రూ. 1,080 కోట్లకు రిజర్వ్ బ్యాంక్ పెంచింది.

# ఆ వార్నింగ్ కాంగ్రెస్ సీనియర్లకే.. సీఎం భాష బాధాకరం

### అధికారంలోకి వస్తే వందేమాతరం
### గుర్తుండేలా చేస్తాం : కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. గురువారం కరీంనగర్‌లో మీడియా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు అసమ్మతి రాగాలు వినిపిస్తుండటంతో, వారిని 'హెచ్చరించేందుకే' తొక్కు కుంటా వచ్చా.. ఇంకా తొక్కుతాలి అనే భాష రేవంత్ రెడ్డి వాడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఆశీర్వదిస్తే పదవి వచ్చిందని చెప్పాల్సింది పోయి, ఇలాంటి అహంకార పూరిత భాష వాడటం ప్రజలు అసహ్యించు కుంటున్నారనీ తెలిపారు.

వందేమాతరం వివాదంపై మౌనం ఎందుకు..? శాసనసభలో వందేమాతరం గేయ ఆలాపనను ఎంఐఎం ఎమ్మెల్యేలు బహిష్కరించడాన్ని బండి సంజయ్ ఖండించారు. జాతీయ గేయాన్ని అవమానించినా స్పీకర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎంఐఎం నేతల మెడలు వంచి వందేమాతరం పాడించే వాళ్లమని సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయతను గౌరవించని వారిని కటకటాల్లోకి నెట్టేవాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు దాదాపు రూ.41,000 వేల కోట్ల బాకీ పడిందని వివరించారు...ఒక్కో రైతుకు ఎకరాకు రూ.30,000, వ్యవసాయ కూలీలకు రూ.36,000 చొప్పున ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. తక్షణమే ఈ బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, లేదంటే కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

**మూసీ ప్రక్షాళనపై వైఖరి**

మూసీ నది పునరుజ్జీవానికి బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ పేదల ఇళ్లను కూల్చడాన్ని సహించబోమని బండి సంజయ్ పునరుద్ఘాటించారు. గుజరాత్‌లోని సబర్మతీ తరహాలో బాధితులకు ఇళ్లు కట్టించి, అన్ని హామీలు నెరవేర్చిన తర్వాతే ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. తనకు కేటాయించిన శాఖపై మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ.. కేంద్రంలో హోంశాఖ అత్యంత కీలకమైనదని, ప్రధాని మోదీ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు ఇచ్చారని చెప్పారు. బీసీ,ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత బీజేపీదేనని ఆయన పేర్కొన్నారు.



గురువారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

## గేట్-2026 ఫలితాలు విడుదల

### ఫలితాలు విడుదల చేసిన ఐఐటీ గువాహటి

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఐఐటీలు, ఐఐఎస్‌టీల్లో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఇందుకు సంబంధించిన ఫలితాలను ఐఐటీ గువాహటి గురువారం ప్రకటించింది. గేట్-2026 పరీక్షలు ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో నిర్వహించారు. ఇప్పటికే ప్రకటించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించిన ఐఐటీ గువాహటి.. అభ్యంతరాలను పరిశీలించి గురువారం ఫైనల్ కీతోపాటు తుది ఫలితాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఫలితాలను గేట్2026ఐఐటీజి.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని ప్రకటించింది.

## 23 వరకు ఐసెట్ దరఖాస్తు గడువు పెంపు

### మే 13, 14న పరీక్ష

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువును పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 16 వరకు దరఖాస్తులకు తుది గడువుగా.. దానిని కాస్త ఈ నెల 23 వరకు పొడిగిస్తున్నట్లు ఐ సెట్-2026 అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ వెలువడగా.. ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. ఐ సెట్-2026 పరీక్షను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించనుంది.

నోటిఫికేషన్ వెలువడిన తరువాత ఫిబ్రవరి 12 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. నోటిఫికేషన్‌లో మార్చి 16 వరకు దరఖాస్తుల స్వీకరకు తుది గడువుగా ప్రకటించారు. అయితే అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును కాస్త ఈ నెల 23 వరకు పొడిగిస్తున్నట్లు ఐ సెట్ అధికారులు ప్రకటించారు. ఐ సెట్-2026 ఫీజుకు సంబంధించి.. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ (దివ్యాంగ) అభ్యర్థులకు రూ. 550 ఫీజు కాగా ఇతరులకు రూ. 750గా నిర్ణయించారు. మే 13, 14న పరీక్షలను నిర్వహించనున్నారు.

## ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలు!

### 18తో ముగిసిన ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి ఈ నెల 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 6న విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 18తో ముగిసిన నేపథ్యంలో ఫలితాలను త్వరగా విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు ప్లాన్ చేసింది. ఏప్రిల్ 6న ఇంటర్ ఫలితాలను విడుదల చేసి మే మొదటి వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించి నెలాఖరు నాటికి వాటి ఫలితాలను కూడా ఇవ్వాలనే యోచనలో ఇంటర్ బోర్డు పక్కా ప్లానింగ్‌తో ఉంది. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించారు. వారిలో పరీక్షలకు సుమారు 95 శాతం మంది హాజరయ్యారు. ఈ నెల 15న మొదటి విడత స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభించగా.. మొత్తం ఇంటర్ పరీక్షలు ముగిసిన 18న రెండో విడత మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ఈ నెల 20న మూడో విడత మూల్యాంకనం ప్రారంభం కానుంది.



## 'వారసత్వ సంరక్షణలో ఇఆర్ వేదకుమార్‌ది చారిత్రాత్మక మైలురాయి'

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 19, ప్రభాతవార్త:** అర్బన్ అండ్ రీజినల్ ప్లానర్, అంకితభావంతో పనిచేస్తున్న వారసత్వ సంరక్షకుడు ఇఆర్ మణికొండ వేదకుమార్‌కు నాలుగోసారి వరుసగా ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ (కళ) అండ్ కల్చరల్ హెరిటేజ్ (సంస్కృతిక వారసత్వం) (ఇన్‌టెక్) కౌన్సిల్ సభ్యునిగా మూడు సంవత్సరాల కాలానికి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ఇన్‌టెక్ చరిత్రలోనే అత్యధిక ఓట్లు సాధించడం ఆయన నిబద్ధత, విశ్వసనీయత, వారసత్వ సంక్షరణ చేసిన విశిష్ట సేవలను ప్రతిబింబిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా అనుభవంతో ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లోని స్మారకచిహ్నాలు, చారిత్రక భవనాలు, సాంస్కృతిక, సహజ వారసత్వ ప్రదేశాల గుర్తింపు, సంరక్షణ, పరిరక్షణ కోసం నిరంతరం ఆయన కృషి చేస్తున్నారు. ఆయన ఆనేక దేశాలను సందర్శించి చారిత్రిక నగరాలు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలు గురించి ఆయన అధ్యయనం చేశారు. అంతేకాక పలు అంతర్జాతీయ వారసత్వ సదస్సులు, వేదికల్లో పాల్గొని భారతదేశం వైవిధ్య భరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు.

## అనుమానాస్పదస్థితిలో బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), మార్చి 19, ప్రభాతవార్త :** నారపల్లిలోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉండి బీటెక్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవుని తండా, సంగూల, చందుర్తి మండలం, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన బానోతు తేజ కుమార్తె బానోతు నందిని (19) మేడిపల్లి ప్రాంతంలో ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల 3వ సంవత్సరం చదువుతూ స్థానికంగా ఉన్న టి.ఎస్.ఆర్ ఎగ్జిక్యూటివ్ పి.జి హాస్టల్‌లో నివాసం ఉంటోంది. అయితే ఈనెల 18వ తేదీన రాత్రి నందిని హాస్టల్ గదిలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో విషయం గమనించిన హాస్టల్ నిర్వహకులు బంధు వులకు తెలిపారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిం చారు. తమ కుమార్తెపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బానోతు తేజకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు హాస్టల్‌కు చేరుకుని విద్యార్థి నందిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బానోతు నందిని

## పెంపుడు పిల్లి మృతిని తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మార్చి 19, ప్రభాతవార్త:** ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న పెంపుడు పిల్లి మృతిని తట్టుకోలేని ఓ డిగ్రీ విద్యార్థిని పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. డిగ్రీ చదువుతున్న బడంగ్‌పేట్ వెంకటాద్రి నివాస్‌కు చెందిన హిమబిందు (20) అనే యువతి ఓ పెంపుడు పిల్లిని పెంచుకుంటున్నది. అయితే అనుకోకుండా పిల్లి మృతి చెందింది. దీంతో తీవ్ర వేదనకు గురైన హిమబిందు జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు సంక్షేమం లేకుండా రాష్ట్రాభివృద్ధి అసాధ్యం

### 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉత్సవాలు
### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రైతు సంక్షేమం లేకుండా రాష్ట్రాభివృద్ధి అసాధ్యమని ప్రభుత్వం భావిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగానిది కీలక పాత్ర అని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, పంటల బీమా వంటి పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పిస్తోందని చెప్పారు. ఈ నెల 19 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉత్సవాలను నిర్వహి స్తున్న ట్లు చెప్పారు. ఈ ఉత్సవాలు వ్యవసాయరంగంలో ప్రభుత్వ ప్రాధా న్యాన్ని ప్రతిబింబించేవిదంగా ఉంటాయని పేర్కొన్నారు. రైతు ఉత్సవాల ద్వారా ప్రభుత్వం రైతులతో మరింతగా మమేకవడంతో పాటు వారి అభిప్రాయాలను పాలనలో ప్రతిబింబింపజేసే దిశగా అడుగులు వేస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పంటల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 22న ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు కేంద్రబిందువుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రైతు ఉత్సవాల ద్వారా రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారాలపై చర్యలు తీసుకునేలా ప్రత్యేక సమావేశాలు, చర్చలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, శిక్షణా శిబిరాలు, సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శనలు, విజయవంతమైన రైతుల అనుభవాలు పంచుకునే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్, పంటల వైవిధ్యీకరణ, మార్కెట్ అవకాశాలపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేయనున్నారని వివరించారు. రైతుల ఆదాయం పెంపు, సాగు వ్యయాల తగ్గింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం ఇప్పటికే అనేక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.

# ప్రైవేటు వ్యాపారుల చేతిలో మక్కరైతుల నిలువు దోపిడీ

### కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారుల తీవ్రజాప్యం
### క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,900లే చెల్లిస్తున్న వ్యాపారులు
### ఫలితంగా క్వింటాపై రూ.600 దాకా నష్టపోతున్న అన్నదాతలు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** అష్టకష్టాల కోర్చి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే మద్దతు ధర రాకపోవడంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు పంటను తీసుకొచ్చి రోజుల తరబడి మద్దతు ధర కోసం నిరీక్షిస్తున్నారు. ఈ ఏడాది మార్క్‌ఫెడ్ మక్క కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతోపాటు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇదే అదనుగా ప్రయివేటు వ్యాపారులు, దళారులు క్వింటాల్ మొక్కజొన్నకు రూ.1700 నుంచి రూ.1900 లోపు ధర పెడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రాథమిక సహకార కేంద్రాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను మక్కలను కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో రైతులు క్వింటాకు రూ.600 కు తక్కువగా ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుని ఆర్థికంగా చితికిపోతున్నారు. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేశారు. అయితే ఈసారి కూడా మంచి ధర వస్తుందని ఆశించినా రైతులకు నిరాశే ఎదురవుతోంది. రాష్ట్రంతో ఈ యాసంగి సీజన్‌లో మక్కల సాగు పలు జిల్లాల్లో పెరిగింది. అధికారిక గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. రాష్ట్రంలో రబిలోదాదాపు 16 లక్షల టన్నుల మక్కల దిగుబడి వస్తోంది. ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల మక్కల దిగుబడి వస్తోంది. మొక్కజొన్న పంట కేవలం ఆహార పంటగానే కాకుండా బహుళ ప్రయోజనాలున్న పంటగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. మక్కలను దాణా రూపంలో పౌల్ట్రిరంగంలో, పశువులకు మేతగా, వివిధ ఆహార పరిశ్రమల్లో ముడిసరుకుగా (స్టార్చ్ తయారికి) వినియోగించడంతోపాటు పేలాలు, తీపి కండె, బెబికార్న్ వంటి ఆహార పదార్థాల తయారీకి ఉపయోగిస్తారు. మార్కెట్‌లో మక్క పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ ఆ పంటను పండించిన రైతులకు మాత్రం కనీస మద్ధతు ధర రాకపోవడంపై వ్యవసాయ నిపుణులు, రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే మక్క కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

# యాసంగి కొనుగోళ్లకు నిధుల సమీకరణ

### రూ.22,700 కోట్లకు ప్రభుత్వం గ్యారెంటీ
### ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఈ యాసంగిలో రాష్ట్రంలో 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు నిధుల సమీకరణపై దృష్టి సారించింది. ఇందుకు రూ.22,700 కోట్ల రుణాన్ని సమీకరించనుంది. పౌరసరఫరాలశాఖ సమీకరించుకోనున్న ఈ మొత్తం నిధులకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటి ఇవ్వనుంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో పండిన వరి ధాన్యాన్ని సేకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 152 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేసిన ప్రభుత్వం అందులో 90 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించింది.

ఇందులో 30లక్షల టన్నుల మేర సన్న ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. యాసంగి ధాన్యం కొనుగోళ్ల కోసం 8,251 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ నిర్ణయించింది. అదేసమయంలో యాసంగి సీజన్‌లో ధాన్యానికి మద్దతు ధర చెల్లించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) ద్వారా రూ.22,700 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వనుంది. వీటి కోసం వ్యవసాయ సహకార శాఖ జీవోఎంఎస్ నం.21 జారీ చేసింది.

మార్క్‌ఫెడ్‌కు అదనపు కొనుగోలు సంస్థగా బాధ్యతలు అప్పగించి, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి రూ.22,700 కోట్ల క్రెడిట్ సౌకర్యం పొందేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వ హామీతో తీసుకుని, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఖాతాకు బదిలీ చేసి రైతులకు చెల్లించనున్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక తూకపు యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు (తేమ కొలిచేవి), ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, సరిపడా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇప్పటికే పౌరసరఫరాలశాఖను ఆదేశించారు.

సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించడానికి అవసరమైన వాహనాలను ముందే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

### ప్రభుత్వానికి తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మక్క రైతులను ఆదుకునేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్వింటాలుకు రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలను అధికారులు సకాలంలో ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను మద్దతు ధర కంటే తక్కువ ధరకే రూ.1600 నుండి రూ.1900 రూపాయల వరకే దళారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులను, ఆర్థిక నష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు.

# బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత!

### భూసేకరణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
### పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల
### మూడో విడత, సీతారామ ప్రాజెక్టులకు నిధులు

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** ఈ యేడాది (2026-27) బడ్జెట్‌లో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలు, సీతారామ ప్రాజెక్టు, మూడో విడత దేవాదుల ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం తదితర కీలక పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.

మొత్తంగా ఈ బడ్జెట్‌లో సాగునీటిరంగానికి ఈ సారి ప్రాధాన్యత ఇచ్చేప అవకాశాలు కనిపిస్తున్నాయి. భూసేకరణలో అడ్డంకుల కారణంగా ప్రాజెక్టులు పెండింగ్‌లో పడినందున ఈ బడ్జెట్‌లో భూసేకరణకు ప్రత్యేకంగా రూ.5వేల కోట్ల మేర నిధుల కేటా యింపు ఉండనుందని ఇప్పటికే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రాజెక్టుల నిర్వహణ, కాల్వల మరమ్మతులకు సైతం బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

ఈ నేపథ్యంలో తెలంగాణలో గోదావరి జలాలను ఎత్తైన ప్రాంతాలకు అందించాలనే మహత్తర లక్ష్యంతో ప్రారంభమైన దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మరోసారి బడ్జెట్ సీజన్లో చర్చకు కేంద్ర బిందువుగా మారింది. లభ్యమయ్యే వరద జలాలను వినియోగించి గోదావరి నదిలో లభ్యమయ్యే వరద జలాలను వినియోగించి వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి వంటి ఎత్తైన జిల్లాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. నీటిని పలు దశల్లో ఎత్తిపోతల ద్వారా పైభాగాలకు తరలించే విధంగా రూపకల్పన చేసిన ఈ పథకం సాంకేతికంగా క్లిష్టమైనది.

భారీ పంప్ హౌసులు, సుదీర్ఘ పైప్లైన్లు, కాల్వల నిర్మాణం, పంపిణీ వ్యవస్థలతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాల్లో ఇది ఒకటి. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ప్రధాన లక్ష్యం. ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలంటే తక్షణమే రూ.4,312 కోట్ల విడుదల అవసరమని ఇంజినీరింగ్ వర్గాలు సూచిస్తున్నాయి.

## విద్యాశాఖకు రూ. 27వేల కోట్లు?

### పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
### స్కూల్స్, గురుకులం, జూనియర్ కాలేజీ విద్యార్థులకు వెల్‌కమ్ కిట్స్

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** నేడు ప్రవేశ పెట్టనున్న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 27వేల కోట్లు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం కంటే 2026-27 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ పెరగనుంది. గత ఏడాది విద్యా రంగానికి రూ. 23,108 కోట్లను కేటాయించారు. మొత్తం వార్షిక బడ్జెట్ రూ. 3,04,965 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి 7.9 శాతం నిధులను కేటాయించారు. అయితే ఈ ఏడాది మరికొంత నిధులు పెంచనున్నట్టు తెలిసింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దాంతోపాటు రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయాలని నిర్ణయించారు. వీటితోపాటు రానున్న విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులందరికీ వెల్‌కమ్ కిట్ పేరుతో 15 నుంచి 20 రకాల వస్తువులను ఇవ్వాలని నిర్ణయించారు. వీటితోపాటు ఈ ఏడాది రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం అదనంగా నిధులను కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గత ఏడాది కేటాయించిన నిధుల కంటే అదనంగా సుమారు 4వేల కోట్లను కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నేడు ప్రవేశ పెట్టనున్న 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో గత ఏడాది కంటే విద్యా రంగానికి సుమారు రూ. 4వేల కోట్లను అదనంగా చేర్చి రూ. 27వేల కోట్లను కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.


## మళ్లీ థియేటర్లలో పార్కింగ్ ఫీజు

### సింగిల్ జడ్జి ఉత్తర్వులకు సవరణ

**హైదరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణలోని మున్సిపల్ ప్రాంతాల్లో ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానులకు ఊరట లభించింది. థియేటర్లలో పార్కింగ్ ఫీజు రద్దు విషయంలో గతంలో ఉన్న ఉత్తర్వుల సవరిస్తూ హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ పార్కింగ్ ఫీజు వసూలు నిలిపివేత ఆదేశాలు కేవలం ఒక్క థియేటర్‌కే పరిమితమని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వందలాది సింగిల్ స్క్రీన్ థియేటర్లలో యథావిధిగా పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే అవకాశం ఏర్పడింది. సాధారణంగా మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ మాళ్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదనే నిబంధన ఉంది. అయితే, సింగిల్ స్క్రీన్ థియేటర్ల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, వీటికి మినహాయింపునిస్తూ జీవో 121ని జారీ చేసింది. ఈ జీవో ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు ప్రేక్షకులకు పార్కింగ్ ఫీజు విధించే వెసులుబాటు పొందుతున్నాయి.

అయితే ఈ జీవోను సవాలు చేస్తూ ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ప్రభుత్వం జారీ చేసిన జీవో 121 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏ మున్సిపల్ ప్రాంతంలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లలోనూ పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని ఆదేశించారు. ఈ ఆదేశాలు థియేటర్ యజమానులకు పెద్ద దెబ్బగా మారాయి.

దీంతో కొన్ని థియేటర్ యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కేవలం కోణార్క్ థియేటర్‌కే పరిమితం చేస్తూ తీర్పునిచ్చింది. దీంతో కోణార్క్ థియేటర్ మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు నిబంధనల ప్రకారం పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే వెసులుబాటు కలిగింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న హ్యాష్ ఆయిల్ బాటిళ్లు

## మాదాపూర్‌లో 920 గ్రాముల హ్యాష్ ఆయిల్ స్వాధీనం.. ఒకరి అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 19, ప్రభాతవార్త:** హైటెక్‌సిటీ పరిధిలో డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక ద ృష్టి కేంద్రీకరించిన పోలీసులు గురువారం నిషేధిత హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత హ్యాష్ ఆయిల్‌ను అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో శేరిలింగంపల్లి ఎస్ఓటీ పోలీసులు ఓ నిందితుని ్న వలపన్ని పట్టుకొని 920 గ్రాముల హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మాదాపూర్ అయ్యప ్ప సొసైటీలోని 100 ఫీట్ రోడ్డులో దినేష్ అనే వ్యక్తి అక్రమంగా హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి ఎస్ఓటీ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. సంఘటనా స్థలిలో నిందితుడిని పట్టుకొని తనిఖీ చేయగా, 180 బాటిళ్లలో నింపిన 920 గ్రాముల హ్యాష్ ఆయిల్ లభించింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. మాదాపూర్ పోలీసులు నిందితుడు దినేష్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా పట్టుకున్న హ్యాష్ ఆయిల్ విలువ 2.50 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.

# ఫీజుల భారాన్ని ఈ ఏడాది కూడా మోయాల్సిందేనా?

- ప్రైవేటు స్కూళ్ల ఫీజు నియంత్రణ చట్టంపై పూర్తికాని మార్గదర్శకాలు
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లుపెట్టే అవకాశం నిల్
- ప్రతి రెండేళ్లకు 8 శాతం పెంచుకోవచ్చనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిన విద్యాశాఖ
- పూర్తిస్థాయి మార్గదర్శకాల రూపకల్పనలో రాష్ట్ర సర్కార్
- విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చట్టం వచ్చే అవకాశం లేనట్టే!



**హైదరాబాద్, మార్చి 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వచ్చేలా కనిపించడం లేదు. బిల్లుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇప్పటి వరకు సిద్ధం కానట్టు తెలుస్తోంది. చట్టం చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు సిద్ధంగా ఉండి ఉంటే ఈ నెల 16 నుంచి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశ పెడతామనే విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు చెప్పి ఉండేవి. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఫీజునియంత్రణ చట్టం బిల్లుపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అంటే 2026-27 విద్యా సంవత్సరంలో కూడా ఫీజు నియంత్రణ చట్టం వచ్చే అవకాశం లేనట్టు తెలుస్తోంది. ఫీజుల నియంత్రణ చట్టం రాకపోతే ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు తిరిగి లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా.. ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్నదాంట్లో సగం వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. తిరుపతి రావు కమిటీ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. వాటిల్లో 10 శాతం లోపు ఫీజులను యాజమాన్యాలు పెంచుకోవడానికి ప్రతిపాదించగా.. 15 శాతం కంటే ఎక్కువ అయితే ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని ప్రతిపాదిస్తూ కమిటీ తన నివేదికను 2020లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలపై అప్పటి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులు భారీగా ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఫీజుల నియంత్రణ అంశంపై 2024 జూలైలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం తెలంగాణ విద్యా కమిషన్ తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు -2025ను ప్రభుత్వానికి సమర్పించింది. ఫీజు నియంత్రణ కోసం విద్యా శాఖ కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. రెండేళ్లకోసారి 8 శాతం ఫీజులను పెంచుకోవడానికి స్కూల్ యాజమాన్యాలకు అనుమతి ఉండాలని.. అంతకంటే ఎక్కువగా 9 శాతం అంతకంటే ఎక్కువగా ఫీజులను పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం ఉండాలని ప్రతిపాదించింది. ఫీజుల నిర్ధారణలోనూ పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపాదనల్లో విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేయాలని, శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియకి విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యా శాఖ అధికారులు నిర్ణయించారు. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూల్‌లో ఎంత ఫీజు ఉంది? ఏ ఏ క్లాసులకు ఎంతెంత ఫీజు తీసుకుంటున్నారు? అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేసిక్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు. విద్యాశాఖపై ముఖ్యమంరతి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. ఫీజుల నియంత్రణ చట్టం చేయాలంటే నేటి నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టకపోతే 2026-27 విద్యా సంవత్సరంలో చట్టం రూపొందే అవకాశాలు తక్కువగా ఉంటాయనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్రంలో త్వరగా చట్టం తీసుకొచ్చి ఫీజుల భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాలు కోరుతున్నాయి.



మాతా ఆలయం చెట్టువద్ద

## కొండచిలువల గుంపు

భయంతో పరుగులుతీసిన స్థానికులు

**సిమ్లా, మార్చి 19:** హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ఓ ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. ఓ ఆలయం సమీపంలో ఏకంగా ఐదారు భారీ కొండచిలువల గుంపు కనిపించడం కలకలం రేపింది. గప్లియాన్ ప్రాంతంలోని ప్రసిద్ధ కాళోంరారే వాలీ మాత ఆలయం వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. మొదట నేల మీద చెట్టు వేర్లు ఉన్నాయని స్థానికులు భావించారు. దాని ఆకారం వింతగా ఉన్నప్పటికీ ఎవరూ అనుమానించలేదు. కొందరు వ్యక్తులు సరదాగా ఆ గుంపుపై రాయి విసరడంతో అసలు విషయం బయటపడింది. ఆ గుంపు ఒక్కసారిగా కదలడంతో అక్కడున్న వారంతా షాక్‌కు గురయ్యారు. అది చెట్ల వేర్ల గుంపు కాదని, ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్న భారీ కొండచిలువల గుట్ట అని గ్రహించి భయంతో పరుగులు తీశారు. సుమారు 5 నుంచి 6 భారీ కొండచిలులువలు ఆ గుంపులో ఉన్నాయి. జనం గమనించిన కొద్దిసేపటికే అవి వేగంగా చెల్లాచెదురై సమీపంలోని పొదల్లోకి జారుకున్నాయి. ఈ భయానక దృశ్యాన్ని అక్కడున్న వారు తమ మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో క్షణాల్లో వైరల్‌గా మారింది. ఇంత పెద్ద సంఖ్యలో కొండచిలువలు ఒకేచోట గుంపుగా కనిపించడం చాలా అరుదని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు. ఈ ఘటనతో ఆలయానికి సమీపంలో, అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివసించే ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సాధారణంగా కొండచిలులువలు మనుషుల జోలికి రావని, తమంతట తాముగా దాడి చేయవని వన్యప్రాణి నిపుణులు చెప్పారు. వాటిని రెచ్చగొట్టినా, ఇబ్బంది పెట్టినా లేదా వాటికి అపాయం ఉందని భావించినా అవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## అన్నప్రసాదాలకు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 19ప్రభాతవార్తప్రతినిధి:** నిరంతరాయంగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాత తనవంతుగా 10లక్షలు, అలాగే ప్రాణ దానట్రస్ట్‌కు మరో 10లక్షలు రూపాయలు చెక్కులను గురువారం ఉదయం హైదరాబాద్ కు చెందిన సృజన్ జ్యూవెలరీ అధినేత రవికుమార్ టిటిడి చైర్మన్ బీ.ఆర్.నాయుడును కలసి అందజేశారు.



## శివయ్య సేవలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,మార్చి 19 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కుటుంబసమేతంగా జరుపుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కుటుంబసభ్యులతో రాగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. బిజెపి వర్గాలతో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఇఓ బికె వెంకటేశు,ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వెంటనే కోలా ఆనంద్‌కుమార్ ఆలయాధికారులతో చర్చించి ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## పాక్, సౌదీ ఒప్పందంపై కారుమేఘాలు

### పశ్చిమాసియా యుద్ధ ప్రభావాలేనని నిపుణుల అంచనా

**ఇస్లామాబాద్; మార్చి 19:** పశ్చిమాసియాలో రాజుకుంటున్న సంక్షోభం, సౌదీ అరేబియా పాకిస్తాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక సైనిక రక్షణ ఒప్పందం (ఎస్ఎండీఏ) బలాన్ని, విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకప్పుడు అత్యంత దృఢమైనదిగా ప్రచారం పొందిన ఈ బంధంలో తాజా పరిణామాలు తీవ్రమైన బీటలను బహిర్గతం చేశాయి. ఇరాన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్ చుట్టూ అల్లుకున్న ఈ వ్యవహారం, ఇస్లామాబాద్ విశ్వసనీయతపై అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. దక్షిణాఫ్రికాకు చెందిన ద స్టార్ మీడియా సంస్థ తన కథనంలో ఈ ఒప్పందం కుదిరినప్పుడు ఇరు దేశాలు గొప్పగా ప్రచారం చేసుకున్నాయి. బయటి శక్తుల నుంచి ముప్పు వాటిల్లితే ఒకరికొకరు అండగా నిలవాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఒకరిపై దాడి జరిగితే, అది ఇద్దరిపై జరిగినట్టుగా భావించి సంయుక్తంగా ప్రతిస్పందించే నాటో తరహా కూటమిగా విశ్లేషకులు దీనిని అభివర్ణించారు. సంపన్న గల్ఫ్ దేశానికి, దక్షిణాసియా భాగస్వామి అయిన పాకిస్థాన్ భద్రతాపరంగా అండగా నిలుస్తుందనే భరోసా ఈ ఒప్పందం కల్పించింది. అయితే, 2026 ఫిబ్రవరి 28న పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇరాన్‌లోని సైనిక, రాజకీయ మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ సమన్వయంతో దాడులు చేశాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. సౌదీ అరేబియాతో సహా పలు గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఒప్పందం ప్రకారం, ఈ క్లిష్ట సమయంలో పాకిస్థాన్ సైనికపరంగా సౌదీకి మద్దతుగా నిలవాలి. కానీ, పాకిస్థాన్ నుంచి ఎలాంటి సైనిక సహాయం అందలేదు. దీంతో నమ్మకమైన భాగస్వామిగా పాక్ పాత్రపై సందేహాలు మొదలయ్యాయి. సౌదీ అరేబియాకు మద్దతు ప్రకటించాల్సింది పోయి, పాకిస్థాన్ తన సొంత సమస్య అయిన ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఘర్షణపైనే పూర్తి దృష్టి సారించింది. ఈ ఉద్రిక్తతలను సాకుగా చూపి, సౌదీతో ఉన్న ఒప్పంద బాధ్యతల నుంచి తెలివిగా తప్పుకుంది. పాకిస్థాన్ తీసుకున్న ఈ వ్యూహాత్మక నిగ్రహం వెనుక దేశీయ రాజకీయ ఒత్తిళ్లు, అంతర్జాతీయ సైనిక భాగస్వామ్యాలపై దాని పునరాలోచన ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సంవత్సరాలుగా సౌదీ భద్రతకు తాము ఒక వ్యూహాత్మక అండగా ఉంటామని చెబుతూ వచ్చిన పాకిస్థాన్, తీరా అవసరం వచ్చినప్పుడు మాట తప్పడం గమనార్హం. ఇది సౌదీ అరేబియాకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. ఈ ఒప్పందంపై సౌదీ దౌత్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో పెట్టుబడి పెట్టింది. ప్రాంతీయ ముప్పులను ఎదుర్కోవడంలో పాక్ విశ్వసనీయతకు ఇదే నిదర్శనమని సౌదీ అధికారులు పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ప్రస్తుత సంక్షోభం, పాక్ మద్దతు కేవలం మాటలకే పరిమితమని, చేతల్లో శూన్యమని తేల్చి చెప్పింది. పాకిస్థాన్ వైఖరి వల్ల సౌదీ తన రక్షణ భాగస్వామ్యాలపై పునరాలోచనలో పడింది. పాక్ నుంచి ఏర్పడిన లోటును భర్తీ చేసుకునేందుకు పశ్చిమ దేశాలతో సహా ఇతర భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు, ఈ పరిణామం పాకిస్థాన్ దౌత్య పరపతిని కూడా దెబ్బతీస్తుంది. భవిష్యత్తులో ఏదైనా సంక్షోభం వస్తే పాకిస్థాన్‌ను నమ్మవచ్చా లేదా అని ఇతర దేశాలు ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. ఇది ప్రాంతీయంగా దాని వ్యూహాత్మక పలుకుబడిని గణనీయంగా తగ్గిస్తుందని ఖిద స్టార్‌ఖి తన కథనంలో అభిప్రాయపడింది.

## రేణిగుంట-గుంతకల్ రైలు మార్గంలో నాలుగు లైన్ల ట్రాక్

**రాజంపేట, మార్చి19 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వేలో ఓ భారీ రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముంబై చెన్నై రైలు మార్గంలో అతి కీలకమైన రేణిగుంట గుంటకల్ మధ్య ప్రస్తుతం ఉన్న రైల్వే డబుల్ లైన్ ను నాలుగు లైన్ల ట్రాక్ నిర్మాణంగా చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కొత్తగా 3, 4 రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా 307.97 కిలోమీటర్ల నూతన రైల్వే మార్గాన్ని భూసేకరణ చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజనీర్ హెచ్ కె భగోరియా నోటిఫికేషన్ జారీ చేశారు.202627 కేంద్ర బడ్జెట్‌లోనే ఈ కొత్త మూడు నాలుగు రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. తాజాగా భూసేకరణ నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో త్వరలోనే సమగ్ర సర్వే ప్రారంభం కానుంది. ప్రజా ప్రయోజనార్థం జాతీయ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు భూసేకరణ చేపట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే నోటిఫికేషన్ లో పేర్కొంది. నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచే భూసేకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ తరపున దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజనీర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి, కడప, అనంతపురం జిల్లాల పరిధిలో భూసేకరణ ప్రక్రియ జరుగుతుంది. రైల్వే నోటిఫికేషన్లో అన్నమయ్య జిల్లాలో కూడా భూసేకరణ జరుగుతుందని పేర్కొన్న ప్రతిపాదనలు పంపే నాటికి అన్నమయ్య జిల్లా పరిధిలో కూడా సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉండేది. తాజాగా రైల్వే కోడూరు నియోజవర్గంలోకి రైల్వే కోడూరు మండలాలు తిరుపతి జిల్లాకు చేరిన నేపథ్యంలో భూ సేకరణను కడప, తిరుపతి, అనంతపురం జిల్లా కలెక్టర్లు చూసే అవకాశం ఉంది. త్వరలో భూసేకరణ అధికారులను కూడా ప్రకటించను న్నారు. ఇప్పటికే రైల్వే బోర్డు దగ్గర సమాచారం ఉంది.

మళ్లీ హాథీరాంజీ మఠం

## పాలన పగ్గాలు అర్జున్ దాస్‌కే

బాధ్యతలు చేపట్టిన మహంతు



**తిరుమల,మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా కోట్ల రూపాయలు విలువైన భూములు, ఆస్తులు కలిగి ఉన్న హాథీరాంజీమఠం సంస్థానం పాలన పగ్గాలు తిరిగి అర్జున్‌దాస్ మహంతుకే అందాయి. గతంలో ఆయనపై వచ్చిన ఆరోపణలతో ఆయనను కస్టోడియన్‌గా ప్రభుత్వం తప్పించింది. ఆ తరువాత ప్రభుత్వ దేవాదాయశాఖ అధికారుల అజమాయిషీలో నడుస్తోంది. దీనిపై అర్జున్‌దాస్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ధర్మాసనం వెలువడించిన తీర్పుతో తిరిగి అర్జున్‌దాస్‌కే హాథీరాంజీమఠం పాలన బాధ్యతలు అప్పగించింది. ఆయన గురువారం ఉదయం తిరుమలకు చేరుకుని దేవదేవుడు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంవెలుపల ఆయన తనపై ఆ శ్రీవారే కరుణ చూపారని, తన నమ్మకాన్ని కాపాడుకుంటానని అన్నారు. మఠం ఆస్తులను తన ప్రాణంగా భావించి కాపాడుతానని అన్నారు. హాథీరాంజీ మఠం మహంతుగా తిరిగి నియమితులైన అర్జున్ దాస్ తిరుమలలోని మఠం ప్రాంగణంలో కొద్దిసేపు గడిపారు. ఆతరువాత తిరుపతిలోని మఠం కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అర్జున్‌దాస్‌కు కార్యాలయం అధికారులు ఆహ్వానం పలికారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రమాణాల ప్రకారం

## లేకపోతే జరిమానా: ఏపీ హైకోర్టు

**విజయవాడ, మార్చి19 ప్రభాతవార్త ప్రతినిధి:** షిర్డీ సాయి సంస్థ సరఫరా చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాణాల ప్రకారం లేకపోతే జరిమానా విధిస్తామని ఏపీ హైకోర్టు హెచ్చరించింది. 2021 నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల టెండర్ కేటాయింపు, సరఫరాలో అవకతవకలు జరిగాయని దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు పిల్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన ధర్మాసనం కౌంటర్లు వేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. షిర్డీ సాయి సంస్థ సరఫరా చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిపుణులతో పరిశీలన చేయిస్తామని ధర్మాసనం పేర్కొంది. ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే సంస్థకు జరిమానాలు విధిస్తామని తెలిపింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు కొంత సమయం కావాలని ఏజీ కోరడంతో విచారణను కోర్టు వాయిదా వేసింది. అలానే దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, ఏపీఎస్ పీడీసీఎస్ఎల్ సీఎండీ, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

## కోకో గింజలు కొనుగోలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్

**విజయవాడ, మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కోకో గింజలకు ప్రైస్ పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలు కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెంలోని కోకో తోటలను ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు పరిశీలించారు. కోకో గింజలు కొనుగోలు సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెంన్నాయుడు ఏలూరులో జరిగిన కోకో కాంక్లేవ్ సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఆయిల్ పామ్ గెలల ధర మాదిరిగా కోకో గింజలకు ప్రైస్ ఫార్ములా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వమే ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర తగ్గిందనే పేరుతో కోకో గింజలకు కంపెనీలు ధర తగ్గించి వేయడం దారుణమని విమర్శించారు. గత సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్ ధర కిలో కోకో గింజలకు రూ.900 ఉన్నప్పుడు ఆ ధరను కంపెనీలు రైతులకు చెల్లించలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కిలో కోకో గింజలకు రూ.300 కంపెనీలు ధర ప్రకటించినా రైతుల నుండి గింజలు కొనుగోలు చేయడం లేదన్నారు. ఈ ధరను మరింత తగ్గించి మోసం చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు.

# కల్తీ ఏకసభ్య కమిటీ ఏం తేల్చనుందో?

- పదిరోజులు నిశితంగా రికార్డులు, ల్యాబ్ పరిశీలన
- పాపపు చిట్టాలో ఎవరి వాటా ఎంతో?



**తిరుమల, మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులను ఆలోచన చేసే దిశగా మారిన తిరుమల లడ్డూలకు రసాయనాలు కల్తీచేసిన నెయ్యిసరఫరా చేసిన పాపంలో ఇప్పుడు ఏకసభ్య కమిటీ ఏం తేల్చ నుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఇప్పటికే విచారణకు నియమితులైన ఏకసభ్య కమిటీ విశ్రాంత ఐఎఎస్ అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ గత పదిరోజులుగా తిరుపతిలోనే ఉంటూ 2019-24 మధ్యకాలంలో టిటిడికి నెయ్యి సరఫరాకు సంబంధించిన రికార్డులు, కీలక దస్త్రాలు, టిటిడి కొనుగోళ్ళు, టెండర్లు తదితర అంశాలను క్షుణ్ణంగా ఆరా తీసింది. వాటన్నిటినీ టిటిడి ఉద్యోగుల సహకారంలో పరిశీలించిన దినేశ్‌కుమార్ బుధవారం తిరుమ లలో టిటిడి పరిశోధనా ల్యాబ్‌ను తనిఖీ చేయడం విశేషం. ఈ ల్యాబ్‌లో పరీక్షలు ఎలా చేస్తున్నారు, కల్తీని ఎలా కనుగొంటారనే విష యాలు తెలుసుకున్నారు.సేకరించిన సమగ్ర సమాచారంతో ఇకపై మరింత లోతైన దర్యాప్తు చేయడానికి ఉపక్రమిస్తున్నారు. నెయ్యి సరఫరాకు సంబంధించి అమలైన టిటిడి టెండర్ విధానం, నిబంధనలు ఉల్లంఘన, తదుపరి అప్పటి బోర్డుకు అనుకూలంగా మార్చుకుని నెయ్యి సరషరా చేయించుకోవడం వంటివాటిపై ఇప్పటికే కీలక సమాచారం రాబట్టారు. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన డెయిరీలు, కాంట్రాక్టర్లు, సంస్థలు వంటి వివరాలు సేకరించుకుని ఆ దిశగా ఇప్పుడు దర్యాప్తు ప్రారంభించనున్నారు. లడ్డూప్రసాదాల తయారీకి పలురకాల రసాయనాలు కలిపిన నూనె, ఇతర శాఖాహారపదార్థాలతో కల్తీ నెయ్యిని సరఫరా చేశారనేది సిబిఐ సిట్ అధికారులు కూడా దాదాపు తేల్చేశారు. ఆ నివేదికలను రాష్ట్రప్రభుత్వం దినేశ్‌కుమార్‌కు అందించింది. ఆ అవినీతి నిగ్గు తేల్చేందుకు, అసలు సూత్రదారులు ఎవరనేది కనిపెట్టి వివరాలు బయటకు తేవడానికి ఏకసభ్యకమిటీ కీలకం కానుంది. కల్తీనెయ్యి బాగోతంలో సుమారు 237కోట్ల రూపాయలు వరకు అవినీతి జరిగిందనేది సిట్ నివేదిక. అయితే ఇందులో ఎవరెవరి పాత్ర కీలకం, టెండర్లు నిబంధనలు మార్చిందెవరు, దీనివెనుక ఎంత మొత్తంలో ఎవరెవరి నుండి ఎవరికి ఆర్థికంగా లబ్ధిపొందారనే ఆధారాలు కమిటీ తేల్చాల్సి ఉంది. ఆ తరువాత కల్తీనెయ్యిలో అసలు దోషు లు ఎవరనేది వెలుగుచూడనుంది. సిట్ అన్ని కోణాల్లో కీలక విచారణ చేపట్టి లడ్డూప్రసాదాల కల్తీనెయ్యి వాడకంపై పాత్రధారులను 36 మందిని గుర్తించింది. ఇందులో మరీ కొందరు అధికారుల ప్రమేయం కూడా ఉందనేది నివేదికలిచ్చారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న టిటిడి ఎఫ్ఎసిఎఓ బాలాజీ పాత్ర ఉండటం, ఆయన ఏకంగా స్వల్ప దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళడం సంచలన మే. ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే ఆయ నకు సెలవు మంజూరు చేసిన అధికారులెవరనేది ఈ కమిటీ గుర్తించింది. గత టిటిడి బోర్డు పెద్దలు, గత అధికారుల పనితీరుపై పలురకాల ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో వారందరి నీ ఏకసభ్య కమిటీ రానున్నరోజుల్లో పిలిపించు కుని సమగ్ర దర్యాప్తు చేయడానికి అవసరమైన ఆదేశాలు కూడా అందుకున్నట్లు తెలుస్తోంది. 2019-24 కాలంలో లడ్డూల తయారీకి ఐదు మంది కాంట్రాక్టర్లు టెండర్లలో దక్కించుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేయాల్సిన నాణ్య త ప్రమాణాలతో నెయ్యికి బదులు నాసిర కంగా, జంతువుల కొవ్వునూనె కలిపారనేది సిబిఐ సిట్ తేల్చింది. అవినీతి మర కల్లో అస లు దోషులు ఎవరనేది తెలియాలనేది ఏక సభ్య కమిటీ దర్యాప్తులో తేలిపోనుంది. రెండురోజుల తిరుమల పర్యటనకు విచ్చేస్తున్న సిఎం చంద్ర బాబును కమిటీ కలిస్తుందా లేదా అనేది అనుమానమే.

## ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి సీఎం

### ఆహ్వాన పత్రిక అందజేసిన టిటిడి ఈవో రవిచంద్ర



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న టిటిడి ఈవో

**రాజంపేట, మార్చి 19 ప్రభాతవార్త:** ఈనెల 27 నుంచి కడప జిల్లా ఒంటిమిట్టలో రాష్ట్ర ప్రభుత్వం అధికారి క లాంచనాలతో నిర్వహించే శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడును తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు బ్రహ్మోత్స వాల ఆహ్వాన పత్రికలు సీఎంకు టీటీడీ ఈవో రవిచంద్ర అందజేశారు. ఏప్రిల్ 1న సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించ నున్నారు. అలాగే టిటిడి అధికారులు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కూడా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# వారాంతాల్లో సరదాగా..



ఇల్లు, ఉద్యోగం, ఇతరత్రా వ్యాపకలతో క్షణం తీరిక లేకుండా గడిపేస్తున్నారా! ఒక్క నిమిషం ఆగండి. అవన్నీ ఎప్పుడూ ఉండేవే కదా. వారాంతాల్లో అయినా సరదాగా మీ భాగస్వామితో అలా ఏ డిన్నర్‌కో, విహారయాత్రకో వెళ్లిరండి. ఏంటి ప్రత్యేకించి చెబుతున్నారు అనుకుంటున్నారా.. అందుకూ ఓ కారణం ఉంది. అదేంటంటే మనకిష్టమైన వారితో సమయం గడపటం వల్ల ఆనందాన్ని కలిగించే డోపమైన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తి అయి. అది మెదడులో ప్రత్యేకమైన రసాయనిక ముద్రను ఏర్పరుస్తుందట. అది బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాజా పరిశోధనల్లో తేలింది. అయితే భాగస్వామి నుంచి విడిపోయినప్పుడు.. ఆ ముద్ర నెమ్మదిగా మాయమవుతుందట. కాబట్టి మనం భాగస్వామితో మాట్లాడే ప్రతి మాట ప్రతి పనీ ఒకరకంగా చెప్పాలంటే మన ప్రవర్తన వాళ్ల మెదడుపై చాలా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి వాళ్ల మనసులో ప్రేమ ముద్రను అలానే ఉంచాలా, చెరపాలా అన్నది మన చేతుల్లోనే ఉంది. చూసుకోండి మరి! □

## సమ్మర్‌లో సమస్యలు లేకుండా..



జిడ్డు చర్మం, మొటిమలు, వేడి వల్ల చర్మం పొడిబారడం.. ఇలా సమ్మర్ వస్తోందంటే చాలు. ఇబ్బంది పెట్టే సమస్యలెన్నో!

**స్నానానికి ముందు వద్దు..**

చర్మ సౌందర్యాన్ని దెబ్బతీసే వాటిలో మృత కణాలు కూడా ఒకటి. వీటివల్ల చర్మం డల్‌గా కనిపిస్తుంది. ఇవి చర్మానికి పోషకాలు అందకుండా చేసి, చెమట గ్రంథుల్ని మూసుకు పోయేలా చేస్తాయి. ఫలితంగా మొటిమలు, మచ్చలు.. వంటివి ఏర్పడతాయి. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా వీటిని తొలగించుకోవడం అవసరం. ఇందుకోసం స్నానం చేయడానికి ముందే ఏదైనా ఎసెన్షియల్ నూనెతో చర్మాన్ని మసాజ్ చేసుకోవాలి. ఆపై స్నానం చేసి.. మీ చర్మతత్వానికి సరిపోయే స్క్రబ్ సహాయంతో మృత కణాలను తొలగించుకోవాలి. ఫలితంగా చర్మానికి ఎలాంటి హానీ కలగకుండా వాటిని సులభంగా వదిలించుకోవచ్చు.

**తేమనందించడం ముఖ్యం..** అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవడం సహజమే. ఇందుకోసం వివిధ రకాల క్రీములు వాడడం, వ్యాక్సింగ్ చేయించుకోవడం.. వంటివి చేస్తుంటారు చాలామంది. అయితే వీటివల్ల చర్మం ఇరిటేట్ అయి ఎరుపెక్కడం, దురద రావడం.. ఇలా పలు సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి ముందు, తర్వాత ఆ ప్రదేశంలో చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడం తప్పనిసరి. ఇందుకోసం చర్మతత్వాన్ని బట్టి మాయిశ్చరైజింగ్ క్రీమ్‌లను ఎంపిక చేసుకోవాలి. వీటిలోని గ్లిజరిన్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేసి ఎలాంటి చర్మ సంబంధిత సమస్యలు ఎదురవకుండా చేస్తుంది.

అలాగే వ్యాక్సింగ్ చేయించుకునే వారు పదే పదే కాకుండా.. వ్యాక్సింగ్‌కి, వ్యాక్సింగ్‌కి మధ్య కనీసం పదిహేను రోజులైనా గ్యాప్ తీసుకోవడం తప్పనిసరి. ఇలా షేవ్ చేసుకున్న వెంటనే పూల్స్ బీచ్‌లలోని నీటిలో ఈత కొట్టడం సరికాదు. దీనివల్ల ఆ నీటిలోని క్లోరిన్, ఉప్పు, సూర్యరశ్మి.. మొదలైనవాటి వల్ల చర్మంపై ట్యాన్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి కనీసం 24 గంటల సమయమైనా గ్యాప్ తీసుకోవాలి. □

# అల్లాహ్ వరాల జల్లులకు సుదినం



నెల రోజుల పాటు కఠోర నియమనిష్టలతో ఉపవాసదీక్షలు పాటించిన వారికి నేడు రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రార్థనల సందర్భంగా వారి భక్తి ప్రవర్తులకు భగవంతుడు వరాలిచ్చే సుదినం. ఏడాదిలో వచ్చే ఈ సుదినం కోసం ఎంతో నిరీక్షించిన వారికి వరాలిచ్చే సుదినం ప్రార్థనల కోసం ఈదాగాహ్‌లు ముస్తాబు చేస్తున్నారు. 30వ రోజు రాత్రి మసీదుల్లో ముస్లిం సొదరులు లైల్‌తుల్ జాయిజా ఆచరిస్తారు. రాత్రంతా అల్లాహ్ ధ్యానంలో గడిపి. రంజాన్ ఉదయం ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరుపుటకు సిద్ధమౌతారు. కొత్త బట్టలు లేదా శుభ్రం చేసిన బట్టల్ని ధరించి కళ్ళకు సుర్‌మాను అలంకరించి, చక్కగా సుగంధ ద్రవ్యాల్ని పూసుకొని, ఒక దారి వెంట వెళుతూ మరో దారి వెంట ఇంటికి చేరటానికి ముస్లిం సొదరులు సిద్ధమౌతున్నారు.

**ఈదుల్ పితర్ నమాజులకు సిద్ధం:**

భారతదేశంలోని మూల మూలల్లో నేడు ముస్లిం సొదరులు భక్తి శ్రద్ధలతో రంజాన్ సందర్భంగా ఈదులు ఫితర్ నమాజ్‌ను అచరించనున్నారు. ఇందుకు ముస్లిం సొదరులు సమాయత్తమౌతున్నారు. రంజాన్ సందర్భంగా బక్రీద్ మాసంలో హాజ్‌యాత్రకు వెళ్ళలేని వారు మక్కా,మదీనాకు 'ఉమ్రా' చేయటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో పలువురు భారత దేశం నుంచి మక్కా,మదీనాకు పయనమయ్యారు. భారత దేశం నలుమూలల నుంచే కాక ప్రపంచదేశాల నుంచి విశేష సంఖ్యలో ఉమ్రా చేయటానికి ఇటీవల కాలంలో కదలి వస్తున్నారు. షాబాన్ మాసం ముగిసిన తరువాత 'నెలవంక దర్శనంతో' రంజాన్ నెల రాత్రి వేళల్లో తరావీహ్ నమాజుల్లో దివ్యఖుర్‌ఆన్‌ను పఠించటం మొదలు పెడతారు. రంజాన్ మాసం పూర్తి అయిన తరువాత నెలవంకను చూసి తరావీహ్ నమాజుల్ని ఆపివేస్తారు. ఉదయం పండగను జరుపుకుంటారు. 30రోజుల పాటు మోమిన్ ముస్లింలు కఠోర నియమాలతో కూడిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఐదువేళల్లో తప్పని సరిగా నమాజులు ఆచరిస్తారు. సాయంత్రం మసీదుల్లో ఉపవాసదీక్షలు ముగింపుసందర్భంగా 'ఆష్ 'అనే ద్రవ పిండి పదార్థాలతో అందజేస్తారు. గతంలో ఇళ్ళ నుంచి ఉభయదారులు తయారు చేసి పంపే వారు. కానీ నేడు మసీదుల్లోనే కొంత మొత్తాన్ని ఖరారు చేసి తయారు చేసి ఉపవాసదీక్షలు పాటించే వారితో పాటు బయటి వ్యక్తులకు కూడా పంపిణి చేస్తున్నారు.

**లయల్‌తుల్ జాయజా:**

రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో ఐదు రాత్రుల్లో ఓ దివ్యరాత్రి ఉందని దివ్యఖుర్ ఆన్‌లో పేర్కొన్నారు. ఈ రాత్రుల్ని అన్వేషిస్తూ రాత్రి జాగరణ చేయటం ఆనవాయితి. అర్ధరాత్రి దాటిన తరువాత వేకువ జాము 3గంటలకు కన్నీరు మున్నీరుగా రోదిస్తూ అల్లాహ్ వద్ద ప్రార్థనలు చేస్తారు. 30 రాత్రి నెలవంక




దర్శనం తరువాత (పొద్దుపొడిస్తే పండగ) ఇషా నమాజు తరువాత 'లయతుల్ జాయజా' అని అంటారు. 30రోజుల పాటు ఆచరించిన నమాజులకు ఉపవాసదీక్షలకు ఫలాన్ని ఇచ్చే రాత్రి అంటారు. ఈ రాత్రంతా మేల్కొని వేకువ జామున ఉదయం ఆచరించే తహజ్జుద్ నమాజును ఆచరిస్తారు.

**ఈద్‌గాహ్‌లు ముస్తాబు:**

రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా ఓ ప్రాంతంలోని ముస్లిం అందరూ ఒక చోటు చేరి ప్రార్థనలు జరుపుతారు. ఈ ప్రాంతాన్ని ఈద్‌గాహ్ అంటారు. గతంలో ఒక ప్రాంతానికి ఒకే ఈద్‌గాహ్ ఉండేది. కానీ పెరుగుతున్న పట్టణాల తీరుతో ఒక్కొక్క చోట ఇలా ఒక పట్టణంలో నాలుగైదు చోట్ల ప్రార్థనలు జరుపుతున్నారు. ఇక్కడ ఆయా ప్రాంతాల్లోని నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు.

ఒక వ్యక్తికి ఫిత్రా రూ.లు: రంజాన్ సందర్భంగా ఆచరించే ముఖ్యమైన సూత్రాల్లో 'ఫిత్రా' ఒకటి. కుటుంబంలో బతికున్న ప్రతి ఒక్కరి పేర కనీసం రూ.100లు ఫిత్రా చెల్లించాల్సి ఉంది. దీనిని పేదలకు దానం చేస్తారు. వారి స్థోమతను బట్టి చెల్లించాల్సి ఉంటుంది. మూడున్నర కిలోల ఎండు ద్రాక్ష ఖరీదు,లేదా 3కిలోల బార్లి ఖరీదు,లేదా రెండున్నర కిలోల ఖర్జూరరం ఖరీదులను ఖరారు చేసారు. నేటి ధరలననుసరించి ఈ మొత్తాన్ని ఖరారు చేసి ఈదుల్ ఫితర్ నమాజుకు వెళ్ళె ముందు పేదలకు పంచి పట్టాల్సి ఉంటుందని దివ్యఖుర్‌ఆన్‌లో పేర్కొన్నారు. అరబ్ దేశాల్లో భారత దేశం కన్నా ఒక రోజు ముందు ఈదుల్ పితర్ నమాజను ఆచరిస్తారు. కాలమానం ప్రకారం భారత దేశంలో శుక్రవారం నాటికి 30 ఉపవాసదీక్షలు పూర్తి అవుతాయి కాబట్టి ప్రభుత్వం శనివారం రంజాన్ పర్వదినాన్ని ఆచరించనున్నారు. అయితే నెలవంక దర్శనం గురువారం జరిగితే శుక్రవారం ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**- రహంతుల్లా**

## మేలు చేసే మల్బరీ..



వేసవిలో విరివిగా దొరికే **పండ్లలో** మల్బరీ ఒకటి. వీటినే బింతపండ్లు అని కూడా పిలుస్తారు. ఈ మధ్య కాలంలో వీటికి గిరాకీ పెరగటం, రైతులకు లాభదాయకంగా ఉండటం వల్ల ఎక్కువ సాగు చేస్తున్నారు. వీటిని డ్రైఫ్రూట్‌లాగా కూడా ఉపయోగిస్తారు. ఎండిన 100 గ్రాముల బెర్రీస్‌లో 362 కెలోరీలు ఉంటాయి. ఇందులో ఉండే ఫైబర్, పెక్టిన్ జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాని వృద్ధి చేస్తుంది. పేగుల్లో ఇమ్యునిటీ తగ్గ టానికి కారణం ఫైబర్ తక్కువగా ఉండే ఆహారం తీసుకోవటమేనని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. విటమిన్ సి,కె ఉండటం మూలంగా మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో ఉండే బ్యాక్టీరియాని నిర్మూలించడానికి కూడా మల్బరీస్ చక్కగా దోహదపడ`తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సమన్వయం చేస్తాయి. కాబట్టి మధుమేహం ఉన్నవారూ తీసుకోవచ్చు. ఇతర దేశాల్లో మధుమేహానికి తయారు చేసే ఔషదాల్లో కూడా దీన్ని ఉపయోగిస్తారట. చార్మినార్ దగ్గర దొరికే వంటకాల్లో మల్బరీ క్రీం కూడా ఒకటి. దీన్ని మల్బరీలు, పాల మీగడ, పంచదారతో చేస్తారు. చార్మినార్ చూసేందుకు వచ్చిన పర్యటకులు దీని రుచి అమోఘంగా ఉంటుందని చెప్తుంటారు □

## భాషా నైపుణ్యాలు కీలకం



పిల్లల ఎదుగుదలలో భాషా నైపుణ్యాలు చాలా కీలకం. అందుకోసం వారికి బొమ్మల పుస్తకాలు చూపిస్తూ ఉంటాం. అయితే వాటినే పదేపదే చూడాలంటే పిల్లలకు బోర్ కొట్టొచ్చు. అందుకు ప్రత్యామ్నాయంగా గతంలో మనకు జరిగిన సంఘటనలను సున్నితంగా వారితో పంచుకోమంటున్నారు పరిశోధకులు. అలా చేస్తే ప్రీస్కూల్ పిల్లల భాషా నైపుణ్యాలు పెరుగుతాయని ఫ్లోరిడా అట్లాంటిక్ యూనివర్సిటీ చేసిన అధ్యయనంలో తేలింది. కొంతమంది తల్లిదండ్రులకూ, 3-5 ఏళ్ల పిల్లలకూ మూడు రకాల యాక్టివిటీలను ఇచ్చారు. బొమ్మల పుస్తకాలు, లెగో బ్రిక్స్, గతంలో జరిగిన విషయాల గురించి మాట్లాడటం.. వంటి యాక్టివిటీలు ఇచ్చారు. బొమ్మల పుసనతకాలు చూపిస్తూ మాట్లాడితే వచ్చేలాంటి ప్రయోజనాలే, గతంలో జరిగిన విషయాలను చర్చించినప్పుడూ వచ్చాయట. అమ్మ, నాన్న ఇద్దరిలో ఎవరు మాట్లాడినా ఫలితాల్లో తేడా లేదట. అందుకే పిల్లలతో కేవలం సమయం గడపడమే కాదు, దాన్ని ఎంత నాణ్యంగా గడుపుతున్నామన్నదీ ముఖ్యమే అంటున్నారు పరిశోధకులు. అందుకే పిల్లలను నిద్రపుచ్చేటప్పుడో లేదా మీకు కుదిరిన సమయంలో గతంలో జరిగిన విషయాల గురించి వాళ్లతో మాట్లాడుతుంటే వాళ్లలో భాషా నైపుణ్యాలు పెరగటమే కాదు ఊహాశక్తి పెరుగుతుంట. □

## తీపి బోండాలు

కావలసిన పదార్థాలు:
మిన



**కావలసిన పదార్థాలు:**

మినుప పప్పు: ఒక కప్పు, బియ్యం: పావు కప్పు, బెల్లం తురుము: అరకప్పు, యాలకుల పొడి: పావు టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా, వంటసోడా: చిటికెడు.

**తయారీ విధానం:** మినుప పప్పు, బియ్యం బాగా కడిగి అయిదు గంటలపాటు నానబెట్టాలి. వీటితోపాటు బెల్లం తరుము కూడా మిక్సీలో వేసి.. నీళ్లు పోయకుండా మిక్సీ యా మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమంలో యాలకుల పొడి, వంటసోడా కలపాలి. సరిప స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక వేసు పిండి మిశ్రమంతో చిన్నచిన్న బోండాలు వేసుకుని, దోరగా కాల్చుకుంటే నోరూరించే తీపి బోండాలు సిద్ధం. □

# తెర

## కలెక్షన్ కింగ్ డా.మోహన్‌బాబు బర్త్ డే స్పెషల్



మార్చి 19 టాలీవుడ్ సీనియర్, లెజెండరీ నటుడు కలెక్షన్ కింగ్ డా. మోహన్ బాబు పుట్టిన రోజు. సినీ పరిశ్రమలో ఆయన అడుగు పెట్టి ఇటీవలే యాభై ఏళ్లు అయిన సంగతి తెలిసిందే. ఇక విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా, నిర్మాతగా, నటుడిగా మంచు మోహన్ బాబు అందుకున్న శిఖరాగ్రాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 1975లో సినీ కెరీర్‌ను ఆరంభించిన మోహన్ బాబు ఇప్పటికీ దిగ్విజయంగా దూసుకుపోతున్నారు. కుర్ర హీరోలు, యంగ్ జనరేషన్‌తో పోటీ పడుతూ మరీ మోహన్ బాబు నటిస్తున్నారు. ఒకప్పుడు విలన్‌గా తెలుగు సినీ పరిశ్రమకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చిన మోహన్ బాబు ఇప్పుడు డిఫరెంట్ పాత్రలతో నేటి తరాన్ని మెప్పించబోతోన్నారు.స్వర్గం నరకం చిత్రంతో పరిశ్రమకు హీరోగా పరిచయం అయ్యారు. ఆ తరువాత ఎన్నెన్నో గొప్ప పాత్రలు పోషిం చారు. అటు విలన్‌గా, ఇటు హీరోగా, మరో పక్క నిర్మాతగా తిరుగులేని విజయాల్ని అందుకున్నారు. ఆయన కెరీర్‌లో కల్ట్ క్లాసిక్స్, ఇండస్ట్రీ హిట్స్ వంటివెన్నో ఉన్నాయి. ఇక విద్యా వేత్తగానూ మోహన్ బాబు సమాజంపై తన ముద్రను వేశారు. 1992లో స్థాపించిన శ్రీ విద్యానికేతన్ విద్యా ట్రస్ట్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మోహన్ బాబు తన సుదీర్ఘమైన కెరీర్‌లో ఎన్నో గౌరవ పురస్కారా లను అందుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రదానం చేయగా, 2016 ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించింది. ఇటీవలె గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు (2026) వంటి ముఖ్యమైన పురస్కారాన్ని కూడా అందుకున్నారు. నిర్మాతగానూ 75 చిత్రాలను నిర్మించారు. ఈ ఏడాది ది ప్యారడైజ్,`శ్రీనివాసమంగాపురం వంటి చిత్రాల్లో డిఫరెంట్ పాత్రల్ని పోషిస్తున్నారు.

## 'కరుప్పు' మే 14న వరల్డ్ వైడ్ రిలీజ్



సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన 'కరుప్పు' ఫస్ట్ లుక్ టీజర్ సంచలనం క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ సూర్య ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ.

## 'బ్లాక్ గోల్డ్' భారీ స్కేల్‌లో చేస్తున్నాం


నిర్మాత రాజేశ్ దండా

హాస్య మూవీస్ బ్యానర్ పై సామజవరగమన, ఊరు పేరు భైరవకోన, కే రాంప్ లాంటి వరుస బ్లాక్ బస్టర్స్ అందించిన సక్సెస్‌ఫుల్ నిర్మాత రాజేశ్ దండా. . మార్చి 19 ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న తాజా ప్రాజెక్ట్స్, భవిష్యత్ ప్రణాళికల గురించి విలేకరులతో ముచ్చటించారు.

**ఉగాది, మీ బర్త్‌డే ఒకేరోజు రావడం ఎలా అనిపించింది?**

ఉగాది, నా బర్త్‌డే ఒకేరోజు రావడం చాలా సర్ ప్రైజ్ గా అనిపించింది. కొత్త సంవత్సరంలో బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోవడం ఇదే ఫస్ట్ టైమ్, దాదాపు 15 ఏళ్ల తర్వాత ఇలా జరిగింది.

**మీ బ్యానర్ నుంచి సినిమా వస్తే కథ కొత్తగా ఉంటుందనే నమ్మకం వుంది. కథలు ఎలా సెలెక్ట్ చేస్తారు?**

నేను చేసే సినిమాల్లో కథలో ఒక కొత్త పాయింట్ ఉండేలా చూసుకుంటాను. డిస్ట్రిబ్యూటర్‌గా చాలా సినిమాలు చూసిన అనుభవం ఉంది. ఏది పనిచేస్తుంది, ఏది పనిచేయదు అన్న ఐడియా వుంటుంది.

**మీ జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**

నిజానికి నేను ప్రొడ్యూసర్ అవ్వాలని అనుకోలేదు. ఎంసీఏ చదివి సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లోకి వెళ్లాను. కానీ అనుకోకుండా స్వామి రారా సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా మారాను.

**బడ్జెట్ కంట్రోల్ ఎలా చేస్తారు?**

నేను ఎక్కువగా కొత్త దర్శకులతోనే పని చేశాను. ప్రొడక్షన్‌లో ప్రతిదీ దగ్గరుండి చూసుకుంటాను.

**మీకు నిరాశ కలిగించిన సినిమాలు ఏమైనా ఉన్నాయా?**

బచ్చలమల్లి తరహా కథ అప్పటివరకు రాలేదు. ఖచ్చితంగా కొత్తగా ఉంటుందని బలంగా నమ్మాం.

**సంయుక్తతో చేస్తున్న బ్లాక్ గోల్డ్ గురించి?**

గన్ పట్టుకొని ఒక పోలీస్ ఆఫీసర్, గన్ మాత్రమే వాడే విలన్ మధ్య జరిగే కథ ఇది.

**నరేష్ గారి సినిమా గురించి?**

నరేష్ గారి సినిమా షూటింగ్ నెక్స్ట్ మంత్ ఫస్ట్ వీక్‌కు పూర్తవుతుంది.

**అల్లు శిరీష్, ఆది సాయికుమార్, అడివి శేష్ సినిమాల అప్డేట్స్?**


ఆది సాయికుమార్ గారితో శంభాల రిలీజ్‌కు ముందే ఒక కథ ఫిక్స్ చేశాం. ఈ నెల 27న పూజ ఉంటుంది. అలాగే అల్లు శిరీష్ గారితో సోలో లైఫ్ ఫేం సుబ్బు డైరెక్షన్‌లో ఒక సినిమా ఉంటుంది.

## 'పాపం ప్రతాప్' ఏప్రిల్ 17న రిలీజ్



ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో‌ఖి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న యంగ్ హీరో తిరువీర్ ప్రస్తుతం పలు ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. తిరువీర్ హీరోగా S.P.దుర్గా నరేష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఖిపాపం ప్రతాప్‌ఖి. పాయల్ రాధకృష్ణ హీరోయిన్ గా నటిస్తోంది. కృషి ఎంటర్టైమెంట్స్ బ్యానర్ పై రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా యూనిక్ ప్రమోషన్స్ తో ఆసక్తిని పెంచింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఈ సినిమా సమ్మర్ స్పెషల్ గా ఏప్రిల్ 17న థియేటర్స్ లో విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో తిరువీర్, పాయల్ రాధాకృష్ణ నవవధూవ రులగా కనిపించడం క్యురియాసిటీ పెంచింది. ఈ చిత్రంలో అజయ్ ఘోష్, ప్రసాద్ బెహారా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రీ.లీ రాధా కృష్ణ, సురేష్ బొబ్బిలి మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి విశ్వేశ్వర్ ఎస్.వి డీవోపీ, అన్వర్ అలీ ఎడిటర్.

## 'స్పైడర్‌మ్యాన్ బ్రాండ్ న్యూ డే' ట్రైలర్ లాంచ్



ఈ నెల ప్రపంచ వ్యాప్తంగా అశేష ప్రేక్షకాదరణ పొందిన స్పైడర్ మ్యాన్ సిరీస్‌లో సరికొత్త చిత్రం `స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే ట్రైలర్ విడుదలైంది. మొట్ట మొదటి గ్లోబల్ ఫ్యాన్‌డ్రివెన్ ట్రైలర్ టీజ్ తర్వాత, న్యూయార్క్ నగరంలో ఐకానిక్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై నుండి టామ్ హాలండ్ పూర్తి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఇదొక మరపురాని క్షణంగా నిలిచిపోయింది.`స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్ఖ సాధించిన రికార్డ్‌బ్రేకింగ్ గ్లోబల్ సక్సెస్ తర్వాత, పీటర్ పార్కర్, స్పైడర్ మ్యాన్‌ల జీవితాల్లో`స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డ్ఖే ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. ఖినో వే హోమ్ఖి సంఘటనలు జరిగి నాలుగు సంవత్సరాలు గడిచాయి. పీటర్ ఇప్పుడు తనను ప్రేమించేవారి జీవితాలు, జ్ఞాపకాల నుండి తన అస్తిత్వాన్ని పూర్తిగా చెరిపేసుకుని ఒంటరిగా జీవిస్తున్నాడు. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో స్పైడర్‌మ్యాన్‌గా టామ్ హాలండ్ తిరిగి నటిస్తుండగా, జెండయా, జాకబ్ బటలాన్, సాడీ సింక్, జోన్ బెర్న్తాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో మరియు ట్రామెల్ టిల్మాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'క్రేజీ కల్యాణం' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ రోజు ఉగాది పండుగ సందర్భంగా "క్రేజీ కల్యాణం" మూవీ నుంచి యంగ్ హీరో అఖిల్ రాజ్ ఉడ్డెమారి నటించిన ఉదయ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో అఖిల్ రాజ్ ట్రెడిషనల్ వేర్ లో హ్యాపీగా డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" సక్సెస్ తర్వాత "క్రేజీ కల్యాణం" తనకు మరో సూపర్ హిట్ అందిస్తుందని అఖిల్ రాజ్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి "క్రేజీ కల్యాణం" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.



## నాథన్ ఇల్లిస్‌కు గాయం

# సిఎస్‌కెకు బిగ్ షాక్

**చెన్నై:** ఐపీఎల్ ఆరంభాని కంటే ముందే చెన్నై సూపర్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఇల్లిస్ తీవ్రంగా గాయపడ్డాడు. తొడకండ రాల గాయం కారణంగా ఐపీఎల్2026 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆసీస్ పేసర్ నాథన్ ఇల్లిస్‌ను 2 కోట్లకు సీఎస్‌కే రిటెన్ చేసుకుంది. అయితే, ప్రాక్టీసులో ఇల్లిస్ గాయపడడంతో సీజన్ మొత్తానికి దూరమైనట్లు సీఎస్‌కే సీఈఓ కేఎస్ విశ్వనాథన్ ధ్రువీకరించారు. సీఎస్‌కే జట్టులో నాథన్ ఇల్లిస్ ప్రధాన పేస్ అస్త్రంగా ఉన్నాడు.ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతడు ప్రభావం చూపగలడు. అతడి స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాడి కోసం వెదుకుతున్నట్లు విశ్వనాథన్ తెలిపారు. సీఎస్‌కే పేస్ విభాగంలో ప్రస్తుతం ఇద్దరు న్యూజిలాండ్ బౌలర్లు ఉన్నారు. మ్యాట్ హెన్రీని 2 కోట్లకు, ఫౌల్క్స్‌ను 75 లక్షలకు మినీ వేలంలో కొనుగోలు చేసింది. ఇక ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్ కూడా సీఎస్‌కే జట్టులో ఉన్నాడు. ఐపీఎల్2026 సీజన్‌కు దూరమైన నాథన్ ఇల్లిస్ స్థానాన్ని మరొకరితో భర్తీ చేయనుంది.

# మెస్సీ 900వ గోల్ రికార్డు



**మియామి:** అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీ చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లో 900వ గోల్ సాధించి క్రిస్టియానో రొనాల్డోతో సమం చేశాడు. ఇంటర్ మియామికి ఆడుతున్న లియోనెల్ మెస్సీ... కాంకాకాఫ్ ఛాంపియన్స్ కప్‌లో నాష్ విల్లేపై ఈ గోల్ సాధించాడు. 38 ఏళ్ల మెస్సీ తన జట్టును ఛాంపియన్స్ కప్ నుంచి నిష్క్రమించకుండా నివారించలేకపోయాడు. మియామీ ఈ మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించింది. ఏడో నిమిషంలో మెస్సీ అద్భుత గోల్ తో ఇంటర్ మియామి 1-0 ఆధిక్యం పొందింది. అయితే క్రిస్టియన్ ఎస్పినోజా 74వ నిమిషంలో చేసిన గోల్ తో నాష్ విల్లే ఈ మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసింది దీంతో ఎవే గోల్స్ నిబంధన కారణంగా ఇంటర్ మియామి ఇంటిదారి పట్టింది.2023లో ఇంటర్ మియామి క్లబ్‌లో చేరిన మెస్సీ ఆ జట్టు తరఫున మొత్తం 81 గోల్స్ చేశాడు. ఎవే గోల్స్ నియమంతో నాష్ విల్లే క్వార్టర్‌ఫైనల్స్ చేరింది.

# ముంబై స్టార్ పవర్




ముంబై ఇండియన్స్... విజయవంతమైన ఐపీఎల్ జట్లలో ఒకటి. అయిదుసార్లు ఐపీఎల్ విజేత. ఓసారి రన్నరప్‌గా నిలిచింది. 2026 ఐపీఎల్‌లోనూ భారీ అంచనాలతో బరిలోకి దిగుతోంది. టాప్ పెవరేట్‌గా ఉంది. ముంబై ఇండియన్స్ జట్టులో మ్యాచ్‌లను గెలిపించగల ఆటగాళ్లు పుష్కలంగా ఉన్నారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ వంటి అనుభవజ్ఞులైన స్టార్ ప్లేయర్లతో కళకళలాడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాలూ పటిష్టంగా ఉన్నాయి. గత సీజన్‌లో ప్లే ఆఫ్‌కు వచ్చిన ముంబై ఇండియన్స్.. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఆరో టైటిల్ అందుకోవడంపై దృష్టి పెట్టింది.

(వార్త క్రీడా విభాగం)

ముంబై ఇండియన్స్ 2026 ఐపీఎల్‌లో ప్రధాన టైటిల్ పోటీదారుల్లో ఒకటిగా అడుగుపెడుతోంది. ఆ జట్టు స్టార్ ప్లేయర్లు, యువ గన్స్ చక్కని బాలెన్స్‌తో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటిలోనూ బలంగా ఉంది. 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచింది. 2010లో రన్నరప్‌తో సరిపెట్టింది. 2022, 2024 ఐపీఎల్లో నిరాశపరుస్తూ పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. గత ఐపీఎల్‌లో మాత్రం చక్కగా పుంజుకుని ప్లేఆఫ్ వరకు వచ్చింది. నాలుగో స్థానం పొందింది. గత ఐపీఎల్‌లో సూర్యకుమార్ యాదవ్ 717 రన్స్‌తో మెరుపులు మెరిపించగా, ట్రెంట్ బౌల్ట్ 22 వికెట్లు పడగొట్టాడు. ముంబై ఇండియన్స్‌ను ఆరేళ్లుగా ఐపీఎల్ ట్రోఫీ కొరత వెంటాడుతోంది. ఈసారి ఆలోటును పూడ్చుకోవాలని చూస్తోంది.

### టాప్ క్లాస్ బ్యాటింగ్

ముంబై ఇండియన్స్‌కు ఏ జట్టుకు లేనన్ని హంగులు ఉన్నాయి. టాప్ క్లాస్ బ్యాటింగ్ జట్టు సొంతం. రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్, సూర్యకుమార్, తిలక్ వర్మ రూపంలో బలమైన టాప్ ఆర్డర్ ఉంది. ర్యాన్ రికల్టన్ కూడా అందుబాటులోకి వస్తే బ్యాటింగ్ మరింత బలంగా మారుతుంది. ఏలాంటి బౌలింగ్‌నైనా ఊచకోత కోయగల రోహిత్ శర్మ, డికాక్... ఫ్లయింగ్ స్టార్ట్ అందిస్తే ముంబైకు తిరుగుండదు. దాన్ని భారీ స్కోరుగా మలచగల బ్యాటింగ్ వనరులు ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ చక్కని ఫామ్‌లో ఉన్నారు. బ్యాట్‌తో మెరుపులు మెరిపించగలరు. భారీ స్కోరు అందించగలరు.

### ముంబై ఇండియన్స్ (అంచనా)

రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), విల్ జాక్స్/రూథర్‌ఫోర్డ్, మిచెల్ సాంట్నర్, షార్దుల్ ఠాకూర్, దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ సింగ్ బుమ్రా

### సూపర్ ఆల్‌రౌండర్లు

అలాగే హార్దిక్ పాండ్యా, మిచెల్ సాంట్నర్, విల్ జాక్, షార్దుల్ ఠాకూర్ రూపం లో ప్రపంచ అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లు ముంబై సొంతం. వీరంతా కూడా ప్రస్తుతం టాప్ ఫామ్‌లో ఉండడం ముంబై ఇండియన్స్‌కు అను కూలించే అంశం. ఇటీవలి టీ20 ప్రపంచకప్‌లో హార్దిక్, న్యూజిలాండ్ కెప్టెన్ సాంట్నర్, ఇంగ్లాండ్ యంగ్ ప్లేయర్ విల్ జాక్స్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో ఏ స్థాయిలో రాణించారో క్రికెట్ అభిమానుల కళ్లముందే ఉంది.

### డెత్ ఓవర్స్ స్పెషలిస్ట్స్

ఇక బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా ముంబై ఇండియన్స్ జట్టుకు వరల్డ్ క్లాస్‌గా ఉంది. సూపర్ యార్కర్ల కింగ్ జస్ప్రీత్ బుమ్రా, న్యూజిలాండ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌తోపాటు దీపక్ చాహర్, మయాంక్ మర్కండే ముంబై ఇండియన్స్ బౌలింగ్ అమ్ముల పొదిలో అస్త్రాలుగా ఉన్నారు. ముఖ్యంగా పవర్ ప్లే, డెత్ ఓవర్లలో ప్రత్యర్థి జట్లకు బుమ్రా, బౌల్ట్ ప్రమాదకారులు. స్పిన్ విభాగంలో మిచెల్ సాంట్నర్ ఒక్కడే స్పెషలిస్ట్ స్పిన్నర్ కావడం, ఆ స్థాయి బౌలర్ మరొకరు జట్టులో లేకపోవడం ముంబై ఇండియన్స్‌కు లోటుగా మారింది.

ముంబై ఇండియన్స్ జట్టు కాంబినేషన్ పరంగా,ఫామ్ పరంగా ప్లే ఆఫ్‌కు చేరుకోవడం కష్టమేమి కాదని క్రికెట్ విశ్లేషకుల అంచనా. కెప్టెన్సీ మార్పు ఏ స్థాయిలో జట్టుపై పడుతుందో చూడాలి. సూపర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన కెప్టెన్సీని నిరూపించుకునేందుకు ఐపీఎల్ ఓ చక్కని ప్లాట్‌ఫామ్‌గా మారనుంది. మొత్తంగా బలమైన స్క్వాడ్, అద్భుత బౌలింగ్, లోతైన బ్యాటింగ్ ఉన్న ముంబై ఇండియన్స్ కలిసికట్టుగా రాణిస్తే 2026 ఐపీఎల్‌లో ఎదురుండదు.హార్డ్ హిట్లర్లు, మ్యాచ్ ఫినిషర్లున్న ముంబై ఇండియన్స్ హాట్ ఫేవరెట్‌గా ఉంది.



# నవీన్, మూసా పోడియం ఫినిష్

**హైదరాబాద్, మార్చి 19:** నైరోబిలో జరిగిన కెన్యా సఫారీ ర్యాలీ డబ్ల్యుఆర్‌సి3 రేసింగ్‌లో హైదరాబాదీ నవీన్ పులిగిల్ల... మూసా షరీఫ్‌తో కలిసి పోడియం ఫినిష్ చేశాడు. ఎఫ్ఐఎ వరల్డ్ ర్యాలీ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన ఈ రేసులో భారత జోడీ మూడో స్థానం పొందారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతికూల పరిస్థితుల మధ్య జరిగిన ర్యాలీలో నవీన్, మూసా జోడీ ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ర్యాలీని 5 గంటల 22 నిమిషాల 17.9 సెకన్లలో ముగించిన ఈ జోడీ డబ్ల్యుఆర్‌సి3 క్లాస్‌లో మూడో స్థానంతో పాటు ఆఫ్రికన్ ఏఆర్‌సి3 క్లాస్‌లో రెండో స్థానం దక్కించుకుంది. అత్యంత హ్యాయర్ క్లాస్ కార్లు పోటీపడ్డ రేసులో ఓవరాల్‌గా 24వ స్థానంలో నిలిచి ఆకట్టుకున్నారు. ఇటీవలే ఐఎన్ఆర్‌సి 3టీ ఇండియన్ చాంపియన్‌గా నిలిచిన నవీన్..నైరోబీ ఆఫ్రికా ఈకో స్పోర్ట్స్‌లో ఫోర్డ్ ఫియస్టా కార్‌తో 338.34కిలోమీటర్ల దూరాన్ని చేరుకుని లక్ష్యాన్ని అందుకున్నారు. ఆఫ్రికాలో అప్పటికప్పుడు మారే వాతావరణ పరిస్థితులకు తోడు, రాళ్లతో కూడిన ప్రమాదకరమైన రోడ్లు, సవాలు విసిరే మలుపులు, రేసర్ల సామర్థ్యానికి పరీక్ష పెడతాయని నవీన్ చెప్పారు. తాను ఒక ర్యాలీగా భావించలేదని.. వేగం, నియంత్రణతో కూడిన క్రమశిక్షణతో సాగించిన్నారు. ప్రపంచ వేదికపై దేశం తరఫున ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉందన్నారు.

# అమెరికాపై వెనిజులా విజయం



**మియామి:** వెనిజులా బేస్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. రాజకీయ ఉద్రిక్తల వేళ అమెరికాను వారి సొంతగడ్డపై 3-2 తేడాతో ఓడించింది. మొదటి వరల్డ్ బేస్‌బాల్ క్లాసిక్ టైటిల్‌ను సాధించింది. తొమ్మిదో ఇన్నింగ్స్‌లో యూజెనియో సుయారెజ్ కీలక హిట్‌తో వెనిజులాకు చరిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ విజయాన్ని వెనిజులా ప్రజలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగెస్... ఈ విజయాన్ని జాతీయ ఉత్సవ దినంగా ప్రకటించారు. ఈ విజయం వెనిజులా ప్రజల ప్రతిభ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక దాడితో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తర్వాత ట్రంప్‌కు అనుకూలమైన డెల్సీ రోడ్రిగెస్ వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు.




# దేశీయ చమురుకంపెనీల షేర్లు పతనం!

**ముంబయి, మార్చి 19:** మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలతోముడిచమురుదరలు బ్యారెల్ 100 డాలర్లకుపైబడి అమ్మకాలు సాగడంతో దేశంగా ఉన్న మూడు ఆయిల్‌మార్కెటింగ్‌కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. హిందూస్తాన్ పెట్రోలియం,ఆరుశాతం క్షీణిస్తే భారత్ పెట్రోలియం ఐదుశాతం,ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మూడుశాతం క్షీణించాయి. బ్రెంట్‌ముడిచమురు మేనెల డెలివరీకి సెటిల్‌మెంట్లు 5.5శాతం పెరిగి బ్యారెల్‌కు 115డాలర్లుగా నమోదయ్యాయి. ఇరాన్ కీలక ఇంధనమౌలిక వనరులన్నింటిపైనా పశ్చిమాసియా దేశాలపై దాడులకు దిగింది.ఖతార్‌లోని భారీ ఎల్ఎన్‌జి కేంద్రంపై దాడిచేయడం కూడా ఇందుకు కారణం. ఇరాన్‌లోని సౌత్‌పార్‌గ్యాస్‌ఫీల్డ్‌పై జరిపిన ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఈ దాడులు చేపట్టింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ భారీ ఎల్ఎన్‌జి శుద్ధిహబ్‌పై ఇరాన్ దాడిచేయడంకూడా దేశీయ కంపెనీల షేర్ల తగ్గుదలకు కారణం అయింది. పశ్చిమాసియా యుద్ధవాతావరణంతోనే ముడిచమురు దరలు 50శాతానికిపైగా పెరిగాయి. దీనితో ఓఎంసి స్టాక్స్ 25శాతం నెలవారీగా క్షీణించాయి. ముడి చమురుధరలు అదే కాలంలో 57శాతంపెరిగాయి. గత మూడుదశాబ్దాలధరలతో పోలిస్తే భారీగా పెరుగుదలనమోదయింది.దీనివల్లనే ఓఎంసిల మార్కెటింగ్‌మార్జిన్‌లు దిగజారాయి. బ్లెండెడ్ మార్కెటింగ్ మార్జిన్లు లీటరుకు రూ.40కి దిగువనే నమోదయ్యాయి. రానురాను లీటరుకు రూ.60గా కూడా నమోదవుతాయి. సమయానుకూల ధరల నిర్ణయాలులేకుంటే చమురుకంపెనీల రాబడులు 90నుంచి 180శాతంవరకూ దెబ్బతినే అవకాశం ఉందని ఎలారా సెక్యూరిటీస్ హెచ్చరించింది.

# బులియన్ రంగానికి వార్ షాక్



**ముంబయి, మార్చి19:**అమెరికా సెంట్రల్ బ్యాంకు ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లపై యధాతథ స్థితిని ప్రకటించడంతో ఫ్యూచర్ మార్కెట్లలో పసిడి వెండిధరలు తగ్గాయి. పసిడి ఫ్యూచర్లు గురువారం సవరణలకు లోనయ్యాయి. పదిగ్రాముల బంగారం రూ.3500 వరకూ పడిపోయింది. అమెరికా డాలర్ పటిష్టం కావడం, ఫెడ్‌రిజర్వు మరింత నిఘా నేత్రంతో వ్యవహారించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇదే తీరు వెండిపైనా కనిపించింది.బంగారం ఎంసిఎక్‌లో ఇంట్రాడే ట్రేడింగ్‌లో 4.04 శాతం క్షీణించింది. అంటే రూ.6వేలు క్షీణించి రూ.1,46,859కి చేరితే వెండిధరలు కూడా 7.60శాతం క్షీణించి రూ.18వేలు పతనం అయింది.కిలోవెండి రూ.2,29,321కి చేరింది. అదేవిధంగా ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ డెలివరీకి నిర్దేశించినవి రూ.3616 క్షీణించి రూ.1.49 లక్షలుగా కొనసాగాయి.

# ఆల్‌టైమ్ కనిష్టానికి మారకం విలువ



**ముంబై, మార్చి 18 :** డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజుకో రికార్డు స్థాయికి దిగజారుతున్నది. గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో మరోమారు ఆల్‌టైమ్ కనిష్టానికి దేశీయ కరెన్సీ విలువ క్షీణించింది.ఈ ఒక్కరోజే 49 పైసలు పడిపోయి మును పెన్నడూ లేనివిధంగా 92.89 వద్దకు పతనమైంది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌పై 92.42 దగ్గర మొదలైన రూపాయి ట్రేడింగ్ క్షీణిస్తూ చివరకు 92.89 వద్ద ముగిసింది. ముందురోజు 92.40 దగ్గర స్థిరపడిన విషయం తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగబాకుతున్న ముడి చమురు ధరలు, భారతీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరుగుతున్న డిమాండ్, దేశీయ మార్కెట్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు రూపాయిని దెబ్బ తీస్తున్నాయని ఫారెక్స్ నిపుణులు అంచనా. భారత్‌లోకి దిగుమతయ్యే ప్రతి వస్తూత్పత్తి ధరను మరింత పెంచుతుందని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం విదేశాల నుంచి వచ్చే దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో రూపాయి క్షీణత యావత్తు దేశ ఆర్థికవ్యవస్థనే ప్రమాదంలో పడేస్తున్నదని హెచ్చరిస్తున్నారు.మరిన్ని డాలర్లను చెల్లించి కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని,ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం ఇంకా పెచ్చుమీరుతుందని అంటున్నారు.

# భెల్ జాయింట్ వెంచర్‌లో
# రూ.3064 కోట్ల పెట్టుబడులు




**న్యూఢిల్లీ, మార్చి 19:** ప్రభుత్వరంగంలోని భారత్ హెవి ఎలక్ట్రికల్స్ కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్‌కోల్ గ్యాసిఫికేషన్ కెమికల్స్‌లో రూ.3064.46 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. భెల్ ఈక్విటీ పరంగా ఈ పెట్టుబడి ఉంటుంది. నాలుగేళ్లపాటు ఈ పెట్టుబడుల మొత్తం సమానంగా కేటాయింపులు ఉంటాయని కంపెనీ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. భెల్ ఈక్విటీ పరంగా నాలుగేళ్లపాటు మొత్తం 3064.46 కోట్లు బిసిజిసిఎల్‌కు సాయం అందిస్తుందని వెల్లడించింది. భెల్ కోల్ ఇండియా జాయింట్ వెంచర్‌గా బిసిజిసిఎల్ నడుస్తోంది. భెల్‌కు 49శాతం, కోల్ ఇండియాకు 51శాతం వాటాలున్నాయి. 2024లో ఈ జాయింట్ వెంచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సంస్థ ఏర్పాటు లక్ష్యం కూడా రోజుకు రెండువేల టన్నుల బొగ్గు ఉత్పత్తిచేసి అమ్మోనియంనైట్రేట్‌ప్లాంట్‌కు సరఫరాచేయడమేనని తెలుస్తోంది. దీనికితోడు భెల్ బోర్డు డైరెక్టర్లు వందేభారత్ స్లీపర్‌ట్రెయిన్స్ నిర్వహణకోసం టిటాఘర్ రైల్ సిస్టమ్స్‌తో జాయింట్ వెంచర్‌కు కూడా ఆమోదం తెలిపారు. అయితే ఇందుకు సంబంధించి దీపమ్‌నుంచి అనుమతులు, ఆమోదం రావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే భెల్ మూడో త్రైమాసికంలో నికరలాభం 390.40 కోట్లు ఆర్జించింది. కీలకరంగాల్లో రాబడులు పెరగడమే ఇందుకు కారణం.కంపెనీ అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 134.70 కోట్లుమాత్రమే లాభం ఆర్జించింది. భెల్ మొత్తం రాబడులు రూ.8691.85 కోట్లుగా ఉంది. భెల్‌షేర్లు ఎన్ఎస్ఇలో 2.77శాతం దిగువన అంటే 252.85 వద్దట్రేడ్ అయి చివరకు మూడుశాతం దిగువన రూ.251.75వద్ద ట్రేడ్ అయ్యాయి.

## వాణిజ్యం




# హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఛైర్మన్ రాజీనామా

**ముంబయి, మార్చి 19:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తాత్కాలిక ఛైర్మన్ అతను చక్రవర్తి ఆకస్మికరాజీనామా ఆ బ్యాంకు షేర్లను అతలాకుతలం చేసాయి. సైద్ధాంతిక విభేదాలతోనే తాను రాజీనామాచేయాల్సి వచ్చిందని, బ్యాంకులో ఎలాంటి అవకతవకలు, సుపరిపాలన లోపాలు లేవని, వాటిపై చర్చించదలుచుకోలేదని కూడా చెప్పిన అతను చక్రవర్తి తన రాజీనామా పూర్తిగా సంస్థపరంగా సైద్ధాంతిక విభేదాలతోనే చేసినట్లు చెప్పారు.బ్యాంకులో తాను ఐదేళ్లపాటుపనిచేసానని, తాను ఎలాంటి అవకతవకలు చెప్పలేనన్నారు. నా సిద్ధాం తాలు బ్యాంకు తీరుకు సరిపోవడంలేదని అందువల్లనే తాను బయటికి రావాల్సి వచ్చిందన్నారు.

మాజీ ఉన్నతాధికారి అయిన చక్రవర్తి ఆర్థిక రంగంలో వృత్తినిపుణులు కూడా. 1985 బ్యాచ్ గుజరాత్ కేడర్ ఐఎఎస్ అధికారి కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖలో కార్యదర్శిగా కూడా పనిచేసి రిటైర్ అయ్యారు. దీపమ్ విభాగాన్ని పర్యవేక్షించిన చక్రవర్తి పెట్టుబడుల ఉపసంహారణ, హెచ్ ఎఫ్‌సి జంటసంస్థల విలీనంలోకీలకపాత్ర పోషించారు. 2021 మేనెలలో చేరిన ఆయన తనకు ఇంతకాలం మద్దతిచ్చినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్మన్ రాజీనామాతో బ్యాంకుషేర్లు 9శాతంవరకూ క్షీణించాయి. ఇంట్రాడే తర్వాత కూడా నాలుగునుంచి ఐదు శాతం దిగువన ట్రేడ్ అయ్యాయి.దీనితో బ్యాంకు మార్కెట్ విలువలు లక్షకోట్ల వరకూ ఆవిరి అయినట్లు నిపుణుల అంచనా.

కాగా బ్యాంకు తాత్కాలిక ఛైర్మన్‌గా కేకీ మిస్త్రీని నియమించింది. వెనువెంటనే ఆయన మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సి పటిష్టమైన విలువల వ్యవస్థ, పారదర్శకతతోను నడుస్తుందని, యాజమాన్యం పాలనాపరంగా ఉత్తమ ప్రమాణాలకే సమిష్టి కృషిచేస్తుందన్నారు.అతను చక్రవర్తి రాజీనామాపై స్పందిస్తూ ప్రత్యేకమైన అంశాలేమీ తన దృష్టికి రాలేదని, మేనేజ్‌మెంట్‌కూడా అనేక మంది ఇన్వెస్టర్లతో చర్చలు జరిపిందన్నారు.రాను న్న రోజుల్లో మేనేజ్‌మెంట్ పెద్ద వాటాదారులతో కూడా చర్చలు జరుపుతున్నదన్నారు. సిఇఒ శశిధర్ మాట్లాడుతూ అంతర్గత సమస్యలు, భిన్నాభిప్రాయాలు రాజీనామాకు కారణం కాదన్నారు. హెచ్‌డిఎఫ్‌సి పరిణామాలపై ఆర్బీఐకూడా స్పందించింది. వ్యవస్థాగత లోపాలేమీ బ్యాంకులో కనిపించలేదని, ఆయన రాజీనామా నిర్ణయం బ్యాంకువిచక్షణపైనే ఉంటుందని వెల్లడించింది.

# కుప్పకూలిన దలాల్ స్ట్రీట్
# రూ.13 లక్షల కోట్ల సంపద ఆవిరి

**ముంబయి, మార్చి 19:** మధ్యప్రాచ్యంలో యుద్ధపరిస్థితులు మరింత తీవ్రంకావడం, ఎఫ్ఐఐల విత్‌డ్రాలతోపాటు ద్రవ్యోల్బణం పెరగడం, ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు యధాతథంగా కొనసాగించడం వంటిపరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలు చవిచూసాయి. ముడి చమురు ధరలు కూడా బ్యారెల్ 100 డాలర్లకు పైబడటంతో చమురు, గ్యాస్ కంపెనీల షేర్లు భారీ ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్‌రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిఇఒరాజీనామా బ్యాంకింగ్‌రంగ షేర్లపై ప్రభావంచూపించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 2496 పాయింట్లు క్షీణించి 74,207.24 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ775 పాయింట్లు క్షీణించి 23,002.15 పాయింట్లవద్ద ముగిసింది.

గడచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, అండ్ నిఫ్టీ 2.87శాతం,2.71శాతంచొప్పున పెరిగిన సంగతి తెలిసిందే. మూడురోజుల లాభాలు ఒక్కరోజుతో ఆవిరి అయిపోయాయి. సెన్సెక్స్‌లో మొత్తం జాబితా అయిన కంపెనీల మార్కెట్ విలువలు 13 లక్షలకోట్లు హరించుకుపోయాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 3.04శాతం, బిఎస్ఇ 250స్మాల్‌క్యాప్‌సూచీ2.58శాతం క్షీణించాయి. మార్కెట్‌ధోరణులు మొత్తం క్షీణించాయి. విభాగసూచీలపరంగాచూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 1.98శాతం, నిఫ్టీ ఫార్మాసూచీ 2.35 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసిజి సూచీ 2.53శాతం చొప్పున దిగజారాయి.

ఇక నిఫ్టీ ఆటో సూచీ కూడా 4.25శాతం, రియాల్టీసూచీ 3.81శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీ 3.76శాతం చొప్పున క్షీణించాయి. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 92.89 వద్దముగిసాయి. అంతకుముందురోజు 92.40 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.ఎంసిఎక్స్‌లో పసిడిఫ్యూచర్లు ఏప్రిల్ రెండోతేదీనాటి




సెటిల్‌మెంట్లు 3.77శాతం క్షీణించి రూ.1,47,255వద్ద ముగిసింది.కమోడిటీమార్కెట్ పరంగా బ్రెంట్ ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్‌నాటికి 6.66డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 114.04 డాలర్లుగా కొనసాగింది.గ్లోబల్ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు దిగువస్థాయిలోనేముగిసాయి. ఇరాన్ వార్ ప్రభావం ఎక్కువచూపించింది. ఇక యూరోపియన్ సెంట్రల్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లు వడ్డీరేట్లు యధాతథంగా కొనసాగించాలని నిర్ణఇంచాయి. ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలే కారణంగా చూపుతున్నారు. స్విస్ నేషనల్‌బ్యాంకు కూడా తన పాలసీ రేట్‌ను మార్పులు చేయలేదు. యుకె నిరుద్యోగితరేటు 5.2 శాతంవద్ద స్థిరంగా కొనసాగింది.ఆసియా మార్కెట్లు మాత్రం ప్రతికూలంగా ముగిసాయి.

వాల్‌స్ట్రీట్ నష్టాలను ట్రాకింగ్‌చేస్తూ వెళ్లాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు ఈ ఏడాది కనిష్ట స్థాయిలోముగిసింది.బ్యాంక్ ఆఫ్ జపాన్ తన వడ్డీరేట్లను స్థిరంగా 0.75శాతంవద్దనే కొనసాగించింది. మలేసియా వార్షిక ద్రవ్యోల్బణం 1.4 శాతం గా ఉంది. మార్కెట్ అంచనాలకు దిగువనే ముగిసింది. అమెరికా మార్కెట్లలో 30స్టాక్ డౌజోన్స్ పారిశ్రామిక సగటు 1.63 శాతం క్షీణించింది.ఎస్అండ్‌పి500సూచీ కూడా1.36 శాతం, నాస్‌డాక్ కాంపోజిట్1.46శాతం పతనం అయ్యాయి.ఫెడ్‌రిజర్వు తన పాలసీరేట్లను స్థిరంగా 3.5 శాతంనుంచి 3.75శాతంవద్దనే కొనసాగించింది. ఛైర్మన్ జెరోమ్‌పావెల్ ద్రవ్యోల్బణం అనుకున్న స్థాయికి రాలేదని రేట్‌కట్‌లకు బ్రేక్‌వేసారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.